ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, మార్గశిర మాసం; తిథి: అమావాస్య తె.5.52 వరకు; నక్షత్రం: మూల మ.3.12 వరకు అనంతరం పూర్వాషాఢ; అమృతకాలం: ఉ. 8.24 నుండి 10.15 వరకు; వర్జ్యం: మ.1.30 నుండి 3.12 వరకు, రా.1.35 నుండి 3.19 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.36 నుండి నుండి 8.04 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:57 • సంచిక:261 • శనివారం 5 జనవరి 2019 • హైదరాబాద్ • పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

పంచాయతీలో పొగాకు

కాసుల రాశులు!

అసెంబ్లీ ఎన్నికల ఖర్చును తలదన్నే రీతిలో వ్యయం



- వెయ్యి ఓట్లున్న పంచాయతీల్లో రూ. 2 కోట్లు ఖర్చు ?
- రంగంలోకి ఇసుక, గ్రానైట్, రియల్ ఎస్టేట్ మాఫియా
- పల్లెల్లో విచ్చలవిడిగా ఏరులై పారుతున్న నగదు, మద్యం
- ప్రధాన రాజకీయ పక్షాలు బలపరిచిన అభ్యర్థులే బరిలోకి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అసెంబ్లీ ఎన్నికల ఖర్చును తలదన్నే రీతిలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు జగిత్యాల, భువనగిరి, ఖమ్మం లాంటి జిల్లాల్లోనూ ఒక్కో గ్రామ పంచాయతీలో సర్పంచ్ పదవికి రూ.కోటి నుంచి రూ.2 కోట్లను ఖర్చు చేసేందుకు ఆయా పార్టీల మద్దతుతో కొందరు నేతలు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. వెయ్యి ఓట్లున్న గ్రామ పంచాయతీలోనూ కోటి నుంచి కోటిన్నర రూపాయలను ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న గ్రామ పంచాయతీల్లో భూముల ధరలకు రెక్కలు రావడం, చాలా మంది స్థిరాస్తి వ్యాపారులు భూములను కొనుగోలుచేసి లే అవుట్లను సిద్ధంచేసి చదరపు గజాల రూపంలో విక్రయిస్తుండడంతో సర్పంచ్ పదవులకు డిమాండ్ పెరిగింది. లే అవుట్లను చేయాలన్నా, ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలన్నా గ్రామ పంచాయతీ కీలకం కావడంతో స్థిరాస్తి వ్యాపారులు తమకు అనుకూలమైన వారిని ఈ ఎన్నికల్లో సర్పంచ్‌గా బరిలో దింపి అందుకయ్యే పూర్తి ఖర్చును వారే భరిస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ, కొత్తూరు, కొందుర్గు, కేశంపేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఇబ్రహీం పట్నం, హయ్యత్‌నగర్ మండలాలు, మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం, తుక్కుగూడ ప్రాంతాలు, కల్వకుర్తి నియోజకవర్గంలోని ➪ 7వ పేజీలో...

పకడ్బందీగా పంచాయతీ

పోల్స్

పటిష్ట నిఘా

- శాంతిభద్రతలపై ప్రత్యేక చర్యలు
- ఈసీ నాగిరెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారి జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణను రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో కమిషనర్ నాగిరెడ్డి అధ్యక్షతన ➪ 3వ పేజీలో...



3 లో

ఆలస్యమే కొంపముంచింది

- అభ్యర్థుల ఎంపికలో జాప్యంతో నష్టం
- ఎంపీ అభ్యర్థులను ముందే ప్రకటించాలి
- అసెంబ్లీ పోల్స్‌పై కాంగ్రెస్ పోస్ట్‌మార్టం



చొప్పదండి, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీల నేతలు తెరాసలో చేరిన సందర్భంగా ప్రసంగిస్తున్న కేటీఆర్

శబ్ద విప్లవానికి ఉత్తమ్

గూబ పగిలింది

ఈవీఎంలు కాదు.. కాంగ్రెస్ నేతల బుర్రలు పాడయ్యాయి

- పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీనే కాదు
- సింహంలా కేసీఆర్ సింగిల్‌గా వచ్చి గెలిచారు
- పంచాయతీల్లోనూ తెరాసదే పైచేయి సాధిద్దాం
- పార్లమెంట్ ఎన్నికల్లోగా పార్టీని పటిష్టం చేద్దాం
- హుజూర్‌నగర్, చొప్పదండి కార్యకర్తల సమావేశంలో తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లలో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు కొట్టిపారేశారు. పని చేయనిది ఈవీఎంలు కాదని కాంగ్రెస్ పార్టీ నేతల బుర్రలు పని చేయలేదని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ఎన్నికల్లో తెరాస ధాటికి కాంగ్రెస్ పార్టీ నేతల కలలు చెదిరిపోయాయని ఎద్దేవా చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా చొప్పదండి, నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన ఆయా పార్టీల నేతలు శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో తెరాసలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. తెరాసకు ఘన విజయం కట్టబెట్టిన ప్రజాతీర్పుతో కాంగ్రెస్ పార్టీ ➪ 7వ పేజీలో...

రేపటి నుంచి కేసీఆర్ విదేశీ పర్యటన

- అరబ్ దేశాలకు పయనం
- 13 వరకు షెడ్యూల్
- పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పారిశ్రామిక పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు విదేశీ పర్యటనకు వెళుతున్నారు. ఈనెల 6 నుంచి 13 వరకు దుబాయ్ వెళుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దేశంలోనే అత్యుత్తమ ఇండస్ట్రియల్ పాలసీని అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం ఇతర రాయితీలు, ప్రోత్సాహకాలు, విద్యుత్, నీటి తదితర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక విధానాన్ని సిద్ధం చేసుకున్నారు. ఆదివారం ప్రత్యేక విమానంలో దుబాయ్ వెళుతున్న కేసీఆర్ బృందం రెండు, మూడు రోజులపాటు అక్కడే ఉండి పారిశ్రామిక, వాణిజ్యవేత్తలతో సమావేశం కానుంది. పెట్టుబడులకు నెలవుగా మారిన తెలంగాణకు రావలసిందిగా ఇండస్ట్రియల్ పాలసీపై వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. అక్కడి నుంచి మరికొన్ని అరబ్ దేశాల్లోనూ కేసీఆర్ బృందం పర్యటించనున్నట్లు విశ్వసనీయ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. సీఎం తీసుకున్న ➪ 7వ పేజీలో...

మిషన్ కాకతీయకు అవార్డు

2లో





డబుల్ బెడ్‌రూం ఇళ్లపై

కొత్త భరోసా

2019

డిసెంబర్‌కి లక్ష ఇళ్లు పూర్తి

వచ్చే ఏడాది మరో లక్ష

- ఇక నిర్మాణ ప్రక్రియపై సీఎం స్వీయ పర్యవేక్షణ
- ఆ దిశగా సరికొత్త కార్యాచరణ ప్రణాళిక
- పర్యవేక్షణ బాధ్యతలు ఎమ్మెల్యేలకు అప్పగింత
- 2022 నాటికి ప్రతి పేద కుటుంబానికీ సొంతిల్లు
- ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దశాబ్దాల తెలంగాణ ప్రజల కలను ప్రత్యేక రాష్ట్ర సాధనతో నిజం చేసిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పేద వర్గాల సొంతింటి కలను సాకారం చేసేందుకు చర్యలు ముమ్మరం చేశారు. అందుకోసం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం గృహ నిర్మాణ పథకంపై ఆయనే స్వయం పర్యవేక్షణ చేయాలనుకుంటున్నారు. 2018లో ఆశించిన పురోగతి సాధించక పోవడంతో 2019లో ఈ పథకం లక్ష్యం చేరుకునే దిశగా మార్గదర్శకాలు ఇచ్చారు. నిర్లక్ష్యానికి గల కారణాలను ➪ 2వ పేజీలో...

ఫిబ్రవరిలో

బడ్జెట్

- లోక్‌సభ ఎన్నికల తర్వాతే పూర్తిస్థాయి బడ్జెట్
- ఆన్‌లైన్‌లో ఆర్థికశాఖకు శాఖలవారీగా నివేదికలు

ఈసారి ఓటాన్ అకౌంటే

- ఫిబ్రవరిలో రెండు మూడు రోజులపాటు అసెంబ్లీ
- అప్పుడే ఎమ్మెల్యేల ప్రమాణం.. సీఎం కేసీఆర్ నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వచ్చే నెలలోనే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఈ దఫా తెలంగాణ ప్రభుత్వం కూడా మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టి ఆ తర్వాత ఆగస్టులో పూర్తిస్థాయి బడ్జెట్ ఆమోదించాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో 2019-20 వార్షిక బడ్జెట్ రూపకల్పన పనులను ఆర్థిక శాఖ ప్రారంభించింది. గతేడాది కేటాయింపుల ఆధారంగా శాఖలన్నీ తమ ప్రతిపాదనలతో పద్దులను సమర్పించేందుకు సిద్ధమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలకు, ప్రాధాన్యతలకు ఏ మాత్రం నిధుల లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. శాఖాధిపతులు ఆ దిశగానే కసరత్తు చేస్తున్నారు. తమ శాఖల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరిస్తూ ఆర్థిక శాఖకు ఆన్‌లైన్‌లో నివేదికలను సమర్పిస్తున్నాయి. సార్వత్రిక ➪ 7వ పేజీలో...



నయీం ఆస్తుల స్వాధీనానికి

రంగం సిద్ధం

- అటాచ్‌మెంట్ కోసం కోర్టుకు వెళ్లిన ఐటీశాఖ
- అతడి ఆస్తుల విలువ రూ.1200 కోట్లు

7 లో





అందమైన ప్రయాణం

ఎవరైనా చక్కటి పర్యాటక ప్రాంతానికి వెళ్లాంటే ప్రయాణం చేయాల్సిందే. కానీ ప్రయాణమే ఒక అద్భుతమైన పర్యాటకమైతే దాన్నే ప్యాలెస్ ఆన్ వీల్స్ అంటారు. దేశంలోని పర్యాటక ప్రాంతాలను కలుపుతూ వెళ్లే ప్యాలెస్ ఆన్ వీల్స్‌లో ప్రయాణం దేశంలోని ప్రతి ఒక్కరి కల. విదేశీయులను సైతం విపరీతంగా ఆకర్షించే ఈ రైల్లో సదుపాయాలు, అలంకరాలు రాజ మహల్‌ను తలపిస్తాయి. అందమైన పడక గదులు, అలంకృతమైన భోజనశాలలు, కారిడార్లు సైతం రాజఠీవితో ఉంటాయి. ప్యాలెస్ ఆన్ వీల్స్‌లో స్నానాల గదులు కూడా ఎంతో అభిరుచితో తీర్చిదిద్దారు. మొత్తానికి ఈ రైలు ఒక నడిచే రాచ మహల్‌గా ఉండడంతో దీనికి ప్యాలెస్ ఆన్ వీల్స్ అన్న పేరు సార్థక నామధేయంగా మారింది.



డబుల్ బెడ్‌రూం ఇళ్లపై కొత్త భరోసా



2019

- తొలి విడత పాలనతో వనరుల సమకూర్పు
- మలి విడత పాలనలో నిర్మాణాలపై దృష్టి
- పేదల కలను సాకారం చేయడమే లక్ష్యం
- కర్తవ్యదీక్షతో పనిచేయాలని అధికారులకు మార్గదర్శకాలు
- వచ్చే రెండేళ్లలో 2.72 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించి, లోపాలను సవరించే చర్యలకు ఆదేశాలిచ్చారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గడువు దాటకముందే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళను నిర్మించి ప్రభుత్వ ప్రతిష్టను నిలబెట్టాలన్న పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. ఆ దిశగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధంచేసుకుని అమలు ప్రారంభించారు. నిజానికి ఈ ప్రక్రియ గత ఏడాదిలోనే ప్రారంభమైనప్పటికీ ఇళ్ళ నిర్మాణానికి అవసరమైన స్థలాల సేకరణకే ఏడాది కాలం పట్టింది. ప్రస్తుతానికి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో స్థలాల సేకరణ ప్రక్రియ ముగియడంతో నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాని సీఎం కేసీఆర్ ఆదేశించారు. 2018లో సుమారు 60 నియోజకవర్గ కేంద్రాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణాన్ని స్వయంగా పర్యవేక్షించడంతో కొంత పురోగతి సాధించగలిగారు. మిగిలిన నియోజకవర్గాల్లో ఈ ఏడాది సాధ్యమైనంత త్వరలో పనులు ప్రారంభించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్ళను జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినం నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించనున్నారు.

దేశంలోనే ప్రప్రథమంగా మొదలుపెట్టిన ఈ ప్రతిష్టాత్మకమైన పథకంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరగకుండా, అనర్హులకు ఏమాత్రం అవకాశం లేకుండా ఉండేందుకు లబ్ధిదారుల ఎంపికను రాజకీయ ప్రమేయం లేకుండా అధికారులకే అప్పగించారు.

తొలి దశలో లక్ష ఇళ్లు...
డిసెంబర్‌కు లబ్ధిదారులకు అప్పగింత

రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో కలిపి వచ్చే రెండేళ్ళలో 2,72,763 ఇళ్ళు నిర్మించాలని సంకల్పించారు. తొలిదశలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో లక్ష ఇళ్ళు పూర్తిచేసి ఈ ఏడాది డిసెంబర్ నాటికి లబ్ధిదారులకు అప్పగించాలని గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులకు గడువు విధించారు. వచ్చే ఏడాది మలిదశ నిర్మాణాలు పూర్తిచేసి మండల కేంద్రాల్లో మరో లక్ష ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని ధృడ సంకల్పంతో ఉన్నారు. అందుకు 2020 డిసెంబర్‌లోగా లక్ష్యాన్ని చేరుకోవాలని గడువును నిర్దేశించారు. ఇక 2021నాటికి గ్రామస్థాయిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ళను పూర్తిచేసి 100శాతం సొంతిళ్ళులేని కుటుంబంమంటూ లేకుండా చేయాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు. 2022నాటికి అక్కడక్కడ మిగిలివున్న వారందరినీ గుర్తించి పక్కా గృహం నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో ముందడుగు వేస్తున్నారు. ఆ మేరకు లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను మరోసారి పరిశీలించి అర్హుల జాబితాలను సిద్ధం చేయనున్నారు. ఇప్పటివరకు సూక్ష్మ పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్లు ఇప్పటి వరకు 2,33,582 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు మంజూరు చేశారు. వీటి నిర్మాణానికి ఆర్థికశాఖ అనుమతి ఇవ్వడంతో నిర్మాణ ప్రక్రియ ప్రారంభమైంది. ఎంపికైన లబ్ధిదారుల జాబితాలో 2,09,744 ఇళ్ళ నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించిన విషయం తెలిసిందే. అయితే వివిధ కారణాల వల్ల ఈ ప్రక్రియలో కొంత జాప్యం జరుగడంతో ఈ ఏడాది దాన్ని నివారించి లక్ష్యాన్ని చేరుకోనున్నారు. అధికారులు తెలిపిన సమాచారం మేరకు 1,31,230 ఇళ్ళ నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తయింది. కొన్ని నియోజకవర్గాల్లో నిర్మాణాల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. మరికొన్ని చోట్ల నెల రోజుల్లోగా టెండర్లను పూర్తి చేసేందుకు హౌసింగ్ బోర్డు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండల కేంద్రాల్లోనూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్లు స్థలాల సేకరణపై దృష్టి కేంద్రీకరించారు. నేరుగా పేద వర్గాల జీవన ప్రమాణాలతో ముడి పెట్టుకుని ఉన్న ఈ పథకాన్ని లక్ష్యంలోపు పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగిస్తే బంగారు తెలంగాణ నిర్మాణంలో కొంతమేరకు సఫలీకృతమైనట్టేనని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు.

అధికారిక సమాచారం మేరకు జిల్లాల వారీగా మంజూరైన డబుల్ బెడ్‌రూం గృహ నిర్మాణ పథకంలో ఇళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లా	కేటాయించిన ఇళ్లు
గద్వాల	2,800
మహబూబ్‌నగర్	9,240
నాగర్‌కర్నూల్	4,945
వనపర్తి	2,620
మెదక్	4,996
సంగారెడ్డి	5,525
సిద్దిపేట	12,114
కామారెడ్డి	6,050
నిజామాబాద్	10,615
ఆదిలాబాద్	4,010
కొమరంభీమ్	2,550
మంచిర్యాల	4,670
నిర్మల్	3,520
జగిత్యాల	8,840
కరీంనగర్	7,092
పెద్దపల్లి	3,675
రాజన్న సిరిసిల్ల	4,390
భూపాలపల్లి	5,868
జనగాం	3,536
మహబూబాబాద్	4,393
వరంగల్ రూరల్	4,270
వరంగల్ అర్బన్	6,159
భద్రాద్రి కొత్తగూడెం	6,268
ఖమ్మం	8,630
నల్గొండ	7,675
సూర్యాపేట	5,644
యాద్రాద్రి	3,856
వికారాబాద్	5,560
రంగారెడ్డి	6,375
మేడ్చల్	1,050
జీహెచ్ఎంసీ	1,00,000

ఐరిస్‌తోనూ రేషన్ సరుకులు

- 5,186 షాపుల్లో ప్రారంభం
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ: కమిషనర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజా పంపిణీ ద్వారా రేషన్ సరుకులు తీసుకునేందుకు లబ్ధిదారులకు సులువుగా, ప్రయోజనం కలిగించేలా తెలంగాణ పౌర సరఫరాలశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వేలిముద్రలతో పాటు కనుపాపల (ఐరిస్) ఆధారంగా లబ్ధిదారులకు సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 1వ తేదీనుంచి మొదటి విడతలో 16 జిల్లాల్లోని 5,186 షాపుల్లో ఐరిస్ విధానాన్ని ప్రారంభించారు. ఏడాది నుంచి పౌర సరఫరాలశాఖ ఈ-పాస్ విధానం ద్వారా సరుకుల పంపిణీ చేస్తోంది. కొంతమందిలో ముఖ్యంగా వృద్ధులు, మహిళల వేలిముద్రలు అరిగిపోవడంవల్ల ఈ-పాస్ మెషీన్లు ధృవీకరించడం లేదు. దీంతో ప్రతినెల రేషన్ సరుకులు తీసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. లబ్ధిదారులు అసౌకర్యానికి గురికావద్దనే ఉద్దేశంతో వేలిముద్రలు సరిపడని చోట ఆయా ప్రాంతాల్లో వీఆర్‌వో, వీఏవో, పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్లకు అథంటికేషన్‌తో వస్తున్న సమస్యలను అధిగమించడానికి ఐరిస్ విధానం పరిష్కారమని భావించి 17,200 రేషన్ షాపుల్లో దశల వారీగా ఐరిస్ విధానం అమలుకు శ్రీకారం చుట్టారు. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లోని రేషన్ షాపుల్లో ఐరిస్ విధానం అమలు తీరును ఆ శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో అన్ని షాపుల్లో ఈ విధానాన్ని అమల్లోకి తెస్తామన్నారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా, అర్హులైన పేదలకు మరింత సులువుగా నిత్యావసర సరుకులు అందించడానికి ఐరిస్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మొదటి విడతలో ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, కొత్తగూడెం, గద్వాల, నిర్మల్, భువనగిరి, మంచిర్యాల, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, మహబూబ్‌నగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోని 8,635 షాపులకుగానూ 5,186 షాపుల్లో ఐరిస్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ నాలుగు రోజుల్లో 15.20 లక్షల మంది రేషన్ సరుకులు తీసుకున్నారని సబర్వాల్ తెలిపారు.



అన్ని జిల్లాల్లో హ్యాండీక్రాఫ్ట్ స్టాల్స్

- తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్ గుప్తా
- ఎన్టీఆర్ స్టేడియంలో గోల్కొండ క్రాఫ్ట్ బజార్ ప్రారంభం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలంగాణ హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్ గుప్త తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆ సంస్థ ఏర్పాటు చేసిన గోల్కొండ క్రాఫ్ట్ బజార్‌ను నాబార్డ్ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్‌తో కలిసి సంపత్‌కుమార్ గుప్తా శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శన 13 వ తేదీ వరకు కొనసాగనుంది.ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో గోల్కొండ హ్యాండిక్రాఫ్ట్ షోరూంలను ప్రారంభించనున్నామని, ఇందులో భాగంగానే త్వరలోనే కరీంనగర్, సిద్దిపేటలలో షోరూంలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. వరంగల్‌లో హస్త కళాకారుల క్లస్టర్‌ను కూడా ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం లక్ష మంది కళాకారులున్నారని, వీరికి తోడుగా ఏటా 15 వేల మంది కళాకారులను తమ సంస్థ తయారు చేస్తుందని అన్నారు. కళాకారులను ప్రోత్సహించాలన్నది ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సంకల్పమని, ఇందుకోసం అన్ని రంగాలలోని కళాకారులకు ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ సహకారంతో వేర్వేరు జిల్లాలలో తయారు చేసిన ఉత్పత్తులను మలేషియాలోనూ విక్రయిస్తున్నామని అన్నారు. సుమారు 120 మంది కళాకారులు తయారు చేసిన వేర్వేరు ఉత్పత్తులను ప్రదర్శనలోఉంచామని, కళాకారులకు కావాల్సిన వసతి సౌకర్యాలన్నింటినీ కల్పించామని చెప్పారు.



25 నాబార్డ్ స్టాల్స్

నాబార్డ్ సీజీఎం విజయ్‌కుమార్ మాట్లాడుతూ, కళాకారులు తాము తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు ఈ ప్రదర్శన ఎంతగానో ఉపకరిస్తుందని, బల్క్ ఆర్డర్ల ధరను కొంత తగ్గించి విక్రయిస్తే మార్కెట్లో మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. నాబార్డ్ కూడా కళాకారులను ప్రోత్సహిస్తుందని, దేశంలోని అనేక మంది కళాకారులను నాబార్డ్ ఆదుకుంటోందన్నారు. ఈప్రదర్శనలో 25 స్టాల్స్‌ను నాబార్డ్ ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. నాబార్డ్‌తోపాటు స్థానిక బ్యాంకుల నుంచి కళాకారులకు రుణాలను ఇప్పించేందుకు సహకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జ్యూట్‌బోర్డ్ రీజినల్ డైరెక్టర్ పి. నర్సింలు, నాబార్డ్ డీజీఎం రమేష్, సంస్థ మేనేజర్ మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో డోక్రరూపాలు, బిద్రి, చేర్యాల్, నిర్మల్ పెయింటింగ్స్, ఇత్తడి కళాకృతులు, లక్కగాజులు, నిర్మల్, బొంతపల్లి కలప ఆట వస్తువులు, బంజారా ఎంబ్రాయిడరీ, వరంగల్ ధర్రీలు, ముత్యాలు, ఇమిటేషన్ జ్యూవెల్లరీ, జ్యూట్ వస్తువులు, టెర్రకోట కళాకృతులు, బ్లూపోటరీ, కలంకారి ప్రింట్స్, పెయింటింగ్స్, పోచంపల్లి చీరలు, గద్వాల్, నారాయణపేట్ చీరలు, బనారస్ చీరలు, భాగల్‌పూర్ చీరలు, కశ్మీరీ చీరలు, చంధేరీ చీరాలు, కోసా చీరలు, లక్నో చికన్ ఎంబ్రాయిడరీ, ఇతర హస్తకళలు, టెక్స్‌టైల్స్ స్టాల్స్ ఉన్నాయి.

సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టుకు నీరివ్వండి

సీఎస్‌కు భట్టి విక్రమార్క వినతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముందు ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సాగర్ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సుమారు లక్షా 50వేల ఎకరాల్లో పంట ఇప్పటికే ఎండిపోయిందని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.



కాళేశ్వరానికి కావలసినంత కరెంట్

5వేల మెగావాట్ల విద్యుత్ సరఫరాకు సిద్ధం

- విద్యుత్ చౌర్యానికి అడ్డుకట్ట వేసి ఆర్థిక లోటు భర్తీ
- తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ మిన్న
- డివిజన్ స్థాయిలో విద్యుత్ ఆడిట్ చేస్తే మేలు
- టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు



యాదగిరిగుట్ట, ప్రభ న్యూస్ : ముఖ్యమంత్రి కేసీఆర్ మానసపుత్రిక, రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు అవసరమైన 5000 మెగా వాట్ల విద్యుత్ సరఫరాకు తమ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి. ప్రభాకర్‌రావు ప్రకటించారు. పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో తెలంగాణ పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతిపాదిత అతిథి గృహానికి టీఎస్ ఎస్‌పీడీసీఎల్ జి. రాఘురామరెడ్డి, టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఎ. గోపాల్‌రావుతో కలిసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ట్రాన్స్‌కో, జెఎన్‌కో, డిస్కమ్‌ల డైరెక్టర్లు పాల్గొన్న సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

2018లో అద్భుత ఫలితాలు

రాష్ట్ర విద్యుత్ రంగంలో 2018 సంవత్సరం రాష్ట్ర విద్యుత్ రంగంలో గొప్ప సంఘటనలకు నిలయంగా మారిందని , ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా వ్యవసాయ రంగంతో పాటు ఇతర రంగాలకు 24 గంటల నిరంతర విద్యుత్‌ను సరఫరా చేశామన్నారు. ఈ విషయంలో గవర్నర్ తనను అభినందించినప్పుడు ఆ ఘనత యావత్తు సిబ్బందిదని చెప్పామన్నారు. ఈనాడు విద్యుత్ మిగులు రాష్ట్రంగా మారామని, ఆనాడు కరెంట్ వస్తే వార్త, ఈనాడు కరెంట్ లేకుంటే వార్తగా పరిస్థితి మారడం గర్వకారణమని అన్నారు. తలసరి విద్యుత్ వినియోగంలో జాతీయ స్థాయి కంటే తెలంగాణ అగ్రభాగాన నిలుస్తోందన్నారు. నిరంతర విద్యుత్ సాధనకు ఆనాడు నాగార్జున సాగర్‌లో సీఎండీలు, డైరెక్టర్లు మేధో సదస్సును నిర్వహించుకున్న తరహాలో ఈనాడు కూడా నిర్వహించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

అత్యాధునిక మీటర్లతో చౌర్యానికి బ్రేక్

ప్రతి నెల విద్యుత్ రంగ ఖర్చులు 2770 కోట్లు కాగా, ఆదాయం 1935 కోట్లు అని, ప్రతి నెల 800 కోట్లు లోటుగా ఉందన్నారు. ఆర్థిక పరిపుష్టి కోసం విద్యుత్ ఆడిట్ ప్రతి డివిజన్ స్థాయిలో చేసుకోవాలని, లోపాలను ఎక్కడికక్కడ సరిదిద్దుకుంటూ విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని, అత్యాధునిక కరెంట్ మీటర్లను బిగించాలని పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూషన్ రంగంలో 21,500 కోట్లు పెట్టుబడులు పెట్టామని, మరో 40 వేల కోట్లు అవసరమన్నారు. 24 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో పెద్ద మనసుతో క్రమబద్ధీకరించారని అంటూ హోదా కన్నా గుర్తింపు మిన్న అని ప్రభాకర్ రావు సూచించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్. మధుసూదన్ రెడ్డి సభాధ్యక్షత వహించగా, సెక్రటరీ జనరల్ బీసీరెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ కోరిన పలు కోరికలు విధానపరమైనవి అయినందున బోర్డు మీటింగ్‌లో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని ఆయన సూచించారు. ఈ సందర్భంగా 2019 కొత్త సంవత్సరం డైరీతో పాటు క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.

మిషన్ కాకతీయకు సీబీఐపీ అవార్డు

- చెరువుల పునరుద్ధరణ, నీటి నిల్వ సామర్థ్యం పెంపుపై చేసిన కృషికి దక్కిన గుర్తింపు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: నీటి పారుదల రంగంలో విశేషకృషి చేస్తూ ఆదర్శంగా నిలిచేవారికి కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా అందజేస్తున్న ప్రతిష్టాత్మక 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ)' అవార్డుకు తెలంగాణ రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ విభాగం అందుకుంది. దేశ రాజధాని న్యూఢిల్లీలోని స్కోప్ కాంప్లెక్స్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కే. శ్యామ్ సుందర్ ఈ అవార్డును అందుకున్నారు. కేంద్ర విద్యుత్‌శాఖ సహాయ మంత్రి ఆర్కే సింగ్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. సాగునీటి వనరుల నిర్వహణలో మెరుగైన పనితీరును ప్రదర్శిస్తూ 'మిషన్ కాకతీయ' పథకం ద్వారా చెరువులు, సరస్సుల పునరుద్ధరణకు కృషి చేసినందుకు ఈ అవార్డు లభించింది. దేశంలోనే తెలంగాణ రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ విభాగాన్ని అగ్రగామిగా నిలిపిన చీఫ్ ఇంజనీర్ కే. శ్యామ్ సుందర్‌ను ఈ అవార్డు కోసం ఎంపిక చేసినట్టు కొద్ది రోజుల క్రితమే సీబీఐపీ జ్యూరీ ప్రకటించింది.

కేసీఆర్ కృషి అభినందనీయం

అవార్డు అందుకున్న అనంతరం తెలంగాణ రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కే. శ్యామ్ సుందర్ మీడియాతో మాట్లాడుతూ 2015 మార్చి 12న కామారెడ్డి సదాశివనగర్‌లో మిషన్ కాకతీయ పథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో మిషన్ కాకతీయ పథకాన్ని ప్రారంభించారని, అది గ్రామీణ జీవనాన్ని బలోపేతం చేస్తూ సత్ఫలితాలనిస్తోందని వ్యాఖ్యానించారు. మిషన్ కాకతీయ సాధిస్తున్న విజయాలను తెలుసుకునేందుకు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు అసక్తి చూపించాయని శ్యామ్ సుందర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ. 8,700 కోట్లతో 27,167 చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టామని, మిషన్ కాకతీయతో భూగర్భ జలాల నిల్వలు గణనీయంగా పెరిగాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మిషన్ కాకతీయకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు.

చిన్న నీటి వనరులకు అవార్డు శుభ పరిణామం

తెలంగాణలో అమలు చేస్తున్న మిషన్ కాకతీయ పథకం ద్వారా అద్భుతమైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో చిన్న నీటి పారుదల శాఖకు ప్రతిష్టాత్మక అవార్డు దక్కడం శుభపరిణామమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అన్నారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ అవార్డు తెలంగాణకు దక్కడం ఇక్కడ అమలవుతున్న అద్భుతమైన పథకాలకు నిదర్శనమని పేర్కొన్నారు.



విజయ పథకాలు!

కోటిన్నర మందికి ప్రభుత్వ పథకాలతో లబ్ధి

- పంచాయతీ ఎన్నికల్లో కలిసొస్తాయని తెరాస ధీమా
- గ్రామాల్లో ఏ కుటుంబంలో చూసినా ఏదో ఒక పథకం లబ్ధిదారులే
- విద్య, వైద్యం, వ్యవసాయం, రేషన్, పెన్షన్, బీమాతో ధీమా
- బడ్జెట్ లో సింహభాగం గ్రామస్వరాజ్యానికే ఖర్చు
- గ్రామ సమరంలో అన్ని స్థాయిల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత గ్రామాల్లో వేడెక్కిక రాజకీయ వాతావరణం ఏ కోణంలో చూసినా అధికార పార్టీవైపే మొగ్గు చూపుతోంది. లెక్కకు మించి అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రతి కుటుంబంలోనూ ఒకరిద్దరు లబ్ధిదారులు కనిపిస్తున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, రేషన్, పెన్షన్, బీమా తదితర పథకాలతో పల్లె ప్రజలు కొండంత ధీమాతో ఉన్నారు. ఇవి పార్టీలకు అతీతంగా జరిగే ఎన్నికలే అయినప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు మించిన రాజకీయ జోక్యం ఉంటుంది. ఎవరికి వారు తమపార్టీకి చెందిన అభ్యర్థులనే సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలన్న తాపత్రయంతో లక్ష్యంతో అన్నిస్థాయిల్లో ప్రజా ప్రతినిధులు ఎన్నికల్లో భాగస్వామ్యం పం చుకుంటారు. రాష్ట్రాన్ని యూనిట్‌గా చేసి చూస్తే అనధికారికంగా ఎన్నికల ఖర్చు సార్వత్రిక ఎన్నికలకు 200శాతం అధికంగా ఉంటుంది.

సబ్సిడీ గొర్రెల పథకం అమలుకు ఏటా రూ.6వేల కోట్లు, పాడిగేదెల పంపిణీ పథకానికి రూ.2వేల కోట్లు, జల వనరుల్లో ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమానికి రూ.1500 కోట్లు ఇలా చెప్పుకుంటూపోతే బడ్జెట్‌లో ప్రణాళికాబద్ధంగా ఖర్చుచేసే నిధుల వ్యయం దాదాపు రూ.80వేల కోట్లు గ్రామీణ ప్రాంతాల్లో వనరుల పెంపు, కులవృత్తుల ప్రోత్సహం, రాయితీలకే ఖర్చవుతోంది. చేనేత కార్మికులకు నూలు, రసాయనాలను 50 శాతం సబ్సిడీపై సరఫరా చేయడం, గీత కార్మికులకు తాటిచెట్లపై ఉన్న పన్నును రద్దు చేయడం, రజకులకు దోభీఘాట్లను నిర్మించి ఇవ్వడం, నాయిబ్రాహ్మణులకు నవీన క్షౌరశాల కోసం రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించడం, బ్యాంకులతో సం బంధం లేకుండా మహిళా సంఘాలు, యువజన సంఘాలకు ఉపాధి రుణాలివ్వడం పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల విజయాన్ని ధృవీకరిస్తున్నాయి.

గ్రామాల్లో కులవృత్తుల ప్రోత్సాహం

హామీల అమలుతో లాభం

పోటాపోటీగా జరుగనున్న ఈ ఎన్నికల్లో ప్రభుత్వమిచ్చిన వాగ్దానాల అమలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పటికే అమల్లో ఉన్న అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగించడం, తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కసరత్తు జరుగుతుండడం పట్ల మెజారిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర వార్షిక ఆదాయం దాదాపు రూ.90వేల కోట్లు కాగా, కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే వాటా దాదాపు రూ.40వేల కోట్లు ఉంటుంది. గడిచిన రెండేళ్ళ బడ్జెట్‌ను పరిశీలిస్తే రూ.లక్షా 60వేల కోట్లు దాటింది. ఈ నిధులను కేటాయింపు, వ్యయంలో ఎక్కువ ప్రాధాన్యత గ్రామాలకే ఉండడం, మిన్ కాకతీయ, మిషన్ భగీరథ, ఉపాధి హామీ, రహదారుల అభివృద్ధి, హరితహారం, పేదలకు మెరుగైన వైద్య సేవలు తదితర అనేక పథకాల ద్వా రా బడ్జెట్‌లో సింహభాగం ప్రత్య క్షంగా, పరోక్షంగా గ్రామీణాభి వృద్ధికే చెందుతుండ డంతో గత కొన్నే ళ్ళుగా అభివృద్ధి కళ్ళ ముందు కనిపి స్తోంది.

ఆ పథకాలే కీలకం

వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సరికొత్త కార్యక్రమాలు తెరాస వర్గానికి అండగా నిలువనున్నాయి. గొర్రెలు, బర్రెలు, చేపలు, వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు ఇలా కొన్ని ప్రతిష్టాత్మక పథకాల ద్వారా 50 నుంచి 100శాతం సబ్సిడీతో కుల వృత్తులకు భరోసా ఇవ్వడంతో గ్రామీణ ప్రజల్లో నమ్మకం రెట్టింపయింది. అన్ని మతాల ఆత్మగౌరవం కోసం దసరా, బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్ పండగలను అధికారికంగా నిర్వహిస్తుండడంతో సామాజిక భేదాలు తొలగిపోయాయి. సామాజిక, వ్యక్తిగత ప్రయోజనాలు, కులవృత్తులు, ఉపాధి రంగాలతోపాటు దాదాపు ఇరవైకి పైగా సంక్షేమ కార్యక్రమాలతో కేసీఆర్ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో సింహభాగం గ్రామస్వరాజ్యానికే ఖర్చు చేస్తోంది.



(ఫైల్)

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ జేజేలు

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు విస్తృత ప్రయోజనాలతో ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నాయి. చౌకధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ, దాదాపు 45 లక్షల మంది హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం, విపత్తు మృతులకు ఆర్థిక సాయం, ఆటోలు, ట్రాక్టర్లపై రవాణా పన్ను రద్దు చేయడం లాంటి కొత్త కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం అంచనాకు మించి పెరిగింది.

కలిసిరానున్న పథకాలు

ఈ ఏడాది అమలుకానున్న ఏకకాలంలో రుణ మాఫీ, ఆసరా పెన్షన్ పెంపు, నిరుద్యోగ భృతి, బ్యాం కులతో సంబంధం లేకుండా కొత్త ఉపాధి పథకాల అమలు ఇవన్నీ వచ్చే ప్రభుత్వానికి పంచాయతీ ఎన్నికల్లో కలిసివస్తున్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయ్యాక వరుసగా మొదటి మూడేళ్ళు ఆర్థిక వృద్ధిరేటు 17 శాతంగా నమోదైంది. ఈ ఏడాది వృద్ధిరేటు 19.7 శాతానికి పెరిగింది.

గణనీయంగా పెరిగిన లబ్ధిదారులు

దారిద్య్ర రేఖకు దిగువనున్న కుటుంబాల ఆదాయ పరిమితిని రూ.75వేల నుంచి రూ.2 లక్షలకు పెంచడంతో సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. తద్వారా ప్రభుత్వం ప్రతియేటా రూ.5వేల కోట్ల వరకు అధికంగా ఖర్చు చేస్తోంది. అలాగే అత్యంత కీలకమైన ఆసరా పెన్షన్ల పథకం ద్వారా దాదాపు 40 లక్షల మందికి నెలనెలా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పెన్షన్లు ఇస్తున్నారు. అందుకు ఏటా సుమారు రూ.5,500 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా రూ.1000 పెన్షన్ ఇస్తున్నారు. అందుకు ఏటా రూ.1000 కోట్లఖర్చవుతోంది.

గ్రామాల్లో బడుగుల ఆర్థిక స్వావలంబన

గ్రామాల్లో బడుగు బలహీన వర్గాల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకుగానూ ఏటా రూ.1000 కోట్లు, మూడెకరాల భూ పంపిణీకి రూ.1500 కోట్లు, దళిత, గిరిజన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా కార్యక్రమాలు గ్రామాల్లో ప్రధాన ఆకర్షణగా కనిపిస్తున్నాయి. అలాగే కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి కేటాయింపులను మించి మైనారిటీల సంక్షేమ కార్యక్రమాలకు ఏటా రూ.4వేల కోట్లు ఖర్చు, రంజాన్, క్రిస్మస్ పండగ సందర్భాల్లో గిఫ్టులు పంపిణీ చేసేందుకు మరో రూ.4వేల కోట్లు, ఇఫ్తార్, క్రిస్మస్ విందులకు రూ.500 కోట్ల చొప్పున కేటాయిస్తోంది.

సామాజిక బాధ్యతకు పెద్దపీట

గ్రామాల్లో పురాతన ఆలయాల ప్రాశస్త్యాన్ని కాపాడేందుకు అమలు చేస్తున్న ధూపదీప నైవేద్య పథకానికి ఏటా రూ.1000 కోట్లు ఖర్చు చేస్తున్నారు. కేసీఆర్ కిట్ల పంపిణీకి రూ.3వేల కోట్లు, అమ్మ ఒడి వాహనాల నిర్వహణ ఖర్చు రూ.500 కోట్లు, బాలికా ఆరోగ్యరక్ష పథకం ద్వారా ఏటా సుమారు 10 లక్షల మంది యుక్త వయసు ఆడపిల్లలకు హెల్త్ హైజెనిక్ కిట్లు పంపిణీ చేయడం రాజకీయాలకు అతీతంగా హర్షిస్తున్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే దండన

ఈసీ నాగిరెడ్డి హెచ్చరిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘనకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి.నాగిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పంచాయతీ ఎన్నికల పరిశీలకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగిరెడ్డి పంచాయతీ ఎన్నికల వ్యయం నమోదుపై అధికారులకు ప్రత్యేక ఆదేశాలిచ్చారు. అభ్యర్థుల ఎన్నికల ప్రచారాలు, ఎన్నికల ఖర్చులు తదితర అంశాలపై సూక్ష్మస్థాయి నిఘా పెట్టాలని హెచ్చరించారు. ఎన్నికల సంఘం విధించిన పరిమితికన్నా ఎక్కువ ఖర్చులు చేస్తున్నట్టు గుర్తిస్తే అటువంటి వారిపై వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా జరుగుతున్నప్పటికీ ఎన్నికల పరిశీలకులను అధికంగానే నియమించినట్టు తెలిపారు. నిస్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాలను ఆన్‌లైన్‌లో పెట్టినట్టు వెల్లడించారు. ఓటర్లకు అవసరమైన ఫోటో గుర్తింపు స్లిప్పులు పంపిణీ చేయడానికి కూడా అవసరమైన చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఎక్కడైనా రిగ్గింగ్ జరిగినట్టు నిర్ధారించుకుంటే మళ్లీ రీపోలింగ్ జరిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎక్కడైనా ఎన్నికల సంఘం ప్రకటించిన ఖర్చులకు మించి ఎన్నికల వ్యయానికి పాల్పడుతున్నట్టు సమాచారం వస్తే వెంటనే వారిపై మరింత నిఘా పెంచాలన్నారు.

మున్సిపాలిటీల్లో కోడ్ వర్తించదు

గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా అమల్లో ఉన్న ఎన్నికల కోడ్ సమీపాల్లో ఉండే మున్సిపాలిటీలు, కార్పోరేషన్లకు వర్తించదని కమీషనర్ నాగిరెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో కూడా ఎన్నికల కోడ్ ఉండదన్నారు. గ్రామ పంచాయతీల్లో కూడా ఆన్‌గోయింగ్ పథకాల పనులపై ఎటువంటి ఆంక్షలు ఉండవన్నారు. కొత్త పథకాలు మాత్రమే చేపట్టరాదని హెచ్చరించారు. ఎవరిపైనా వత్తిడి చేసి గ్రామ పంచాయతీ ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పంచాయతీలో పోలీసులు అందుబాటులో ఉంటారని, అవసరమైతే అదనపు బలగాలు కూడా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ఇప్పటివరకూ కోడ్ ఉల్లంఘన కేసు నమోదు కాలేదని కమీషనర్ నాగిరెడ్డి పేర్కొన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖ కమీషనర్ నీతూ ప్రసాద్‌తో పాటు పలువురు ఆడిట్ అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పంచాయతీ పోల్స్

(మొదటిపేజీ తరువాయి)

గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి, డీజీపీ మహేందర్ రెడ్డి పంచయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో శాంతిభద్రతలు, రవాణా ఏర్పాట్లు, ఎన్నికల బడ్జెట్, పోలింగ్ సిబ్బంది నియామకం తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో 12,732 గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు జరగనుండటంతో ఎక్కడా ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. తొలిదశలో 197 మండలాల పరిధిలోని 4,480 గ్రామ పంచాయతీలకు, వాటి పరిధిలోని 39,832 వార్డు స్థానాలకు ఈ నెల ఏడు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నందున ఈ పంచాయతీల్లో అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని నిర్ణయించారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు అనుచరులు, మద్దతు దారులతో భారీ ర్యాలీలుగా నిర్వహించే అవకాశాలు ఉన్నందున తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ నాగిరెడ్డి డీజీపీ మహేందర్ రెడ్డికి సూచించారు. గ్రామాల్లో బలమైన వర్గాలు ఉన్నచోట ఆధిపత్య బలాధిక్యతను చాటుకోవాలన్న సందర్భాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడి శాంతిభద్రతల సమస్యకు దారి తీసే అవకాశాలు ఉన్నందున బలమైన వర్గాలు ఉన్నగ్రామాలపై ముందస్తు నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. మూడు విడుతల్లో జరిగే పంచాయతీలక్షు సంబంధించి ఆధిపత్యపోరు బలంగా ఉండే గ్రామాలపై ప్రత్యేకంగా శాంతిభద్రతల ప్రణాళికను సిద్ధం చేసి ఉంచుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన నిధులకు సంబంధించి ఎటువంటి సమస్యలు రాకుండా వెనువెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా అవసరమైన రవాణా సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసి ఉంచుకోవాలని, మారుమూల, ఏజేన్సీ పంచాయతీలకు కూడా రవాణాలో సమస్యలు తలెత్తకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధం చేసి ఉంచాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది కొరత సమస్య రాకుండా తగినంత మంది సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, కొందరిని రిజ్వర్‌లో ఉంచుకోవాలని సూచించారు. అన్ని పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలకు విద్యుత్ సదుపాయం లేదా తాత్కాలిక లైటింగ్ సదుపాయం వంటివాటిపై ముందుగానే తగిన ప్రణాళిక రూపొందించి ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు వారివారి స్థాయిల్లో ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకుంటూ స్వేచ్ఛగా ప్రజలు ఓటు వేసుకునే పరిస్థితులు కల్పించాలని కమిషనర్ నాగిరెడ్డి సమావేశంలో సూచించినట్టు సమాచారం.

అమల్లో ఉన్న పథకాలు యథాతథం

జిల్లా కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో అమల్లో ఉన్న అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోసి తెలిపారు. సంక్షేమ పథకాలు స్తంభిస్తాయని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. బతుకమ్మ చీరల పంపిణీ, రైతుబంధు పంట పెట్టుబడి చెక్కుల పంపిణీ యథావిధిగా కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సీఎస్ శుక్రవారం వెల్లడించారు. పంచాయితీ ఎన్నికల సన్నద్ధతపై శనివారం సీఎస్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించనున్నారు. ఈ సందర్భంగా కూడా అమల్లో ఉన్న అన్ని సంక్షేమ పథకాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా లబ్ధిదారులకు చేర్చాలని మరోసారి స్పష్టం చేయనున్నారు.

13,487 రైల్వే ఉద్యోగాల ప్రకటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వివిధ విభాగాల్లో నియామకాలకు సంబంధించి రైల్వే మంత్రిత్వశాఖ 13,487 ఉద్యోగాల భర్తీకై ప్రకటన ను విడుదల చేసింది. జూనియర్ ఇంజనీర్లు (జెఇ), జూనియర్ ఇంజనీర్లు (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), డిపో మెటీరియల్ సూపరింటెండెంట్ (డిఎంఎస్), కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ (సిఎంఏ) ఉద్యోగాలలో 13,487 ఖాళీల నియామకం కోసం ఉద్యోగ ప్రకటన ఇచ్చింది. దేశం నలుమూలల నుంచి ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తులు పంపుకోవడానికి ఈనెల 31 చివరి తేదీగా రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు పేర్కొంది. దరఖాస్తుదారుల వయస్సు 2019 జనవరి 1 నాటికి 18 నుంచి 33 మధ్య ఉండాలి. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి రైల్వే ప్రత్యేకంగా సూచించిన సబ్జెక్టుల్లో మూడేళ్ళ ఇంజనీ రింగ్ డిప్లొమా లేదా వివిధ రకాల సబ్జెక్టులలో ప్రాథమిక ఇంజనీరింగ్ డిప్లొమా. మరిన్ని వివరాలకు ఇండియన్ రైల్వేస్ డాట్ జి వో వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని రైల్వే శాఖ పేర్కొంది.

సీఎల్పీపై సమాచారం లేదు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ శాసన సభాపక్షసమావేశం ఏర్పాటుపై తనకు ఎలాంటి సమాచారం లేదని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, పార్లమెంట్, పంచాయతీ ఎన్నికలకు సంబంధించి లోక్‌సభ నియోజక వర్గాల వారిగా సమీక్షలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఆయన తెలిపారు. సమీక్షల్లో వచ్చిన అనుభవాలతో పార్లమెంట్ ఎన్నికలకు ఎలా వెళ్లాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రెండు రోజుల పాటు విదేశాలకు వెళ్లుతున్నట్లు ఆయన తెలిపారు.

ముస్లిం, గిరిజనులు రిజర్వేషన్ల ఆశలు వదులుకోవాలి : షబ్బీర్‌అలీ

ముస్లిం, గిరిజన వర్గాలను సీఎం కేసీఆర్ మోసం చేశారని కాంగ్రెస్ సీనియర్ షబ్బీర్ అలీ అన్నారు. ఆ రెండు వర్గాలకు చెరే 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన కేసీఆర్ విస్మరించారని ఆయన విమర్శించారు. గాంధీభవన్‌లో మీడియాతో అన్నారు.

ఆలస్యమే కొంపముంచింది

- అభ్యర్థుల ప్రకటనలో జాప్యంతో తీరని నష్టం
- ఎంపీ ఎన్నికల్లోనైనా ముందే అభ్యర్థులను ప్రకటించాలి
- శాసనసభ ఎన్నికల్లో ఓటమిపై కాంగ్రెస్ పోస్ట్‌మార్టం
- స్పష్టంగా అభిప్రాయాలు చెప్పిన నేతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక, ప్రకటనలో ఎనలేని జాప్యం చేయడం వల్లే తీవ్రంగా నష్టపోయామని పలువురు నేతలు స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయంపై కాంగ్రెస్ పార్టీ శుక్రవారం పోస్టుమార్టానికి శ్రీకారం చుట్టింది. పార్టీ ఓటమికి గల కారణాలపై విశ్లేషణ మొదలు పెట్టింది. అధికారంలోకి వస్తామనే ధీమాతో ఉన్న కాంగ్రెస్ విజయం సాధించకపోవడంతో పార్టీ నేతలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కేడర్ కూడా నైరాశ్యంలోకి వెళ్లింది. పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలు సమీస్తుం డటంతో మళ్లీ పార్టీ కేడర్‌లో కదలిక తెచ్చేందుకు ఆ పార్టీ కార్యాచరణ రూపొందిస్తున్నది. కాగా శుక్రవారం గాంధీభవన్‌లో ఆరు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీకి పోటీచేసిన అభ్యర్థులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రామచంద్ర కుంతియా, టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఏఐసీసీ కార్యదర్శి ఇన్‌చార్జీ శ్రీనివాస కృష్ణన్ పాల్గొన్నారు. మొదటి రోజు అదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గాల పరిధిలోని అసెం బ్లీకి పోటీచేసిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు.

అందువల్లే ఓడిపోయాం

అభ్యర్థుల ప్రకటనలో జాప్యంవల్లే ఓడిపోయామని ఎక్కువమంది అభ్యర్థులు పేర్కొన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థులను రెండు నెలల ముందుగానే ప్రకటించడంతో.. ఒక్కో గ్రామాన్ని రెండు పర్యాయాలుగా చుట్టారని, తీరా ఎన్నికల సమయంలో మూడోసారి కూడా ప్రజల వద్దకు వెళ్లారని వివరించారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం నామినేషన్ల చివరి రోజు వరకు టికెట్ల కేటాయిం చకపోవడంతో భారీగా నష్టం జరిగిందని వివరించారు. ప్రచారంలోని చిన్న చిన్న లోపాలు సరిదిద్దకోవడానికి సమయం లేకుండాపోయిందని వివరించారు.



పార్లమెంట్‌కైనా ముందే...

అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రకటన ఆలస్యం జరగడం వల్ల పార్లమెంట్ ఎన్నికల్లోనైనా అభ్యర్థులను ముందే ప్రకటిస్తే ఫలితం ఉంటుందని, లేదంటే మరోసారి భారీ నష్టాన్ని చవి చూడాల్సి ఉంటుందని పలువురు నేతలు హెచ్చరించారు. ఒక్కో లోక్ సభ నియోజక వర్గంలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నందున.. పోటి చేసే పార్టీ అభ్యర్థి దాదాపు అన్ని నియోజక వర్గాలను చుట్టి రావాల్సి ఉంటుందని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి వస్తే లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థి కొన్ని నియోజక వర్గాలకు తిరగకపోయినా పెద్ద ప్రభావం ఉండకపోయేదని, కానీ ఇప్పుడు అలా కాదని వివరించారు.

కొందరు నేతలు డుమ్మా..

ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆదేశంతో నిర్వహించిన పార్టీ సమీక్ష సమావేశానికి పలువురు నేతలు డుమ్మా కొట్టడం చర్చనీయాంశంగా మారింది. విజయం సాధించిన ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు డీసీసీ అధ్యక్షులు హాజరు కాలేదు.

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్, మంథని ఎమ్మెల్యే డి. శ్రీధర్‌బాబుతో పాటు అదిలా బాద్ డీసీసీ అధ్యక్షుడు, నిర్మల్ నుంచి పోటి చేసిన కాం గ్రెస్ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి కూడా దూరంగా ఉన్నారు. ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేల టికెట్ల ఎస్టీల్లోని లంబాడ, ఆదివాసీలకు సమన్యాయం చేయడంతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన వారిలో ఎస్టీనియోజకవర్గాలు ఎక్కువగా ఉన్నాయని ఆ పార్టీ ఎమ్మెల్యే అత్రం సక్కు వివరించినట్లుగా తెలిసింది.

పది రోజుల్లో ప్రక్షాళన!

- ఏఐసీసీ ఆదేశాలతో కదిలిన టీపీసీసీ
- రెండు, మూడు రోజుల్లో కొత్త కమిటీలు
- లోక్‌సభ ఎన్నికల కోసం మరో ఐదు...
- 15లోగా డీసీసీ, సిటీ కాంగ్రెస్ కమిటిల నియామకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ యుద్ధానికి సిద్ధం అవుతోంది. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు నింపాలనే యోచనతో ముందుకు సాగుతున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి మెజార్టీ ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవాలనే ఆలోచన చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పిదాలు, పొరపాట్లను సరిదిద్దుకుని లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని నిర్ణయించారు. రెండు రోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జీ కార్యదర్శుల సమావేశంలో రాహుల్‌గాంధీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. టీ పీసీసీని పూర్తిగా ప్రక్షాళన చేసిన పని చేసే వారికి అవకాశం ఇవ్వాలని, కమిటి కూర్పును కూడా కుదించాలని రాహుల్ ఆదేశించారు.

సంస్థాగతంగా బలోపేతం చేయాలి

ఇదిలా ఉండగా పార్టీ సంస్థాగతంగాను బలోపేతం చేయాలని రాహుల్ ఆదేశించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో పదవులు పందెరం జోరుందుకోనుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు ఏఐసీసీ ఆర్గనైజేషన్ కార్యదర్శి జేడీ శీలం టీ పీసీసీ అధ్యక్షులకు లేఖలు రాశారు. కమిటీలను టైం ప్రకారం పూర్తి చేసి ఏఐసీసీ నివేదించాలని ఆ లేఖలో సూచించారు.

పీసీసీ స్థాయిలో 5 కమిటీలు

జనవరి 8లోగా లోక్‌సభ ఎన్నికల కోసం పీసీసీ స్థాయిలో 5 కమిటీలను (కో ఆర్డినేషన్ కమిటీ, ప్రదేశ్ ఎన్నికల కమిటీ, ప్రచార కమిటి, పబ్లిసిటి మీడియా కో ఆర్డినేషన్ కమిటీ) వేయాలని సూచించారు. పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేయడానికి గాను పీసీసీ, డీసీసీ, సిటీ కమిటీలతో పాటు బ్లాక్, వార్డు కమిటీలను కూడ జనవరి 15లోగా నియమించాలని సూచించారు. ఇకపోతే పోలింగ్ బూత్‌స్థాయి కమిటిలను జనవరి 30 వరకు పూర్తి చేయాలని, ఫిబ్రవరి నెలాఖర్ నాటికి కొత్తగా నియమించబడని బూత్, బ్లాక్, అసెంబ్లీస్థాయి కమిటీలకు శిక్షణ పూర్తి చేయాలని ఏఐసీసీ ఆదేశించినది. బూత్ స్థాయి నుంచి పీసీసీ స్థాయి కమిటీల వరకు పార్మెట్ ప్రకారం నియమాకాలు చేపట్టి ఫిబ్రవరి 5 లోపు పూర్తి నివేదికను ఆర్గనైజింగ్ కార్యదర్శికి అందించాలని సూచించారు.

ప్రత్యేకంగా పని విభజన

పీసీసీ కమిటిలో ఉన్న కార్య నిర్వాహక అధ్యక్షులకు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు ప్రత్యేకంగా పని విభజనన చేయాలని బాధ్యతలు అప్పగించాలని రాహుల్ సూచించారు. 15లోపు పీసీసీ స్థాయిలో ముఖ్య నాయకులతో సమవావేశాలు నిర్వహించి కార్యాచరణ అమలు చేయాలని ఏఐసీసీ స్పష్టం చేసింది. శక్తియాప్‌కు సంబంధించి కో ఆర్డినేటర్ల నియామకం పనులను కూడా జనవరి 30 లోపు పూర్తి చేసి సిద్ధం కావాలని రాహుల్ ఆదేశించారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
శనివారం 5 జనవరి 2019

పొగిడిన నోటితోనే ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు!


అగ్రరాజ్యాధినేత నోటంట ఏదైనా మాట వచ్చిందంటే దానికి యావత్ ప్రపంచం స్పందిస్తుంది. ఎక్కడైనా పొల్లు పదం దొర్లితే అంతర్జాతీయ మీడియా విమర్శలు, విశ్లేషణలతో కథనాలను వండి వారుస్తుంది. అందుకే, అమెరికా అధ్యక్షులుగా గతంలో వ్యవహరించిన వారు ఆచి తూచి మాట్లాడేవారు. అయితే, డెమోక్రాట్ల కన్నా రిపబ్లికన్ పార్టీ నాయకుల్లో అతి ధోరణి ఎక్కువ. ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రిపబ్లికన్ పార్టీకి చెందినవారే. అందువల్లే ఆయన నిలకడ లేని ప్రకటనలతో అమెరికా పరువు తీస్తున్నారు. ఆఫ్ఘనిస్థాన్ పునర్నిర్మాణంలో భారత ప్రభుత్వం ముఖ్యంగా, ప్రధాని నరేంద్రమోడీ అందిస్తున్న సహాయ, సహకారాలను ఆయన పెక్కు సందర్భాల్లో ప్రశంసించారు. సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో జరిపిన తొలి పర్యటన సందర్భంగా ఆనాటి పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ సమక్షంలో ట్రంప్ మోడీపై ప్రశంసల వర్షం కురిపించేసరికి షరీఫ్ చిన్న బుచ్చుకున్నారు. అదే నోటితో ఇప్పుడు ట్రంప్ మోడీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆఫ్ఘనిస్థాన్‌కి భారత్ సాయం అందిస్తోందట. గ్రంథాలయం ఏర్పాటుకు మోడీ సహాయం చేశారట. అదెంతో తెలుసా మనం ఐదు గంటల్లో ఖర్చు చేసినంత అంటూ పుల్లవిరుపు మాటలు వదిలారు. ఆఫ్ఘనిస్థాన్ పునర్నిర్మాణం కోసం తమ దేశం ఇంతవరకూ వందల కోట్ల డాలర్లను ఖర్చు చేసిందనీ, తాలిబన్లతో పోరులో వేలాది మంది అమెరికన్ సైనికులను పోగొట్టుకుందని ట్రంప్ ఏకరవు పెట్టారు. అది అసత్యమని ఎవరూ అనరు ఆఫ్ఘనిస్థాన్ పునర్నిర్మాణంలో భారత్ అందిస్తున్న సహాయ, సహకారాలు అమోఘమని ట్రంప్ ఈనోటితోనే అన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌కి కోట్లాది రూపాయిల విలువైన సహాయ సామగ్రిని పంపడమే కాకుండా, రోడ్లు, భవనాలు నిర్మించింది. ఆఫ్ఘన్ సైనికులకు శిక్షణ ఇచ్చింది.

ఆఫ్ఘనిస్థాన్‌లో బాధితులూ, శరణార్ధులకు సాయం అందిస్తున్నందుకు తాలిబన్లు భారత్‌పై కక్ష పెంచుకుని కాబూల్‌లోని భారత రాయబార కార్యాలయంపై దాడులు చేయడం, పలువురు దౌత్యాధికారులు మరణించడం ఇంకా మనస్మృతి పథంలోనే ఉన్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌ని పునర్నించాల్సిన పరిస్థితిని కల్పించింది ట్రంప్ పార్టీకే చెందిన మాజీ జార్జి బుష్. ఆఫ్ఘనిస్థాన్‌లో పదహారేళ్ళ పై నుంచి వేలాదిమంది సంకీర్ణ దళాలు కొనసాగుతున్నాయి. ఈ దళాల్లో బ్రిటన్, అమెరికా మిత్ర దేశాల సేనలు కూడా ఉన్నాయి. మన దేశం బాధితులకు కోట్లాది రూపాయిల విలువ చేసే సహాయక సామగ్రిని అందించింది. ఈ సహాయక సామగ్రిని తీసుకుని వెళ్ళిన వివిధ సంస్థల ప్రతినిధులు తాలిబన్ల దాడిలో మరణించారు.

అంతేకాక, ఈ సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు ట్రంప్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేవారు. అమెరికా అధ్యక్షులుగా గతంలో పనిచేసినవారంతా రాష్ట్రాల గవర్నర్‌లుగా వ్యవహరించి పాలనానుభవం సంపాదించిన వారే. ట్రంప్‌కు అమెరికా ఎదుర్కొంటున్న సమస్యలపై సంపూర్ణ అవగాహన లేదు. అందుకే ఆయా సందర్భాలను బట్టి మాట్లాడటానికి అలవాటు పడినట్టు కనిపిస్తోంది. మన ప్రధాని మీద వ్యంగ్యాస్త్రాలను సంధించిన వెంటనే ఆయన పాకిస్తాన్‌నీ నమ్మదగిన దేశం కాదని సహజ ధోరణిలో చురక అంటించారు. అంతటితో ఊరుకోకుండా పాకిస్తాన్‌లో కొత్త నాయకత్వాన్ని త్వరలో కలవాలని అనుకుంటున్నట్టు ప్రకటించారు. పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ త్వరలోనే ట్రంప్‌తో భేటీ అయ్యే అవకాశం ఉందంటూ అప్పుడే పాక్ విదేశాంగ శాఖ ప్రకటన చేసేసింది. పాకిస్తాన్ ప్రధానిని ట్రంప్ కలుసుకోవడం వల్ల మనకు వచ్చే నష్టం ఏమీ లేదు. కానీ, మన ప్రధానిపై వ్యంగ్యాస్త్రం సంధించడం ముమ్మాటికీ నిలకడలేని మాటే. భారత్‌ని నమ్మదగిన దేశమని ప్రశంసించడమే కాకుండా, రక్షణ రంగంలో వ్యూహాత్మక భాగస్వామిగా భారత్‌ని పరిగణిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. ఆఫ్ఘనిస్థాన్‌లో ఇప్పటికీ హింస రావణ కాష్టంలా కొనసాగడానికి పాకిస్తాన్‌లో తలదాచుకుంటున్న హఖానీ గ్రూపు ఉగ్రవాదులు. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా అంగీకరించారు. ఆఫ్ఘనిస్థాన్‌ని పూర్తిగా అస్తవ్యస్తం చేసింది అమెరికాయే కనుక, ఆ దేశం పునర్నిర్మాణ బాధ్యతను అమెరికా స్వీకరించింది. ఆఫ్ఘన్ యుద్ధానికి బ్రిటిష్ సైనికులను బలవంతంగా పంపినందుకు ఆనాటి బ్రిటిష్ ప్రధాని టోనీ బ్లెయిర్‌పై విచారణ జరగడం, విచారణ కమిటీ అభిశంసించడం జరిగింది. అలాగే, అమెరికా మిత్ర దేశంగా ఆస్ట్రేలియా ఆఫ్ఘన్‌కు తన సేనలను పంపింది. ఈ సమరంలో ఆఫ్ఘన్ సైనికులు కూడా ఎంతో మంది మరణించారు. అన్ని దేశాలూ సాయం చేస్తేనే ఆఫ్ఘన్‌లో సంకీర్ణ సేనలను కొనసాగిస్తోంది. ఈ వాస్తవాలను కప్పి పుచ్చి ఆఫ్ఘన్ రక్షణకూ, పునర్నిర్మాణానికీ కేవలం తమ దేశమే బాధ్యత తీసుకుంటున్నట్టు ట్రంప్ ప్రకటించడం వాస్తవాలను కప్పిపుచ్చడమే.

ఆఫ్ఘన్‌లో ఇప్పటికీ రక్తపాతం కొనసాగడానికి పాకిస్తాన్‌లో తలదాచుకుంటున్న తాలిబన్లు, హఖానీ గ్రూపు ఉగ్రవాదులే బాధ్యులు. వారికి ఆశ్రయం ఇస్తున్నది పాక్‌లోని మత పెద్దలే. ఆఫ్ఘన్ సరిహద్దుల్లో పాక్ భూభాగంలోని స్వాత్ లోయలో తలదాచుకున్నారన్నది బహిరంగ రహస్యం. తాలిబన్లు పాక్‌లోని పెషావర్ వంటి నగరాల్లో కూడా దాడులు చేస్తున్న మాట నిజమే. అక్కడి మత పెద్దల సహకారంతోనే తాలిబన్లు, హఖానీ గ్రూపు ఉగ్రవాదులు పాక్ కేంద్రంగా దాడులు జరుపుతున్నారు. పాక్ ప్రధానిగా ఎవరున్నా, వారు డమ్మీలు మాత్రమే. పెత్తనం, నిర్ణయాధికారం సైనికాధికారులూ, మత పెద్దల చేతుల్లోనే ఉంటుంది. ఈ వాస్తవాలు తెలుసున్నా, ఇమ్రాన్ ఖాన్‌తో భేటీ కావాలని ట్రంప్ అనుకోవడం తప్పు కాదు కానీ, ప్రయోజనం ఉండదు. ఉగ్రవాద సంస్థలను అదుపు చేసే శక్తి ఇమ్రాన్‌కి లేదు.

పంట పెట్టుబడి ఆదర్శవంతం



ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన అనతి కాలంలోనే తెలంగాణ ప్రభుత్వం సరికొత్త పథకాలు, సంచలనాత్మక నిర్ణయాలతో దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచింది. పరిపాలనా వికేంద్రీకరణ, పౌర సేవల విస్తరణతో పాటు రైతు సంక్షేమ రంగంలో తీసుకున్న ప్రతిష్టాత్మక నిర్ణయాలతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పరిణతి చెందిన పరిపాలనాధిపతిగా పేరుతెచ్చుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అన్నివర్గాల సంక్షేమానికి దోహదపడే విధంగా స్థానిక వనరులను సద్వినియోగం చేసుకునే చర్యల్లో తొంభైశాతం సఫలీకృతులయ్యారు. అందులో భాగంగా ప్రారంభించిన రైతుబంధు పంట పెట్టుబడి, జీవిత బీమా పథకాలు పలు రాష్ట్రాలకు, కేంద్ర ప్రభుత్వానికి ఆదర్శంగా నిలిచాయి. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను మరింతగా బలోపేతం చేయడంతో సంపద సృష్టించవచ్చునన్న సరికొత్త ఆలోచనతో కేసీఆర్ అమలు చేస్తున్న ఈ రెండు పథకాలు ఒడిసా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు స్వల్ప మార్పులతో కార్యరూపంలోకి తీసుకువచ్చాయి. మరణించిన రైతు కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారంతో పాటు ఎకరాకు రూ.5 వేల చొప్పున ఏడాదిపాటు పంట పెట్టుబడి మద్దతు ఇవ్వాలని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తాజాగా సోమవారం నిర్ణయం తీసుకున్నారు. అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రుణమాఫీతో పాటు పంట పెట్టుబడి, రైతు జీవిత బీమా పథకాలను అమలు చేసేందుకు సూచనప్రాయ నిర్ణయం తీసుకుంది.

వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న రాష్ట్రాలను ఆలోచింపజేసే విధంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్ర ప్రజల్లో చెరగని ముద్ర వేసుకుంటోంది. సంక్షోభంలో చిక్కుకున్న వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించేందుకు సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎకరాకు రూ.8 వేల ''పెట్టుబడి'' పథకం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటున్న పొరుగు రాష్ట్రాలు ఈ చారిత్రాత్మక పథకంపై దృష్టి కేంద్రీకరించాయి. సాంకేతికంగా, వ్యాపార పరంగా అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉన్న గుజరాత్ రాష్ట్రం సైతం ఇక్కడ ప్రకటించిన పెట్టుబడి పథకంపై అధికార వర్గాలతో వాకబు చేసింది. అలాగే ఉత్తర్‌ప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే పెట్టుబడి పథకం ఉద్దేశాలు, లక్ష్యాలు, ఫలితాలపై సమాచారం తెప్పించుకున్నారు. తెలంగాణాలో ఉన్న వ్యవసాయ పరిస్థితులు, రైతుల ఆర్థిక స్థితిగతులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా సాధిస్తున్న ఫలితాలు, రైతుల్లో ఉన్న అభిప్రాయాలపై కేంద్ర ప్రభుత్వం ఆరు నెలల నుంచే దృష్టిసారించింది. ప్రధాని నరేంద్రమోడీ ఆదేశాల మేరకు ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి ద్వారా ఇక్కడి పరిస్థితులపై పూర్తిస్థాయి నివేదికను తీసుకువెళ్ళారు.

ఉమ్మడి రాష్ట్రంలో అనేక ఒడిదుడుకులు, నిరాదరణ, కష్టనష్టాల మధ్య కొనసాగిన వ్యవసాయ రంగాన్ని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక గట్టెక్కించేందుకు కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటి జాతీయస్థాయిలో వెలుగులోకి వస్తున్నాయి. తెలంగాణ సాధన ఉద్యమ నేపథ్యంలో ఆయన మదిలో ఉన్న ఆలోచనలు పరిస్థితులకు అనుగుణంగా అమలుకు నోచుకుంటున్నాయి..

వ్యవసాయం ఇక గిట్టుబాటు కాదేమోనన్న భయాందోళన పెరుగుతున్న అన్నదాతల్లో భవిష్యత్తుపై భరోసా కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపట్ల రాజకీయాలకు అతీతంగా హర్షధ్వానాలు వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడి ముడి సరుకులో ప్రధానమైన ఎరువులు, విత్తనాల కొనుగోలు కోసం ఎకరాకు రూ.4 వేల చొప్పున ప్రతియేటా రెండు పంటలకు ఇస్తుండడంతో ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్న లక్షలాది కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. బంగారు తెలంగాణ నిర్మాణంలో పెద్ద సంఖ్యలో ఉన్న రైతు కుటుంబాలదే కీలక భాగస్వామ్యమైనందున వారి ఆర్థిక స్వావలంబన ద్వారానే ముందడుగు వేయాలని కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సుమారు 40 లక్షల రైతు కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించే విధంగా రూ.17 వేల కోట్లతో పంట రుణాలను మాఫీ చేశారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మెరుగుపడినట్లు కనిపించకపోవడంతో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించే కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ముడి సరుకుపై ఇప్పటి వరకున్న రాయితీని అమలు చేస్తూనే పంటల సాగులో ప్రధానమైన పెట్టుబడి ఏటా ఎకరాకు రూ.8 వేల చొప్పున పారదర్శకంగా పంపిణీ చేస్తూ పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు.

కేసీఆర్ పథకాలకు ప్రశంసలు

ఈ వ్యూహాత్మక, చారిత్రాత్మక నిర్ణయంతో కేసీఆర్ రాజకీయాలకు అతీతంగా, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా అన్నదాతల్లో చెరగని ముద్రవేసుకున్నారు. ఈ సాహసోపేతమైన నిర్ణయంపట్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, రైతు సంఘాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. కేసీఆర్ తీసుకున్న నిర్ణయం అన్నదాతకు ప్రాణం పోసిందన్న ప్రశంసల వర్షం కురుస్తోంది. ఉచిత ఎరువుల పంపిణీ నిర్ణయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమవుతోంది. రకరకాల విపత్తులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సంక్షోభంలోంచి బయట పడలేకపోతున్న వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయిలో గట్టెక్కించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ మరిన్ని రాయితీలు, ప్రోత్సహకాలు కల్పించాలన్న దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రత్యేక తెలంగాణలో మొట్టమొదటిగా ఏర్పడిన ప్రభుత్వానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టాలన్న వ్యూహంతోనే ఆయన ముందుకు సాగుతున్నారు. రానున్న రోజుల్లో చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు వ్యవసాయాన్ని పండగ చేసేందుకు మరిన్ని సరికొత్త పథకాలను ప్రవేశపెట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు.

దేశంలో 70 శాతం ప్రజలకు మేలుచేసే పథకం

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'రైతుబంధు' జాతీయ స్థాయిలో అమలు కాబోతోంది. జనాభాలో దాదాపు 70 శాతానికి పైగా ఉన్న రైతు కుటుంబాల సంక్షేమానికి ఎంతగానో దోహదపడుతున్న రైతుబంధు పంట పెట్టుబడి మద్దతు, రైతుబంధు జీవిత బీమా పథకాలపై గత కొంతకాలంగా అధ్యయనం చేసిన ప్రధాని నరేంద్రమోడీ తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం కేసీఆర్ కలిసిన సందర్భంలో ఈ రెండు పథకాలపై ఆయన ప్రత్యేక ఆసక్తి చూపారు. విపత్కర పరిస్థితులు వెంటాడుతున్న నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతు కుటుంబాల ఆర్థిక పరిస్థితులను, జీవన స్థితిగతులను మెరుగుపరుస్తున్న ఈ పథకాలు దేశవ్యాప్తంగా అమలుచేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికే కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి నేతృత్వంలో ఆరు నెలల క్రితం రాష్ట్రానికి వచ్చిన అధికారుల బృందం ఈ పథకంపై పూర్తి నివేదికను తీసుకువెళ్ళి ప్రధానికి అందజేసింది. ఈ రెండు పథకాలపై లోతుగా అధ్యయనం చేసిన తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ పథకాలు భాజపా తిరిగి అధికారంలోకి రావడానికి ఎంతగానో ఉపకరిస్తాయని భావించారు. కొంత ఆర్థికభారంతో కూడుకున్నదైనప్పటికీ, 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం రైతుబంధు అమలు చేయడం ద్వారా నెరవేరుతుందని ప్రధాని సంకల్పించారు. విశ్వసనీయ సమాచారం మేరకు 2019, జనవరి 5న జాతీయ స్థాయిలో ఈ పథకం అమలును ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

-రాజేష్ జైన్

నౌకా రవాణాకు దొంగల బెడద!




మన దేశానికి తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన అరేబియా సముద్రం, ఉత్తరాన హిమాలయాలు, దక్షిణాన హిందూ మహాసముద్రాలు పెట్టని గోడల్లా రక్షణను కల్పిస్తున్నాయి. తూర్పు - దక్షిణ ప్రాంతంలో ఉన్న హిందూ మహాసముద్రం నౌకల రాకపోకలతో ఎప్పుడూ సందడిగానే ఉంటుంది.. ఒత్తిడి పెరుగుతోంది. హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని శాంతిమండలంగా చేయాలన్న ప్రతిపాదన ఎంతో కాలంగా ఉంది.అయితే, అగ్రరాజ్యం స్వార్థ ప్రయోజనాల వల్ల అది ఇప్పటికీ సాకారం కావడం లేదు.తూర్పు దేశాలు ,పశ్చిమ దేశాల నుండి జరిగే వాణిజ్య, వ్యాపారాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న హిందూ మహాసముద్ర ప్రాంతంపై ఆధిపత్యానికి సంపన్న దేశాలు ప్రయత్నాలుచేస్తున్నాయి. . ఇండియాకు సముద్రం వాణిజ్యానికి ప్రధాన కూడలిగా స్వాతంత్ర్యం రాక పూర్వం నుండి ఉంది. హిందూ మహాసముద్రం ద్వారానే భారత దేశ సామ్రాజ్యాలు సుమిత్ర, మినికోయ్, మయన్మార్ దేశాలకు విస్తరించడం మనదేశం నుండి ఖనిజ సంపద, సుగంధ ద్రవ్యాలు, తేయాకు, రబ్బరు, మిరియాలు, బంగారం, వజ్రాలు వ్యాపారాలు విస్తరించినట్లు చరిత్ర చెబుతోంది. మధ్యయుగాలలో మన దేశంలో రాజ్యమేలిన చక్రవర్తులు విదేశాలలో కూడా తమ ఆధిపత్యం నెలకొల్పినట్లు ఉంది. భారత ఉపఖండాన్ని పశ్చిమ దేశ పాలకులు శ్రీలంక, బర్మా (మయన్మార్)గా విభజించి పాలించారు. బ్రిటిష్ వారు ఇండియాను వదలి పోయేటప్పుడు ఇండియా పాకిస్తాన్‌గా విభజించారు. బ్రిటిష్ వారు ప్రపంచంలో రవి అస్తమించని సామ్రాజ్యాన్ని జయించి ఆధిపత్యం నెలకొల్పారంటే వారి నౌకాదళాల ఆధిపత్యమే కారణం. అంతేగాక వారు అంత సంపన్నులు కావడానికి కారణం సముద్రాలపై ఆధిపత్యమే. అదే రీతిలో భారత్ కూడా హిందూ మహాసముద్రం మీద వాణిజ్యాన్ని విస్తరించింది. సముద్ర రవాణాను మన ప్రయోజనాలకు అనుగుణంగా మార్చుకొని చుట్టుపక్క దేశాలతో సంబంధాలను వృద్ధి చేసుకుంది. మన దేశానికి చెందిన జాలర్లు, వ్యాపారులు, హిందూ మహాసముద్ర లిట్టోరల్ దేశాల హద్దులను దాటడం, అనుమతులు లేకుండా ప్రవేశించడంతో తరచు భారతీయ జాలర్లను, వ్యాపారులను అరెస్టు చేసి వారిని జైల్లో పెట్టడం ఇప్పటికీ జరుగుతోంది. దీనివల్ల ఇండియాతో దౌత్యపరమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. . అదే రీతిలో శ్రీలంక, పాకిస్తాన్, మయన్మార్ దేశాల జైళ్ళలో వందలమందున్నారు. ఇండియా జాలర్లు పొట్టకూటికోసం చేపల పట్టడానికి వెళితే వారిని అరెస్టు చేయడంతో వందలమంది కుటుంబాలు విచ్చిన్న మౌతున్నాయి. వీరి విడుదలకు జాప్యం జరుగుతుండటం వల్ల ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యాపార, వాణిజ్య సరకుల ఓడలు తరచు తిరుగుతుంటాయి. అంతేగాక అమెరికా హిందూ మహాసముద్రపు లిట్టోరల్ దేశాలైన మారిషస్ మాల్దీవులు, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో తమ మిలిటరీ స్థావరాలను ఏర్పరుచుకొని హిందూ మహాసముద్రంలో వ్యాపార కదలికలను నియంత్రిస్తోంది. 1971 ఇండో - పాక్ యుద్ధంలో అమెరికా సబ్ మెరీన్‌లు భారత్ రక్షణ మద్దత్తుకు వచ్చాయి. భారతదేశం హిందూ మహాసముద్ర పరీవాహక ప్రాంతంలో ఎప్పుడూ వివాదాస్పదంగా మారడంతో ఐక్యరాజ్యసమితి 1980 హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని శాంతి మండలంగా ప్రకటించడంతో ఆనాటి ప్రచ్ఛన్న యుద్ధం కదలికలకు కేంద్రస్థానం అయింది. హిందూ మహాసముద్రంలో సంచరించు వ్యాపార వస్తు ఓడలను బంధీ చేసి దోపిడీ దొంగలు దోచుకోవడం జరుగుతోంది.

సముద్ర దొంగతనాలను అరికట్టేందుకు భారత ప్రభుత్వం కోస్టల్ గార్డు వ్యవస్థ పనిచేస్తోంది. వీరు మన దేశానికున్న 2100 మైళ్ళ సముద్ర తీరాన్ని రక్షించేందుకు ఎప్పుడూ గస్తీ తిరుగుతుంటారు. హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని స్మగ్లర్లకు కేంద్రంగాను ఉగ్రవాదులకు అడ్డాగా మారకుండా కాపాడుకోవలసిన బాధ్యత భారత్‌పై ఉంది. హిందూ మహాసముద్రం నుండి మనదేశానికి ముడి చమురు రవాణా అత్యంత కీలకమైంది. ఈ రవాణా కూడా సక్రమంగా ఉండాలంటే భద్రత కట్టుదిట్టం చేయాలి. గుజరాత్ తీరం నుండి ఎక్కువగా వాణిజ్య, వ్యాపారాలు జరుగుతాయి. కనుక ఈ ప్రాంతంలో రక్షణ వలయాన్ని ఏర్పర్చుకోవాలి అందుకు ఆఫ్రికన్ దేశాలతోను పాకిస్తాన్‌తో సత్సంబంధాలను ఏర్పరచుకోవాలి. ఎందుకంటే అరేబియా తీరాన్ని ఉపయోగించుకొని ఉగ్రవాదులు ముంబాయికి వచ్చి, ఇండియాపై దాడులు జరిపారు. అంతేగాక ఆఫ్రికా దేశాల నుండి సముద్ర దొంగలు మన రవాణా ఓడలను హైజాక్ చేసి దోచుకోడాన్ని ఆపాలి. భారత్ - ఫసిఫిక్ దేశాల సమావేశానికి ప్రధాని మోడి నవంబర్ 2017 న హాజరయ్యారు. ఇందులో ఇండియా ప్రయోజనాలను చర్చించారు. అదేవిధంగా జూన్ 2017లో షంగ్రీలా డైలాగ్ ఒప్పందంపై ప్రధాని మోడీ సంతకం చేశారు. ఇందులో అమెరికా ఇండియాకు లాజిస్టిక్ మద్దతును అందించేందుకు ఫ్రాన్స్, జపాన్‌లు కూడా ఇండియాకు మద్దతు తెలిపాయి. భారత్ , ఇండోనేషియాలో డీప్ సీ పోర్టు సబాంగ్‌లో నిర్మించేందుకు తోడ్పడుతుంది. అదేవిధంగా హిందూ మహాసముద్రంలోని ప్రాంతాలు భారత్‌కు మిశ్రమ మద్ధలను అందిస్తాయి. హిందూ మహాసముద్రం చుట్టూ 35 దేశాలలో ఇండియా తనకు మద్దత్తుగా ఉన్నవన్నీ ఇండియాకు అన్ని విషయాలలో తోడ్పాటు నందిస్తున్నాయి. కాని చైనా హిందూ మహాసముద్రంలో చైనా తన సైనిక స్థావరాలను ఏర్పరచుకొని తన ప్రెజెన్స్‌ను హిందూ మహాసముద్రపు లిట్టోరల్ దేశాలకు కొండంత అండగా ఉంటుంది. మాల్దీవులలోను, శ్రీలంకలోను చైనా స్థావరాలను ఏర్పరుచుటవలన మనకు అభద్రత పెరుగుతుందంటున్నారు. ఎందుకంటే చైనా ఈ వాణిజ్య కదలికలను నియంత్రించి తన వస్తువులను ఆయా దేశాలలో అమ్ముకుంటోంది. హిందూ మహాసముద్రపు రిమ్ (ఆర్ఐఎమ్) అసోసియేషన్ (ఐఓఆర్ఏ) 4వ సమావేశం థాయ్‌లాండ్‌లోని పుంకౌ పట్టణంలో జరిగింది. ఈ సమావేశం విదేశాంగ కార్యదర్శి సుజాత మెహతా ఇండియా ప్రయోజనాలను కాపాడాలని కోరారు. రిమ్ దేశాల సమ్మిట్ అక్టోబర్ 2014 ఆస్ట్రేలియాలో పెర్త్‌లో హిందూ మహాసముద్రపు దేశాలు ఒకరికొకరు పరస్పర సహకారానికి సభ్యదేశాలు అంగీకరించాయి. భారత దేశానికి గల్ఫ్ దేశాలకు ఎన్నో విధాలుగా సంబంధాలు ఉన్నాయి. వాటికి ముఖ్యంగా మన మాంస ఎగుమతులు, చేపల ఎగుమతులమీద సంవత్సరానికి 4,000 కోట్లు ఆదాయం పొందుతోంది. ఇన్‌లాండ్ ఫిష్, సముద్రపు చేపలు, ఖనిజ ఉత్పత్తులను ఎగుమతి చేస్తుంది. ఇండియాకు ఇన్‌లాండ్ ఫిషింగ్‌కు ప్రసిద్ధి సముద్ర చేపల ఉత్పత్తులు కూడా బాగానే వినియోగించుకోవడం జరుగుతోంది. దీనివల్ల ఇండియాకు ఆదాయం వస్తుంది. నేపాల్ ల్యాండ్ లార్డ్ దేశం. కనుక ఆ దేశం ఇండియా ద్వారా దిగుమతులు జరుపుకుంటోంది. హిందూ మహాసముద్రంలో వ్యతిరేక నిబంధనల వలన ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కాని చైనాను ఆశ్రయించుకొనే విధంగా చేస్తుంది. అందుకే ఇటీవల ప్రధాని మోడీ రూ.5,400 కోట్ల అభివృద్ధి కోసం అందించేందుకు నిర్ణయించారు. హిందూ మహాసముద్ర మందు సముద్ర దొంగల కదలికలను గమనించి మన కోస్టుగార్డు సముద్ర దొంగతనాలు స్మగ్లింగ్, టెర్రరిస్టుల కదలికలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. అందుకు హిందూ మహాసముద్రపు లిట్టోరల్ కంట్రీస్ పరీవాహక దేశాలు కలిసికట్టుగా సమస్యను ఎదుర్కొనేందుకు కృషి చేయాలి. ఆయుధాలు ఎగుమతి చేసే దేశాలు చీకటి మార్కెట్ల ద్వారా అమ్మకం చేసుకుంటున్నట్లు ఇటీవల వెల్లడించాయి. హిందూ మహాసముద్ర దేశాల రక్షణ నిమిత్తం ఆ ప్రాంతపు దేశాల ఇండియా, ఆస్ట్రేలియా నావికాదళాలతోపాటు అమెరికా నావికాదళాలు కూడా కంబైన్డ్ యుద్ధ విన్యాసాలను జరపడం దాకా ఈ దేశాల చుట్టుపక్క ప్రాంతాల రక్షణకు అప్రమత్తంగా ఉన్నామని అక్రమ చొరబాటుదారులకు, స్మగ్లర్స్‌కు హెచ్చరికలు జారీ చేయడం జరిగింది. ఈ సమస్య ప్రతి ఏడాది పునరావృతం అవుతుంటుంది. కనుక శాశ్వత మార్గం కనుక్కోవాలి. శాంతిమండలిగా చేయాలనే 1982 నాటి ప్రతిపాదనను అమలుచేసి హిందూ మహాసముద్రజలాలపై ఉద్రి క్తతలను తొలగించి శాంతియుత స్థితిని కొనసాగించాలని లిట్టోరల్ దేశాలు కోరుకుంటున్నాయి. కాని చైనా ఈ ప్రాంత దేశాల మీద ఆధిపత్యం పొందాలని ఆశపడుతుండడం వలన ఉద్రిక్తతలను ఎదుర్కొనాలి. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఐక్యరాజ్య సమితికి నిధులు తగ్గించుట ద్వారా వాటిని అమలుచేయు యంత్రాంగాన్ని తగ్గించడం జరుగుతుంది. హిందూ మహాసముద్రపు లిట్టోరల్ దేశాలే తమ రక్షణకు శ్రద్ధ వహించాలి. అందుకే బహు దేశాల నావికాదళాల విన్యాసాలు ఈ దేశాల భద్రత చర్యలు తీసుకుంటూ నమ్మకంగా ఉంటాయి. అదే సమయంలో ఇండియాకు సముద్ర ఉత్పత్తుల ద్వారా 10,000 కోట్ల ఆదాయం పొందుతుంది. కనుక హిందూ మహాసముద్ర ప్రాంత జలాలపై ఉద్రిక్తతలు లేకుండా చర్యలు మరింత పెంచి భద్రతావలయాలను ఏర్పరచుకోవలెను. ఆంధ్రప్రదేశ్ కూడా సుధీర్ఘంగా 800 కిలోమీటర్ల పొడవున కోస్ట్‌లైన్ బంగాళాఖాతంకు హిందూ మహాసముద్రపు లింకునుపయోగించుకొని ఎగుమతులు దిగుమతుల ప్రోత్సాహంకు ఎంతగానో తోడ్పడుతుంది. మెరైన్ శాఖ ఇందుకు ఎంతగానో శ్రద్ధాసక్తులను చూపుతుంది. ముందు ముందు అందరికీ ప్రయోజనాలనందించే హిందూ మహాసముద్రం శాంతి మండలంగా ఉంటుందని కోరుకొందాం.

-కె.విజయ,
8008359912

యువతతోనే పంచాయతీలు పరిపుష్టం



గ్రామాలలో ప్రజాస్వామ్యం వికసించి, అది స్వయం సమృద్ధి సాధించినప్పుడే జాతి పురోగతమవుతుందని అన్నారు మహాత్మ గాంధీ, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలలో స్వయం పాలన బాట పట్టించడం కోసం పంచాయతీ రాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. అంటే గ్రామాల అభివృద్ధి కొనసాగినప్పుడే రాష్ట్రం దేశం అభివృద్ధి దిశగా పయనిస్తుందని అర్థం. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఆ సమయం ఆసన్నమైంది. ఎన్నో అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు ఎన్నికల సంఘం రిజర్వేషన్స్ ఖరారు చేయడంతో ఎన్నికలకు రంగం సిద్ధమైంది. జనవరి 21, 25, 29 న మూడు విడతలుగా ఒక నెలలోపే సర్పంచులను నియమించబోతుంది. కానీ ఎన్నుకోబడే వ్యక్తులు ఎలా ఉండాలి? ఎవరిని ఎన్నుకోవాలి? అనే సంగతి సమాజ నిర్మాతలను ఆవిష్కరించే ఓటర్ల పైనే వుంది.

ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా, అధికార బలంతో గట్టెక్కిన ఇలా ఎన్నో కారణాలతో గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నికయ్యారంటే తన విధులేంటో, గతంలో దేశంలో గ్రామాల అభివృద్ధికి పాల్పడిన గ్రామ ప్రథమ పౌరుల గురించి తెలుసుకొని అదే బాటలో నిస్వార్థంగా పయనిస్తూ అభివృద్ధి బాట పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశంలో, రాష్ట్రాలలో జరిగే ఎన్నికలు ఒక ఎత్తయితే గ్రామస్థాయిలో జరిగే ఎన్నికలు మరొక ఎత్తు అనడంలో ఎలాంటి సంశయం అక్కరలేదు. ఎందుకంటే రాష్ట్ర, కేంద్ర నాయకులు ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు ఎంత ఘాటుగా చేసుకున్న వ్యక్తిగతంగా ఒకరినొకరు స్నేహభావంతో మెలుగుతారు. అదే విషయాన్నీ గ్రామ స్థాయిలో చూసినట్లయితే ఒకరిపై నొకరు పగలు, ప్రతీకారాలు పెంచుకుంటూ తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారనడంలో ఎలాంటి అనుమానం లేదు. తమ పార్టీ నేమన్న, పార్టీ నాయకుడినేమన్నా తమ కుటుంబసభ్యులకంటే ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ మెలుగుతుంటారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు నిర్వహించడం కంటే పంచాయితీ ఎన్నికలు నిర్వహించడం కొంచెం కష్టమని చెప్పక తప్పదు. ఏది ఏమైనప్పటికి సర్వం సిద్ధమైంది. రిజర్వేషన్స్‌లో తేడాలొచ్చాయని కొంతమంది కోర్టు మెట్లు ఎక్కారు కానీ కోర్టు సైతం ఎన్నికలు జరపడానికే మొగ్గుచూపుతోంది. అలాంటప్పుడు గ్రామీణ ప్రజలు ఎంతో అప్రమత్తమై నిస్వార్థంతో, గ్రామాభివృద్ధికి పాటుపడే నాయకుడిని ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడు జరిగే పంచాయితీ ఎన్నికలలో యువతే కీలకం కానున్నారు. కావున గతంలో రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసి, చరిత్ర సృష్టించిన కొన్ని విషయాలను చూస్తే రంగారెడ్డి జిల్లా హాజిపల్లి గ్రామానికి చెందిన గ్రామ ప్రథమ పౌరురాలిగా ఎన్నికై గ్రామంలోని విధులన్నీ సిమెంట్ రోడ్లతో నిర్మించి, ప్రతి వీధికి భూ అంతర్భాగము ద్వారా మురికి కాలువలను నిర్మించి, ప్రతి ఇంటికి మరుగు దొడ్లు కట్టించి, పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను, గ్రామ పంచాయితీ భవనాన్ని, గ్రంథాలయాన్నీ నిర్మించి, 2008 లో అప్పటి దేశ ప్రథమ పౌరురాలు (రాష్ట్రపతి) శ్రీమతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా నిర్మల గ్రామ పురస్కారాన్నీ అందుకున్నారు. అదే సంవత్సరం నవంబర్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి శుభ్రం అవార్డు పొందడం అనేది మిగతా గ్రామ ప్రథమ పౌరులకు నిదర్శనం. తెలంగాణలోని వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి, కరీం నగర్ జిల్లాలోని రామచంద్రపురం, నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ గ్రామం మరియు మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలోని హైవేర్ బజార్‌లో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలిస్తే గ్రామ సభలను విజయవంతంగా జరిపి, పలు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతూ, ఆ సభలలో గ్రామంలోని ప్రతి ఒక్కరిని హాజరయ్యేటట్లు చేసి, గ్రామాభివృద్ధికి కృషి చేశారు. గంగాదేవి పల్లిలో 18 వివిధ రకాల కమిటీలను గ్రామసభ ద్వారా శుద్ధమైన త్రాగునీరు కమిటీ, పారిశుద్ధ్య కమిటీ, ఆరోగ్య కమిటీ, సమాచార కమిటీలు మొదలగు వాటిని ఏర్పాటుచేసి ఎవ్వరికి ఏ విషయంలో సమస్య వచ్చిన, తగిన కమిటీలను సంప్రదించి సులభంగా పరిష్కరించుకునే విధంగా యంత్రాంగాన్నీ ఏర్పాటు చేసి అభివృద్ధికి దోహదపడటం జరిగింది.

పాఠశాలకు వెళ్ళే వయసు వచ్చిన బాల బాలికలను పాఠశాలలలో చేర్పించేటట్లు యంత్రాంగాన్ని తయారుచేసి గ్రామంలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు కృషిచేస్తూ విజయవంతం కావడం. ప్రతి ఇంటికి పరిశుభ్రమైన త్రాగునీరు అందేటట్లు చూడటం. జనాభా నియంత్రణలో భాగంగా దంపతులను ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలతో చాలని ప్రోత్సహిస్తూ ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్స్ చేయించడం. గ్రామంలోని ప్రతి పసిపిల్లలకు ప్రభుత్వం తరుపున అందించే పోలియో చుక్కలు, టీకాలు, వివిధ వ్యాక్సిన్లు సకాలంలో అందరికీ అందేటట్లు చూడటం. గ్రామంలోని ప్రతి కుటుంబానికి బ్యాంకులో ఖాతా తెరిచి నగదు నమోదు చేసుకోవడానికి ప్రోత్సహించడం. గ్రామంలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాముఖ్యతనిస్తూ, ఎవరికీ ఎలాంటి అంటూ రోగాలు రాకుండా జాగ్రత్తపడటం. గ్రామంలో అందరి సమేతంగా మద్యపానాన్ని నిషేధించి అభివృద్ధిలో పరుగులు తీసేవిధంగా తీర్చిదిద్దడం అనేది యావత్తు రాష్ట్రానికి ఆదర్శప్రాయంగా నిలిచింది. ఇవియే గాకుండా గ్రామాలలో గ్రామ ప్రథమ పౌరులే గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసిన గ్రామాల గురించి తెలుసుకొని, వాటిని ఆదర్శంగా తీసుకొని ఎన్నికైన సర్పంచులు వాటితో సహా, మారుతున్న కాలానుగుణంగా మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, యావత్తు రాష్ట్రంలో ప్రతిగ్రామం అభివృద్ధిలో ఒకరికొకరు పాటుపడుతూ, గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, దేశాభివృద్ధి జరగాలంటే గ్రామాలాభివృద్ధి కీలకమని ప్రత్యక్షంగా రుజువు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఒకరిపై ఒకరు వ్యక్తిగతంగా ఛాలెంజ్‌గా తీసుకొని అధిక ధనాన్ని ఖర్చుచేసి, మద్యాన్ని ఏరులై పారిస్తూ, తను నష్టపోయి, ఇతరులను ఇబ్బందులపాలు చేయకుండా చూసుకోవాల్సిన భాద్యత ఎంతైనా ఉన్నది. గ్రామంలోని ప్రజలంతా కలిసికట్టుగా వుండి అభివృద్ధిని కాంక్షిస్తూ వీలైతే యునానిమస్‌గా ఎలాంటి ఎన్నికలు లేకుండా నిస్వార్థ పరుడిని, గ్రామ క్షేమం, సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే వ్యక్తులను ఎన్నుకోవడం ఎంతో మంచి పరిణామం.

-డా. పోలం సైదులు, 9441930361

నలుగురికి డీఐజీలుగా పదోన్నతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలో నలుగురు ఐపీఎస్‌లు డీఐజీలుగా పదోన్నతులు పొందారు. 2004 బ్యాచ్‌కు చెందిన నలుగురు ఐపీఎస్‌లు వి.శివకుమార్, వి.బి.కమలాసన్‌రెడ్డి, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ఏఆర్ శ్రీనివాస్ ఈ పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శైలేంద్ర కుమార్ జోషి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఎస్‌సీ ఫీజు గడువు పెంపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎస్ఎస్‌సీ వార్షిక ఫీజు చెల్లించడానికి అపరాధ రుసుంతో చెల్లించడానికి గడువును పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అపరాధ రుసుం రూ. 1000తో జనవరి 18 వరకు అవకాశం కల్పిస్తున్నట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్మాష్టర్లు ఫీజు చెల్లింపు వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి 21 వరకు అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని రెగ్యులర్ విద్యార్థులతోపాటు ప్రైవేట్ (వన్‌టైమ్ ఫెయిల్డ్) అభ్యర్థులకు కూడా వర్తిస్తుందని స్పష్టం చేశారు.

కొండా దంపతులకు నాలుగు వారాల

భద్రత కొనసాగించండి: హైకోర్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వరంగల్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖకు గతంలో కల్పించిన 2ప్లస్2 భద్రత, ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుకు గతంలో కల్పించిన 3ప్లస్3 భద్రతను నాలుగు వారాల పాటు కొనసాగించాలని వరంగల్ పోలీసు కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్. రామచంద్రరావు శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. తమకు ప్రాణ హాని ఉన్నందువల్ల గతంలో కల్పించిన 2ప్లస్2 భద్రతను కొనసాగించేలా వరంగల్ పోలీసు కమిషనర్ ను ఆదేశించాలని అభ్యర్థిస్తూ మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. అలాగే, తనకు గతంలో ఇచ్చిన 3ప్లస్3 భద్రత కొనసాగించేలా ఆదేశాలు జారీ చేయాలని ఆమె భర్త కొండా మురళీధర్ రావు హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు.

7న బీసీ విద్యుత్ ఉద్యోగుల సభలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని బీసీ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలను ఈ నెల 7న నిర్వహించాలని బీసీ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. శుక్రవారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం సంఘం అధ్యక్షులు కుమారస్వామి అధ్యక్షతన బీసీ భవన్‌లో జరిగింది. సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్, గుజ్జ కృష్ణ, యాదగిరి, డాక్టర్ చంద్రుడు, అశోక్ కుమార్, మేఘనాథ్, నీల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. బీసీ విద్యుత్ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల ఉద్యోగాల కల్పనకు ఉన్న క్రిమీలేయర్‌ను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడానికి ఎటువంటి రాజ్యాంగపరమైన అడ్డంకులు లేవని ఆర్ కృష్ణయ్య స్పష్టం చేశారు. కేంద్ర స్థాయిలో విద్య, ఉద్యోగాల కల్పనకు రిజ్వేషన్లను 27 నుంచి 52 శాతానికి పెంచాలన్నారు.

అటవీ నేరగాళ్లను పట్టిన డాగ్ స్క్వాడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అటవీ నేరాల నియంత్రణకు మంచిర్యాల జిల్లా జిన్నారం డివిజన్‌లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన డాగ్ స్క్వాడ్ ఇద్దరిని పట్టుకోగలిగింది. చింతగూడ పరిధిలో చుక్కల దుప్పిని చంపి మాంసం విక్రయం కోసం ప్రయత్నించిన నిందితులను డాగ్ స్క్వాడ్ సహాయంతో అటవీశాఖ ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, వన్యప్రాణి చట్టం కింద కేసు నమోదు చేశారు. వేటగాళ్ళు దుప్పిని వేటాడారని పసిగట్టిన సిబ్బంది వెంటనే డాగ్‌స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. వాసన పసిగట్టడం ద్వారా అటవీ ప్రదేశం నుంచి వెతుక్కుంటూ వెళ్ళిన డాగ్‌స్క్వాడ్ వేటాడిన దుప్పి మాంసం దాచిన ప్రదేశాన్ని, నిందితులను కనిపెట్టింది. ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణలో ఇలా డాగ్‌స్క్వాడ్ ద్వారా అటవీ నేరగాళ్ళను పట్టుకోవడం ఇదే తొలిసారని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఎన్ఐఏకు జగన్ కోడి కత్తి కేసు

- ఏపీ హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన కోడి కత్తి దాడి కేసు దర్యాప్తు బాధ్యత జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు అప్పగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దాడి కేసు దర్యాప్తు బాధ్యత కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్ఐఏకు అప్పగించాలంటూ వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారించింది. జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ కొంగర విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం జగన్ కేసు విచారణ చేపట్టగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కేసు దర్యాప్తు బాధ్యత ఎన్ఐఏకు అప్పగించినట్లు పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 1న హైదరాబాద్‌లోని ఎన్ఐఏ పోలీసులు కేసు నమోదు చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకురాగా ఆమోదిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు: వైసీపీ నేత ఉమ్మారెడ్డి

ప్రతిపక్షనేత జగన్మోహన్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెంపపెట్టు వంటిదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పార్టీ కేంద్రకార్యాలయంలో మీడియా సమావేశంలో ఉమ్మారెడ్డి మాట్లాడుతూ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసును హైకోర్టు ఎన్ఐఏకు అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

నారా కత్తిడ్రామా బయటకొస్తుంది: మాజీ ఎంపి మిథున్ రెడ్డి


జగన్మోహన్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం ఘటనలో కుట్రకోణం త్వరలోనే బయటకు వస్తుందని వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో మాట్లాడగుతూ, జగన్‌కేసును ఎన్ఐఏకు అప్పగించడాన్ని స్వాగతిస్తున్నట్టు ఆయన తెలిపారు.

జగన్ ఆస్తుల కేసు మళ్లీ మొదటికి..

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసును సీబీఐ కోర్టులో మళ్లీ మొదటి నుండి విచారించే అవకాశాలు ఉన్నాయి. ఈ కేసు విచారణ ఇప్పటికే దాదాపుగా ఐదేళ్లుగా సాగుతున్న సంగతి విదితమే. 11 చార్జిషీట్లు ఇప్పటి వరకు దాఖలు కాగా, మూడు చార్జిషీట్లపై రెండేళ్లుగా విచారణ జరుగుతోంది. ఉమ్మడి హైకోర్టు విడిపోవడంతో నాంపల్లి సీబీఐ కోర్టు న్యాయమూర్తి వెంకటరమణ ఏపీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త న్యాయమూర్తిని ఇంకా నియమించలేదు. ఈ నేపథ్యంలో కొత్తగా ఎవరు న్యాయమూర్తిగా నియమితులైనా తిరిగి వాదనలను ఆయన మొదటి నుంచి వినాల్సిందే. దీంతో తిరిగి మొదటికి వచ్చింది. సీబీఐ కోర్టులోనే జగన్, విజయసాయిరెడ్డి సహా మిగతా నిందితులందరిపైనా మళ్లీ మొదటినుంచి విచారణ జరగనుంది. శుక్రవారం వైఎస్ జగన్ కోర్టు విచారణకు హాజరు కాగా, విచారణ 25కు వాయిదా వేసినట్లు తాత్కాలిక న్యాయమూర్తి తెలిపారు.

'అగ్రిగోల్డ్' ఉసురు తగులుతుంది

- ఏపీ సీఎం చంద్రబాబుకు బొత్స హెచ్చరిక



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అగ్రిగోల్డ్ ఆస్తులు కాజేయాలని చూస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, అయన తనయుడు లోకేష్‌లకు బాధితుల ఉసురు తగులుతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో బొత్స మాట్లాడుతూ సీఎం స్థాయిలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాల్సిందిపోయి తన బినామీదార్లకు, బంధువులకు దోచిపెట్టాలని చూడటం సిగ్గుచేటన్నారు. అగ్రి గోల్డ్ బాధితులకు న్యాయం జరిగేవరకూ తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మీద జరిగిన హత్యాప్రయత్నం వెనుక కుట్ర దాగిఉందని తమపార్టీ మొదటినుంచీ చెబుతూ వస్తున్నట్టు తెలిపారు. డీజీపీ స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రభుత్వానికి తొత్తులా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. జగన్‌పై హత్యాయత్నం కేసును ఎన్ఐఏకు బదిలీ చేయడం శుభపరిణామం అన్నారు.

ప్రైవేట్ కాలేజీల్లో నాణ్యతపై

సర్కార్ నజర్!

- తనిఖీ కమిటీని నియమించనున్న ఉన్నత విద్యా మండలి
- సదుపాయాలు, అధ్యాపకులు, ల్యాబ్, లైబ్రరీలపై ప్రత్యేక దృష్టి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో నాణ్యత, ప్రమాణాల పెంపుపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల వివరాలను ఇవ్వాలని కోరుతూ త్వరలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్‌ను జారీ చేయనుంది. నోటిఫికేషన్ సందర్భంగా ఆయా కాలేజీల వివరాలను ఇవ్వాలని కోరనుంది. కాలేజీలు వివరాలను సమర్పించిన అనంతరం వారు సమర్పించిన వివరాలను పరిశీలించేందుకు ఉన్నత విద్యా మండలి కమిటీని నియమించనుంది. ప్రైవేట్ కాలేజీల బాగోగులపై కమిటీ ఇచ్చే నివేదికలోని అంశాల ఆధారంగా ఉన్నత విద్యా మండలి చర్యలు తీసుకోనుంది.


ఈ తనిఖీల్లో భాగంగా ప్రధానంగా కాలేజీలోని సదుపాయాలను, అధ్యాపకుల వివరాలను, ల్యాబ్, లైబ్రరీలను పరిశీలించనున్నారు. అదేవిధంగా కాలేజీలు ఎక్కడ స్థాపించారు... వారు చూపిస్తున్న అడ్రస్‌లో ఉందా లేదా అనే వివరాలను పరిశీలించనున్నారు. కొన్ని కాలేజీలు వారు సమర్పించిన అడ్రస్‌లో కాకుండా వేరే ప్రాంతాల్లో కొనసాగిస్తున్నారు. అలాగే కాలేజీలో ఉన్న కోర్సులు, విద్యార్థులకు అనుగుణంగా అధ్యాపకులు ఉన్నారా? లేదా? అనే అంశాలను కూడా పరిశీలించనున్నారు.

రాష్ట్రంలో 1100కుపైగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలున్నాయి. వాటిలో ఉండాల్సిన సదుపాయాలు, ఉన్న సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఇందుకు సంబంధించిన కమిటీని ఉన్నత విద్యా మండలి త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. ఈ కమిటీ సంక్రాంతి అనంతరం కాలేజీల వారీగా తనిఖీలు చేస్తుంది. ప్రైవేటు కాలేజీల్లో నాణ్యత ప్రమాణాలను పెంచడం కోసమే ఇటువంటి ప్రయత్నాన్ని ఉన్నత విద్యా మండలి చేపట్టినట్టు సమాచారం. ఉన్నత విద్యా మండలి సమర్పించే నివేదిక ఆధారంగానే వచ్చే ఏడాది 2019-20లో ఆయా కాలేజీలకు గుర్తింపు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తారు.

చైనా మాంజ నిషేధం

- విక్రయించినా, వినియోగించినా ఐదేళ్లు జైలుశిక్ష: పీసీసీఎఫ్ పీకే ఝూ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి సంబరాల్లో చైనా మాంజ (నైలాన్ సెంథటిక్)ను నిషేధించినందున దాన్ని వినియోగించరాదని అటవీ శాఖ ముఖ్య సంరక్షకుడు ప్రశాంత్ కుమార్ ఝూ కోరారు. సంక్రాంతి పండుగకు గాలిపటాలు ఎగురవేయడం ఎంత ముఖ్యమో, పక్షుల ప్రాణాలు కాపాడడం కూడా అంతే ముఖ్యమని, దీన్ని దృష్టిలో ఉంచుకుని నూలు దారాన్ని మాత్రమే గాలిపటాలకు వినియోగించాలని శుక్రవారం విలేకరుల సమావేశంలో చెప్పారు. ఈ సమావేశంలో వన్యప్రాణి ఓఎస్‌డీ శంకరన్ కూడా పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఝూ మాట్లాడుతూ, ప్లాస్టిక్ దారంతో గ్లాస్ కోటింగ్ కలిగిన చైనా మాంజాను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిషేధించినందున దాన్ని వాడితే శిక్షార్హులని హెచ్చరించారు. ఈ మాంజ మార్కెట్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అలాగే విద్యార్థులు, యువకులు మాంజ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. చైనా మాంజ చెట్లపై తెగిపోయి పక్షులకు హాని కలిగిస్తోందని, అప్పుడప్పుడు వ్యక్తులకు కూడా నష్టం వాటిల్లుతోందని ఆయన చెప్పారు. చైనా మాంజ నైలాన్ సింథటిక్‌తో ఉన్నందున ఇది ఎన్నేళ్ళయి నా కుళ్ళిపోదని, ఇది చెట్లకు, విద్యుత్ స్తంభాలకు చిక్కుకుంటే వాటిపై వాలే పక్షుల రెక్కలను కోస్తున్నాయని ఝూ చెప్పారు.

నిషేధిత చైనా మాంజ మార్కెట్ చేసే వారిపై దాడులు చేసి నిల్వలను స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పారు. విక్రయించినా, వినియోగించినా ఐదేళ్ళు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా ఉంటుందని ఝూ చెప్పారు. ఇప్పటి వరకు జంట నగరాల్లో 800 కిలోల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నామని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 2016 నుంచి 123 దుకాణాల నుంచి ఈ నిల్వలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్ నుంచి చైనా మాంజ హైదరాబాద్‌కు దిగుమతి అవుతోందని, దీనివల్ల స్థానికంగా నూలుదారంతో మాంజ చేసేవారు ఉపాధి కోల్పోతున్నారన్నారు. చైనా మాంజవల్ల జరిగే అనర్థాలను వివరించి దాని వినియోగాన్ని అడ్డుకోవడంలో సహకరించాల్సిందిగా స్వచ్ఛంద సంస్థలను కోరామని, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

దిగ్విజయ్ సింగ్‌కు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీ నాయకుడు దిగ్విజయ్ సింగ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. దిగ్విజయ్‌కు నాంపల్లి 8వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బిడబ్లూ) హైకోర్టు సస్పెండ్ చేసింది. పోలీసులు ఈ ఎన్‌బీడబ్ల్యూను అమలు చేయరాదని హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. శివశంకరరావు శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ ఎంఐఎం పార్టీ సంయుక్త కార్యదర్శి ఎస్‌ఏ.హుస్సేన్ అన్వర్ దిగ్విజయ్‌పై పరువునష్టం దావా వేసిన విషయం తెలిసిందే. ఈ కేసును విచారించిన నాంపల్లి 8వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టులో దిగ్విజయ్ వేసిన క్వాష్‌పిటిషన్ విచారణలో ఉండగానే నాంపల్లి కోర్టు ఎన్ బీ డబ్ల్యూ జారీ చేసింది.

పాలనలో ఐఎస్ఎస్‌లు కీలకం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలనలో ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీసెస్ అధికారులది కీలకపాత్ర అని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం డైరెక్టర్ జనరల్ బీపి ఆచార్య అన్నారు. శుక్రవారం ఐఎస్ఎస్ అధికారుల మిడ్ కెరీర్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణాకోర్సు ముగింపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ధృవీకరణ పత్రాలు అందజేశారు. నేషనల్ స్టాటిస్టికల్ ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ శిక్షణను నిర్వహించింది.

విశాఖకు 12 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సంక్రాంతి రద్దీ నేపథ్యంలో సికింద్రాబాద్ - విశాఖపట్టణం (వయా రాయనపాడు)ల మధ్య 12 ప్రత్యేక రైళ్ళను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో పేర్కొంది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణంకు 3 రైళ్ళు 9, 16, 17 తేదీలలో బయలు దేరనుండగా, విశాఖపట్టణం నుంచి సికింద్రాబాద్‌కు ఏడు రైళ్ళు 11,13,14,17,18,20,21 తేదీలలో బయలు దేరుతాయని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైళ్ళు దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, ఖాజీపేటల మీదుగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

21 జిల్లాలకు టీటా కార్యదర్శులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) 21 జిల్లాల కార్యదర్శులను ప్రకటించింది. జగిత్యాల జిల్లాకు చిక్కులపల్లి విష్ణు, కామారెడ్డి కి ప్రదీప్ నీలగిరి, కరీంనగర్‌కు మహిరతన్ దేవా, ఖమ్మంకు మధూరి కృష్ణచైతన్య, మహబూబాబాద్‌కు వీరబొమ్మ ప్రణీత్ కుమార్, మేడ్చల్‌కు రాజకుమార్ ఎండ్ల, నల్గొండకు స్వాతి చినుకూరి, నిజామాబాద్‌కు రవీందర్ రాయుడు, పెద్దపల్లికి భాస్కర్ పిన్న నియమించినట్లు టీటా అధ్యక్షుడు తెలిపారు.

నైపుణ్య శిక్షణతో మెరుగైన ఉపాధి

- హైదరాబాద్‌లో 15 శాతం పెరిగిన ఉపాధి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పారిశ్రామిక రంగానికి అవసరమైన నైపుణ్యంలో యువతకు శిక్షణ ఇస్తే భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. ఇంజనీరింగ్ పట్టాలు తీసుకుంటున్న విద్యార్థులుగానీ, ఇతర సాంకేతిక విద్యను అభ్యసించిన వారికి సరైన శిక్షణ లేక పరిశ్రమలు వారిని నియమించుకునేందుకు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్న తరుణంలో శిక్షణా సంస్థలకు డిమాండ్ పెరుగుతోంది. హైదరాబాద్‌లో ఎన్నో ఐటీ, ఐటీ ఆధారితతో పాటు ఉత్పత్తి రంగానికి చెందిన కంపెనీలు భారీగా ఏర్పాటవుతున్నాయి. మరోవైపు కన్‌స్ట్రక్షన్ రంగం రెండంకెల వృద్ధిరేటుతో దూసుకుపోతున్న తరుణంలో శిక్షణ పొందిన కార్మికులు లేకపోవడంతో భారీ ప్రాజెక్టుల నిర్మాణాలు వేగంగా కొనసాగడం లేదని అధ్యయనాలు తెలుపుతున్నాయి. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం టాస్క్‌ను ఏర్పాటుచేసి వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. గడిచిన ఏడాది ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఫార్మా, వ్యవసాయ రంగాల్లో అప్రెంటిస్ కల్పించడంతో 70 శాతం మంది యువకులకు ఈ రెండు రంగాలే ఉపాధి కల్పించాయి. జిల్లాల్లో ఈ రెండు రంగాలకు ఎక్కువ మంది శిక్షణ పొందిన వారు అవసరమైనందున వాటికి డిమాండ్ బాగా పెరిగింది. ఈ ఏడాది కూడా ఈ రెండు రంగాల్లో శిక్షణ ఇస్తే మరో 25 శాతం మేరకు ఉపాధి పెరుగుతుందని టీమ్ లెస్ లోగో వెల్లడించింది. ఆటో, ఫార్మా, అగ్రి, ఐటి, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగాల్లో కూడా గణనీయమైన ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పారిశ్రామిక రంగాలకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు నెటాప్ ఇటీవల చర్చ జరిపింది. పరిశ్రమ, ప్రభుత్వ ప్రతినిధులు, ట్రేడ్ అసోసియేషన్లతో జరిపిన చర్చల మేరకు శిక్షణ మరింత పెంచాలని నిర్ణయించారు. కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం, వరంగల్ నగరాలను స్మార్ట్ సిటీలుగా తీర్చిదిద్దుతున్న తరుణంలో, అనంతపురంలో ఒఈఎం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో భారీగా పెట్టుబడులు రాష్ట్రాలకు తరలిరానున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రంగానికి సంబంధించి నైపుణ్యాలు పెంచాల్సిన అవసరం ఉందని నెటాప్ జనరల్ మేనేజర్ గిరిజా.ఎస్ అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో గత మూడేళ్ళలో అప్రెంటిస్ శిక్షణలో 15 శాతం పెరిగిందన్నారు. నైపుణ్యంలో శిక్షణ పొందిన వారి ప్రతిభ, అర్హతను గుర్తించిన సంస్థలు ఎక్కువ వేతనాలతో ఉపాధి పొందేందుకు అవకాశాలు మెరుగవుతున్నాయని ఆమె పేర్కొన్నారు.

గత ఏడాది దేశవ్యాప్తంగా లక్షా 30వేల మంది శిక్షణ పొందగా, 550 కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చాయని గిరిజా తెలిపారు. తెలంగాణలో కూడా 20వేల నుంచి 30వేల వరకు గత ఏడాది శిక్షణ పొంది ఉపాధిలో చేరారు. దేశవ్యాప్తంగా రిటైల్, మ్యానుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్, బీఎఫ్ఎస్ఐ రంగాల్లో ఈ ఏడాది మంచి అవకాశాలు ఉంటాయన్నారు. అలాగే బ్యాంకింగ్, ఆటోమోటివ్, రిటైల్, ఎఫ్ఎంసీజీ రంగాల్లో కూడా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. టాస్క్ ద్వారా 3,500 మందికి శిక్షణ ఇవ్వగా, వారందరికీ మంచి వేతనంతో కూడిన ఉపాధి లభించింది. దేశంలో నైపుణ్యం అనేది పారిశ్రామిక రంగానికి ఎంతో కీలకమని, కేవలం డిగ్రీలే కాకుండా సంబంధిత విద్యలో శిక్షణ పొందడం, అలాగే ఇతర వృత్తి పనుల్లో నైపుణ్యం పొందితే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని నెటాప్ పేర్కొంది.

వారంలో మోడల్ స్కూల్

ప్రవేశాల నోటిఫికేషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఉన్న మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం వారంలో నోటిఫికేషన్ వెలువడనుంది. ఇందుకు సంబంధించిన కసరత్తును పాఠశాల విద్యా శాఖ ఇప్పటికే పూర్తి చేసినట్టు తెలుస్తోంది. వారం రోజుల్లో నోటిఫికేషన్‌ను జారీ చేయడానికి ప్రణాళికను సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో 194 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. వాటిలో ఒక్కో స్కూల్‌లో 100 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తంగా 19400 సీట్లకు నోటిఫికేషన్ జారీ కానుంది. అయితే వీటిలో కేవలం 6వ తరగతిలో మాత్రమే అడ్మిషన్లు తీసుకోనున్నారు. వీటితోపాటు రాష్ట్రంలో మోడల్ స్కూల్స్‌లోనే కొనసాగుతున్న ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు కూడా నోటిఫికేషన్‌ను ఇచ్చేందుకు అధికారులు ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది.

టీబీతో గిరిజన బాలిక మృతి

ఉట్నూర్ రూరల్, ప్రభ న్యూస్ : ఆదిలాబాద్ జిల్లా, దంతన్‌పల్లి పిహెచ్‌సీ పరిధిలోని జెండగూడ గ్రామానికి చెందిన సిడాం అఖిల (12) అనే గిరిజన బాలిక టీబీ వ్యాధితో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సిడాం కర్ణు, భీంబాయిలకు ముగ్గురు సంతానం కాగా చిన్న కూతురు సిడాం అఖిల కొన్ని నెలలుగా టీబీతో బాధపడుతుండగా దంతన్ పల్లి పిహెచ్‌సీ, ఉట్నూర్ సిహెచ్‌సీ ఆదిలాబాద్ రిమ్స్‌లో వైద్య చికిత్సలు అందించినప్పటికి వ్యాధి నయం కాకపోవడంతో గత ఏడు రోజులుగా ఇంటి వద్దనే ఉండగా పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు.

జిమ్నాస్ట్ అరుణారెడ్డికి సర్జరీ సక్సెస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జిమ్నాస్ట్ అరుణారెడ్డికి ఏసీఎల్ రీకన్‌స్ట్రక్షన్ సర్జరీని విజయవంతంగా చేసినట్టు కాంటినెంటల్ ఆసుపత్రి సీఈవో ఫైసల్ సిద్ధిఖీ, ఆర్థోపెడిక్ సీనియర్ వైద్యులు డాక్టర్ మోహన్‌రెడ్డి తెలిపారు. మెడల్ సాధించిన అరుణారెడ్డి ఈ సందర్భంగా కాంటినెంటల్ ఆసుప్రతి వారు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఏసీఎల్ గాయాలు క్రీడాకారులకు సర్వసాధారణంగా అవుతుంటాయని వైద్యులు తెలిపారు. గాయాలు తగ్గడం కోసం రీకన్‌స్ట్రక్షన్ సర్జరీ చేయించుకోవాలని సూచిస్తామని అన్నారు. జిమ్నాస్ట్ అరుణారెడ్డికి కూడా ఇదే విధంగా ఏసీఎల్ రీకన్‌స్ట్రక్షన్ సర్జరీని చేసినట్టు తెలిపారు. ఆమె త్వరగా కోలుకుందన్నారు. జిమ్నాస్టిక్‌లో అరుణారెడ్డి దేశానికి తీసుకొచ్చిన పేరు ప్రఖ్యాతులు ఇంతా అంతా కావన్నారు. దేశంలోని బాలికలకు అరుణారెడ్డి ఒక స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.

ఎగ్జిబిషన్‌లో సింగరేణి సేవాసమితి స్టాల్




హైదరాబాద్, ఆంధ్రప్రభ : నాంపల్లిలో జరుగుతున్న ఆలిండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో సింగరేణి సేవా సమితి వస్తు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. శుక్రవారం సింగరేణి సంస్థ డైరెక్టర్ (ఇఅండ్ఎం) ఎస్. శంకర్ స్టాలును ప్రారంభించారు. సింగరేణి సంస్థ విస్తరించి ఉన్న వివిధ ప్రాంతాలలో స్వయం ఉపాధి యూనిట్లద్వారా ఉత్పత్తి చేసిన వస్తువులను ఈ స్టాలులో విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గత 12 సంవత్సరాలుగా సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్‌లో స్టాలును నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతీ ఏటా సింగరేణి సేవా సమితి స్టాల్‌కు ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి నిర్వాహక అధికారి బుడగం మహేష్, డిప్యూటీ జీఎం తడబోయిన శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఇంజనీర్ డి. సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి వేడుకల్లో విషాదం

- పెళ్లయిన మర్నాడు రోడ్డు ప్రమాదం..ఒకరి మృతి

ప్రాణాపాయ స్థితిలో నవదంపతులు



తలమడుగు, ప్రభ న్యూస్ : పెళ్లి అయిన కొన్ని గంటలకే నవదంపతులు ప్రమాదానికి గురయ్యారు. మృత్యురూపంలో బస్సు ఎదురుగా వచ్చి విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే పెళ్లి రోజు రాత్రి వరకు ఆనందంగా గడిపి ఉదయాన్నే రిసెప్షన్‌కు బయలుదేరిన నూతన వధూవరులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రాంనగర్‌కు చెందిన మెట్‌పల్లి అశోక్ మొదటి కుమార్తె ప్రియాంకను నిజామాబాద్ జిల్లా, మోర్తాడ్ మండలం వడ్యాల్ గ్రామానికి చెందిన అడెపల్లి సాయికుమార్‌కు ఇచ్చి గురువారం వివాహం చేశారు. వరుని నివాసంలో వివాహమైన మరుసటి రోజు వధువు తరపున నిర్వహించే రిసెప్షన్‌కు నవ దంపతులు ఆదిలాబాద్‌కు శుక్రవారం ఉదయం బయలుదేరారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఎస్ గార్డెన్‌లో నిర్వహించే రిసప్షన్ కోసం కారులో బయలుదేరిన వారు ఆదిలాబాద్ రూరల్ మండలంలో దేవాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద బస్సును ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. కారులో ఏడుగురు ప్రయాణిస్తుండగా ఆర్టీసి బస్సు ఆదిలాబాద్ నుంచి బరంపూర్ వైపు మూల మలుపు వద్ద అతివేగంగా వచ్చిన కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జుకాగా కారులో ప్రయాణిస్తున్న నవవధూవరులు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. వారితో పాటు ప్రయాణిస్తున్న ఐదుగురిలో వరుని మేనత్త రాజమణి(50) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది.

అమెరికాలోనే అంత్యక్రియలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : అమెరికాలోనే రాష్ట్రానికి చెందిన ముగ్గురు విద్యార్థుల అంత్యక్రియలు నిర్వహించనున్నారు. క్రిస్మస్ పండుగ రోజు చర్చిలో సంభవించిన అగ్ని ప్రమాదంలో నల్గొండ జిల్లా దేవరకొండకి చెందిన ముగ్గురు విద్యార్థులు చనిపోయారు. అయితే విమానంలో మృతదేహాల తరలింపు సాధ్యం కాదని అక్కడ అధికారులు స్పష్టం చేశారు. అమెరికాలో జరిగే అంత్యక్రియలకు కుటుంబ సభ్యులను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కుటుంబ సభ్యులను అమెరికా పంపేలా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, బిషప్ లాజరస్ కోరారు. ప్రభుత్వ ఖర్చులతో కుటుంబ సభ్యులను అమెరికా పంపిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు.

నేటినుంచి పీసా చట్టంపై జాతీయ సదస్సు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: పంచాయతీ ఎక్స్‌టెన్సన్ టు షెడ్యూల్ ఏరియా (పీసా) చట్టంపై అవగాహన పెంపొందించేందుకు రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డిలో జాతీయ సదస్సు ఏర్పాటు చేశారు. శనివారం నుంచి రెండు రోజులపాటు జరగే ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొననున్నారు. గిరిజనులకు, ఆదివాసిలకు స్వయం పాలనపై ఈ సదస్సు ద్వారా మరింత అవగాహన కల్పించనున్నారు.

రంగరాయగూడెంలో ఎలుగుబంటి మృతి

స్టేషన్‌ఘనపూర్, ప్రభ న్యూస్ : వరంగల్ జిల్లా, స్టేషన్‌ఘన పూర్ మండలంలోని రంగరాయగూడెంలో ఆడ ఎలుగుబంటి అనుమానాస్పద మృతిచెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అటవీ శాఖ అధికారి ఆర్.కొండల్‌రెడ్డి వివరాల ప్రకారం రంగరాయగూడెం గ్రామానికి చెందిన మంద ఎల్లయ్య శుక్రవారం తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లగా అక్కడ ఆడ ఎలుగుబంటి అనుమానాస్పదంగా మృతిచెంది పడిఉంది. ఎల్లయ్య అధికారులకు సమాచారం అందించారు.



స్వల్పంగా తగ్గిన సేవల రంగం జోరు

• డిసెంబర్‌లో 53.2 పాయింట్లకు

న్యూఢిల్లీ : దేశంలో గత నెలలో సేవలరంగంలో కార్యకలాపాలు స్వల్పంగా తగ్గాయి. నవంబర్‌తో పోల్చుకుంటే డిసెంబర్‌లో కంపెనీలకు కొత్త ఆర్డర్లు తగ్గాయి. వ్యాపార కార్యకలాపాలు మందగించాయని, అయితే ఉద్యోగావకాశాలు మాత్రం మెరుగుపడ్డాయని నిక్కీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటి సూచి పేర్కొంది. డిసెంబర్‌లో సేవలరంగం సూచి 53.2 పాయింట్లకు దిగిరాగా.. నవంబర్‌లో 53.7 పాయింట్లకు ఎగబాకింది. డిసెంబర్‌లో పీఎంఐ సేవల రంగం స్వల్పంగా తగ్గినా.. వరుసగా గత ఏడు నెలల నుంచి 50 పాయింట్లపైనే నమోదవుతూ వస్తోంది. సూచి 50 పాయింట్లపైన ఉంటే మెరుగ్గా ఉన్నట్లు తగ్గితే మాత్రం మందగమనంలో ఉన్నట్లు లెక్క.. మొత్తానికి భారతీయ సేవలరంగం మాత్రం క్రమంగా పుంజుకుంటోందని.. కొత్త వ్యాపారాలు, ఉద్యోగావకశాలు మెరుగుపడుతున్నాయని ఐహెచ్ఎస్ మార్కిట్ ప్రిన్సిపల్ ఆర్థికవేత్త పోల్లాయన్నా డీ లామా తాజా నివేదికలో వెల్లడించారు.



చిన్న రుణాలకు... సడలింపులొద్దు

• ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతింటుంది : ఫిచ్ రేటింగ్



న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ ఒత్తిడితో రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చిన్న వ్యాపారుల రుణాలను ఒక్కసారి పునర్నిర్మించాలన్న ప్రతిపాదనపై పెద్దెత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రుణాలను పునర్నిర్మించడం ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొనే వారికి క్రమశిక్షణ కొరవడుతుం దని మెజారిటి విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తాజాగా రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ కూడా దీనిపై స్పందించింది. సూక్ష్మ,చిన్న మధ్య తరహా వ్యాపారుల రుణాలపై కొన్ని రకాల సడలింపు వల్ల నిజాయి తీగా వ్యాపారాలు చేసుకొని బకాయిలు చెల్లించాలనుకునే వారు కూడా దీన్ని సాకుగా చూపించి వారు కూడా రుణ పునర్నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటారని ఫిచ్ రేటింగ్ అసోసియేట్ డైరెక్టర్ కరణ్ గుప్తా చెప్పారు.

రిజర్వుబ్యాంకు గవర్నర్‌గా పగ్గాలు చేపట్టిన తర్వాత శక్తికాం త దాస్ తక్షణమే చిన్న వ్యాపారు లకు ఊరట కలిగించేందుకు ముందుగా విధాన నిర్ణయాల్లో మార్పులు చేశారు. అయితే ఇక్కడ ఆశ్చర్యం కలిగించే అంశం ఏమింటే ఆర్‌బీఐ ఆర్థిక స్థిరత్వ నివేదికను ఒక్క రోజు ముందు విడుదల చేసింది. ఈ నివేదికలో ప్రభుత్వరంగానికి చెందిన బ్యాం కుల నుంచి తీసుకున్న చిన్న వ్యా పారుల రుణాలు పెద్దమొత్తంలో మొండిబకాయిలు మారు తున్నాయన్ని పేర్కొంది. ఆ తర్వాతి రోజున ఆర్‌బీఐ చిన్న వ్యాపారులకు ఊరట కలిగించే కొత్త విధాన నిర్ణయం తీసు కుంది. ఆర్‌బీఐ తీసుకొన్న ఈ నిర్ణయంపై ఆర్థికవేత్తలు పెద్దెత్తున విమర్శలు గుప్పిం చారు. ఇప్పటికే బ్యాంకింగ్ వ్యవస్థ మొండిబకాయిలతో సతమతమవుతుంటే తాజా నిర్ణయంతో ఈ మొండిబకా యిల సమస్య మరింత పెరిగి పోతుందని వారు హెచ్చరిస్తున్నారు. గతంలో కూడా చిన్న మధ్య తరహా వ్యాపారులకు ఇచ్చిన కొన్ని రకాల రాయితీల వల్ల బ్యాంకింగ్ రంగంపై ఒత్తిగి పెరిగిందని రుణాలు ఇవ్వడానికి నగ దు లేక ఇబ్బందులు పడ్డాయన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.


విద్యా రుణాల్లో 9 శాతం ఎన్‌పీఏలే

ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు విద్యార్థులకు ఇచ్చే రుణాల్లో సుమారు 9 శాతం వరకు మొండిబకాయిలుగా గత ఆర్థిక సంవత్సరంలో మారిపోయాయని ఆర్థిక శాఖ సహాయమంత్రి శివ ప్రతాప్‌శుక్లా లోకసభలో ఒక ప్రశ్న కు సమాధానంగా ఇచ్చారు. విద్యా రుణాల విషయానికి వస్తే మార్చి 31, 2016లో 7.29 శాతం నుంచి మార్చి 31, 2018 నాటికి 8.97 శాతానికి ఎగబాకిందని ఆయన లోకసభలో ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు.



ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట : ప్రసాద్


రూ.1 లక్ష కంటే తక్కువ మొత్తంలో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని మోసం చేసిన కేసులపై కేంద్రప్రభుత్వం రిజర్వుబ్యాంకుతో కలిసి పనిచేస్తుందని కేంద్ర ఐటి మంత్రి రవిశంకర్ ప్రసాద్ శుక్రవారం నాడు రాజ్యసభలో చెప్పారు. ప్రస్తుతం రిజర్వుబ్యాంకు ఇతర బ్యాంకులతో కలిసి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఎగ్గొట్టే కేసులపై దృష్టిపెట్టిందన్నారు. వీటిలో క్రెడిట్, డిబిట్ కార్డులతో పాటు ఎటీఎం కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కు సంబంధించి రూ.1 లక్ష కంటే ఎక్కువ మొత్తంలో జరిగే మోసాలపై ప్రత్యేక దృష్టి పెడుతుందని ప్రసాద్ అన్నారు. అలాగే డేటా హ్యాకింగ్‌పై కూడా దృష్టి పెట్టినట్లు చెప్పారు.



ఆర్థిక మోసాలు రూ. ఒక లక్ష కంటే ఎక్కువ మొత్తం కేసులపై ఆర్‌బీఐ ఇప్పటికే దృష్టి పెట్టిందన్నారు. ఆర్‌బీఐ తో కలిసి తాము కూడా రూ.1 లక్షల కంటే తక్కువ మొత్తం లావాదేవీ కేసులపై దృష్టి పెడుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఫైనాన్షియల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు ముసాయిదాను తయారు చేశామని, దీని ద్వారా డేటా హ్యాకింగ్‌కు చెక్‌పెడతామన్నారు. సైబర్ ప్రపంచంలో నెలకొన్ని ఒడిదుడుకుల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని ఆయన వివరించారు.

ప్రస్తుతానికి సరిపడా రూ. 2000 నోట్లు

కేంద్రప్రభుత్వం రూ.2000 నోటుపై శుక్రవారం వివరణ ఇచ్చింది. ప్రస్తుతం రూ.2000 నోటు పెద్దమొత్తంలో చలామణిలో ఉంది కాబట్టి, తాత్కాలికంగా ముద్రణ నిలిపివేసినట్లు పేర్కొంది. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ ట్వీట్ చేస్తూ... ముందు గా వేసుకున్న ప్రణాళిక ప్రకారం అవసరమను కున్నంత స్థాయిలో 2000 నోట్లు ముద్రించామని తెలిపారు. ప్రస్తుతం వ్యవస్థలో రూ.2,000 నోట్లు పెద్దమొ త్తంలో చలామణిలో ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం చలామణి లో ఉన్న కరెన్సీ నోట్లలో 35 శాతం రూ.2,000 నోట్లని ఆయన అన్నారు. ఇటీవల రూ.2,000 నోటు ముద్రణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని గార్గ్ పేర్కొన్నారు.



కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ నల్లధనం వెలికి తీయడానికి,. టెర్రరిస్టులకు నగదు అందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడానికి రూ.500/ రూ. 1,000 నోటును నవంబర్ 8, 2016 అర్ధరాత్రి నుంచి చలామణిని నుంచి తప్పిం చారు. వెంటనే రూ.2,000 నోట్లుతో పాటు కొత్తగా రూ. 500 నోటు డిజైన్‌ను మార్చి చలామణిలోకి తీసుకొచ్చారు. తాజా గురువారం రూ.2,000 నోటు ముద్రణ తగ్గింపు గురించి మీడియాలో వార్తలు రావడంతో ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి గార్గ్ వివరణ ఇచ్చారు.

స్ట్రీట్ 2 స్కూల్ సంస్థకు గ్లోబల్ అంబాసిడర్‌గా కబీర్ బేడీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలో అట్టడుగు వర్గాలకు చెందిన, సమకాలీన వ్యవస్థకు దూరమైన పిల్లలకు స్ట్రీట్ 2 స్కూల్ (వీధి నుంచి బడికి) కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నఇటలీకి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ కేర్ అండ్ షేర్ ఇటాలియా సినీ నటుడు కబీర్ బేడీని సంస్థకు గ్లోబల్ అంబాసిడర్‌గా ఎంపిక చేసింది. తమ సంస్థ 1500 మందికిపైగా నిస్సహాయులైన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో, వారు విశ్వవిద్యాలయం వరకు విద్యను కొనసాగించడంలో చేయూతనిస్తోందని కేర్ అండ్ షేర్ ప్రెసిడెంట్ టోమసా కారరో శుక్రవారం విలేకరుల సమావేశంలో చెప్పారు. విద్య ప్రాధాన్యతను గుర్తించి ఇలాంటి పిల్లలకు మద్దతు, పెట్టుబడి అందిస్తున్నామని, తద్వారా విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు దోహద పడుతున్నామని చెప్పారు. అట్టడుగు వర్గాల పిల్లలకు తగిన ఆర్థిక స్థోమత లేకపోయినా ఉన్నత విద్యను పొందగలుగుతున్నారని ఆయన చెప్పారు. స్ట్రీట్ 2 స్కూల్ నినాదానికి కబీర్ బేడీ మంచి ప్రాచుర్యాన్ని కల్పించేందుకు రాయబారిగా బాధ్యతలు నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

ఏడాది పోస్టాఫీసు టైం డిపాజిట్

• వడ్డీరేట్లు పెంపు

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి - మార్చి త్రైమాసానికి ఒక ఏడాది కాలపరిమితి పోస్టాఫీసు టైం డిపాజిట్.. చిన్న మొత్తాల పొదుపుస్కీంపై ప్రభుత్వం పది బేసిస్ పాయింట్లు వడ్డీరేటును పెంచింది. మిగిలిన చిన్న పొదుపు మొత్తాల స్కీంలు ఉదాహరణకు పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ (పీపీపీ), సుకన్యా సమృద్ధి యోజనా (ఎస్ఎస్‌వై) వడ్డీరేట్లలో ఎలాంటి మార్పుల్లేవని ఆర్థికమంత్రిత్వశాఖ శుక్రవారం నాడు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఏడాది పీఓటిడి వడ్డీరేట్లు 6.9 శాతం నుంచి 7 శాతానికి పెరుగుతుంది. అదే మూడు సంవత్సరాల కాలపరిమితి పీఓటిడి వడ్డీరేట్ల మాత్రం 20 బేసిస్ పాయింట్లు తగ్గించి 7 శాతానికి సవరించింది. అలాగే రెండు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల కాలపరిమితి పీఓటీడీ వడ్డీరేట్లు 7 శాతం, 7.8 శాతంలో ఎలాంటి మార్పుల్లేవు. అలాగే సేవింగ్స్ డిపాజిట్‌పై ఏడాదికి 4.4 శాతం వడ్డీరేటు యధావిధిగా కొనసాగుతుంది.

9 నెలల్లో 87,507 ట్రాక్టర్లను విక్రయించిన సోనాలిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ట్రాక్టర్ల ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచిన సోనాలిక ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ 2018 డిసెంబర్‌లో 20.8 శాతం వృద్ధిరేటుతో 6,066 ట్రాక్టర్లను ఉత్పత్తి చేసింది. ఈ కంపెనీ ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు మొదటి మూడు త్రైమాసికాల్లో 88,507 ట్రాక్టర్లను దేశీయంగా విక్రయించడంతో పాటు ఎగుమతులను కూడా సాధించినట్లు సోనాలిక గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమణ్ మిట్టల్ తెలిపారు. సోనాలిక ఈ ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 36 శాతం, దేశీయ మార్కెట్‌లో 18.6 శాతం వృద్ధి నమోదు చేసుకుందని చెప్పారు. డిసెంబర్‌లో 26 శాతం వృద్ధితో 1,014 ట్రాక్టర్లను ఎగుమతి చేసిందని ఆయన తెలిపారు.

పరోక్షపన్నుల వసూళ్ల లక్ష్యం రూ.11.16 లక్షల కోట్లు

• ఏప్రిల్ – నవంబర్ వసూళ్లు రూ. 6.12 లక్షల కోట్లు




న్యూఢిల్లీ : కేంద్రప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం పరోక్షపన్నుల వసూళ్ల లక్ష్యం రూ.11.16 లక్షల కోట్లుగా నిర్ణయించినట్లు శుక్రవారం పార్లమెంటులో ఆర్థికశాఖ సహాయంత్రి శివప్రతాప్ శుక్లా చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ కాలానికి పరోక్ష పన్నులు వాటిలో సీజీఎస్‌టి, ఐజీఎస్‌టి, జీఎస్‌టి -కాంపన్‌సేషన్ సెస్) అంతా కలిపి రూ.6,12,653.47 కోట్లు వసూలైనట్లు శుక్లాలో లోకసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కాగా బడ్జెట్ అంచనా ప్రకారం పరోక్ష పన్నులు ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.11.16 లక్షల కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన సభకు తెలిపారు. వసూళ్లు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రభుత్వం వివిధ రకాల చర్యలు తీసుకున్నట్లు సభకు వివరించారు. దీనికి ఆయన ఉదాహరణగా జీఎస్టీ పన్ను పెంచుకునేందుకు వివిధ రకాల వస్తువులపై పన్ను తగ్గించడంతో పాటు ఈ- ఫైలింగ్‌ను తప్పనిసరి చయడంతో పాటు ఈ- పేమెంట్ ద్వారా వసూలుచేయడం, చెల్లింపు ఆలస్యం చేస్తే జరిమానా వసూలు చేయడంతో పాటు థర్డ్‌పార్టీ సేవలను వినియోగించుకోవడం ఉదాహరణకు రాష్ట్ర వ్యాట్ విభాగంతో పాటు ఆదాయం పన్ను శాఖలను వినియోగించుకుంటున్నట్లు ఆయన వివరించారు.

పీఎస్‌బీ బ్యాంకుల విలీనంతో ఉద్యోగాలూడవు

• ఆర్థికమంత్రి జైట్లీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల విలీనంతో బ్యాంకు సిబ్బంది ఎవరూ ఉద్యోగాలు కోల్పోరని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ శుక్రవారంలోకసభలో చెప్పారు. ఈ వారం ప్రారంభంలో ప్రభు త్వానికి చెందిన మూడుబ్యాంకులు విజయాబ్యాంకు, దేనా బ్యాంకులను బ్యాంకు ఆఫ్ బరోడాతో విలీనం చేస్తూ.. కేంద్రకేబినెట్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిం దే. విలీనంతో ఏ ఒక్కరూ ఉద్యోగాలు కోల్పోరని, విలీనం తర్వాత అతి పెద్ద బ్యాంకుగా ఉ దాహర ణకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాగా స్థాయికి చేరుతుందన్నారు. రుణాలు కూడా చౌకగా ఇవ్వవచ్చునని సభకు తెలిపారు.



ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ రికార్డు

• వ్యవసాయ రుణాల్లో మొదటి స్థానం, హౌసింగ్‌లో 4వ స్థానం • సీజీఎం మణి పల్వేశన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అమరావతి సర్కిల్ వ్యవసాయ రుణాల్లో దేశంలోనే మొదటి స్థానంలో, హౌసింగ్ రుణాల్లో నాలుగవ స్థానంలో నిలిచిందని బ్యాంకు సీజీఎం మణి పల్వేశన్ చెప్పారు. బ్యాంకు మొత్తం రుణాల్లో వ్యవసాయానికి 30 శాతం, హౌసింగ్ 40 శాతం మేరకు మంజూరు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా శుక్రవారం మీడియా ప్రతినిధులతో మీట్ టు గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పల్వేశన్ మాట్లాడుతూ, తమ సర్కిల్ రూ.లక్షా 80వేల కోట్ల టర్నోవర్ చేస్తుండగా, ఇందులో రూ.95వేల కోట్ల డిపాజిట్లు సేకరించి రూ.80వేల కోట్ల రుణాలు ఇస్తున్నామని తెలిపారు. 6 శాతం సీడీ నిష్పత్తితో సానుకూల ఫలితాలు సాధిస్తున్నామని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక నగరాల నుంచి హౌసింగ్ రుణాలకు డిమాండ్ పెరుగుతోందని, గత మూడేళ్ళుగా వరుసగా ఎక్కువ రుణాలుఇవ్వడంతో పాటు విజయవాడ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ బ్యాంకు గత మూడేళ్ళుగా 20 శాతం వృద్ధిరేటు నమోదు చేసుకుంటుందని చెప్పారు. వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైనందున ఏపీలో ఈ రంగంలో రుణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, రూ. 25,700 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి మూడు త్రైమాసికాల్లో రూ.3,390 కోట్ల హౌసింగ్ రుణాలు ఇచ్చా మని ఆయన చెప్పారు. మరోవైపు చిన్న, మధ్యతరహా కంపెనీలను ప్రోత్సహించేందుకు కూడా తమ బ్యాంకు ఇతోధికంగా సహాయం అందిస్తోందని చెప్పారు. రాష్ట్రం లో ప్రస్తుతం 1,073 బ్రాంచీలు ఉన్నాయని, వీటిని విస్తరించే యోచనలో ఉన్నామన్నారు.

48పైసలు బలపడిన రూపాయి

• రూపాయి @69.72




ముంబై : భారతీయ కరెన్సీ రూపాయి శుక్రవారం నాడు ఏకంగా 48 పైసలు బలపడి 69.72 వద్ద స్థిరపడింది. స్థానిక స్టాక్ మార్కెట్లు పుంజుకోవడం తో పాటు ఇతర అభివృద్ధి చెందిన మార్కెట్లు కూడా లాభాలతో ట్రేడ్ అవ్వడంతో సెంటిమెంట్ ప్రకారం డాలర్ బలహీనపడింది. వరుసగా రెండు రోజుల పాటు రూపాయి బలహీ న పడి న తర్వాత శుక్రవారం నాడు ఎగుమతి దార్లు, బ్యాంకులు తమ వద్ద ఉన్న డాలర్లను విక్రయించడంతో రూపాయి బలపడిందని ఫారెక్స్ ట్రేడర్లు చెబుతున్నారు. బ్రెంట్‌క్రూడాయిల్ విషయానికి వస్తే 2.14 శాతం పెరిగి 57.15 డాలర్లకు చేరింది.

శుక్రవారం నాడు విదేశీ సంస్థాగత మదుపరులు రూ.157.72 కోట్లు స్టాక్ మార్కెట్ల నుంచి ఉపసంహరించారు. అదే సమయంలో దేశీయ సంస్థాగత మదుపరులు రూ.240.60 కోట్ల షేర్లు కొనుగోలు చేసినట్ల స్టాక్ మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో శుక్రవారం నాడు రూపాయి 69.95 వద్ద ప్రారంభమై తర్వాత మరింత బలపడి 69.66 మార్కుకు దిగివచ్చింది. ఎగుమతిదారులు, పెద్దెత్తున డాలర్లు విక్రయించడతో రూపాయి 48 పైసలు బలపడి 69.72 వద్ద ముగిసింది. కాగా గురువారం నాడు వరుసగా రెండో రోజు 2 పైసలు క్షీణించి 70.20 వద్ద స్థిరపడింది. మొత్తానికి రూపాయి 0.5 శాతం బలపడి డాలర్ మారకంతో 70 కంటే దిగువకు దిగివచ్చింది. రూపాయి బలపడ్డానికి కారణం ఇతర అభివృద్ధిచెందిన మార్కెట్లలో కూడా ఆయా దేశాల కరెన్సీ బలపడ్డమేనని చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఫెడ్ రిజర్వుసమీప భవిష్యత్తులో వడ్డీరేట్లు పెంచే అవకాశాల్లేవని ఫారెక్స్ మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మార్కెట్లకు ఫుల్ జోష్!

• కొనుగోళ్లతో కళకళ • గ్లోబల్ మార్కెట్లు లాభాల్లోనే • సెన్సెక్స్ 181 పాయింట్ల వృద్ధి

ముంబై : స్టాక్ మార్కెట్లు వరుసగా రెండు రోజు ల పాటు నష్టాలను చవిచూసిన తర్వాత శుక్రవారం నాడు లాభాలతో ముగిశాయి. ఇన్వెస్టర్లు ప్రస్తుతం ఆకర్షణీయంగా చౌకధరకు లభిస్తున్న షేర్లను పెద్దెత్తున కొనుగోలు చేయడంతో మార్కె ట్లు తిరిగి కళకళలాడాయి. ఇన్వెస్టర్లు ప్రధానంగా టెలికం, లోహ, బ్యాంకిం గ్ రం గానికి చెందిన షేర్లను పెద్దెత్తున కొను గోలు చేశారు. అమెరికా - చైనాల మధ్య చర్చలు జరుగుతాయన్న వార్త లు మార్కెట్లకు కిక్ ఇచ్చాయి. దీంతో గ్లోబల్ మార్కెట్లో రిలీఫ్ ర్యాలీ ఏర్పడింది. మొత్తానికి ఇంట్రాడేలో 350 పాయిం ట్ల వరకు ర్యాలీ ఏర్పడి చివరి 181.39 పాయిం ట్ల లాభంతో 35,695. 10 వద్ద స్థిరపడింది. నిఫ్టీ విషయానికి వస్తే 55.10 పాయింట్లు లాభపడి 10,727. 35 వద్దముగిసింది. కాగా ఈ వారం మొత్తానికి చూస్తే సెన్సె క్స్ 381.62 పాయింట్లు నిఫ్టీ 132.55 పాయింట్లు నష్టపో యింది. బీఎస్ఈలో అత్యధి కంగా లాభపడిన షేర్ల విషయానికి వస్తే ఎస్ బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టాటామోటార్స్, వెదాంత, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకు షేర్లు 3.05 శాతం వరకు లాభపడ్డాయి. దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లలో హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, హీరోమో టోకార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, సన్‌ఫార్మా షేర్లు 1.55 శాతం వరకు నష్టపోయాయి. మొత్తానికి చూస్తే టెలికం, మెటల్, యుటిలిటి, ఫైనాన్స్ రంగానికి చెందిన షేర్లు రెండు శాతం వరకు లాభప డ్డాయి. ప్రభుత్వరంగానికి చెందిన పీఎన్‌బీ, యూనియన్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ ఇండియా, ఆంధ్రాబ్యాంకు, ఎస్‌బీఐ షేర్లు నాలుగు శాతం వరకు పెరిగాయి.



చైనా అమెరికాతో చర్చలకు సిద్ధం కావడంతో గ్లోబల్ ఇన్వెస్టర్లలో సెంటిమెంట్ మరింత బలపడింది. వచ్చే వారం ప్రారంభంలో అమెరికాకు చెందిన ప్రభుత్వ బృందం చైనాకు వెళ్లి అక్కడి అధికారులతో ముఖాముఖి చర్చలు జరుపు తారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌కు కూడా తాత్కా లికంగా వాణిజ్య యుద్ధానికి తెరదించడా నికి అంగీకరించారని చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో వెల్లడించిం ది. ఇదిలా ఉండగా విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు గురువారం నాడు రూ.972.81 కోట్ల షేర్లు విక్రయిస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.34.52 కోట్ల షేర్లు కొనుగోలు చేసినట్లు బీఎస్ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ వారానికి మార్కెట్ చివరి ట్రేడింగ్ రోజు శుక్రవారం మాత్రం కోలుకోవడంతో ఇన్వెస్టర్లు కాస్తా ఊపరి పీల్చుకున్నారు. పీఎస్‌బీ బ్యాంకు షేర్లు కోలుకున్నాయి.ప్రభుత్వం బ్యాంకు లకు పెద్దమొత్తంలో మూలధ నం సమకూరుస్తా మని ప్రకటించడంతో ఈ షేర్లు అ మాంతం పెరిగిపో యా యి. ఇక గ్లోబల్ మా ర్కెట్ల వి షయానికి వస్తే ఆసియాతో పాటు ఐరోపా మార్కెట్లు లాభాలతో ముగిశాయి.

విదేశీ మారకద్రవ్యం నిల్వలు రూ.393.404 బి.డాలర్లు

• 116.4 మిలియన్ డాలర్లు పెరిగాయి



ముంబై: డిసెంబర్ 28తో ముగిసిన వారాంతానికి రిజర్వుబ్యాంకు వద్ద విదేశీ మారకద్రవ్యం నిల్వలు ఏకంగా 116.4 మిలియన్ డాలర్లు పెరిగి 393.404 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. అంతకు ముందు వారం కూడా ఆర్‌బీఐ వద్ద విదేశీ మారకద్రవ్యం ఆస్తులు 106.3 మిలియన్ డాలర్లు పెరిగి 368.077 బిలియన్ డాలర్లకు చేరాయి. ఆర్‌బీఐ వద్ద విదేశీ మారకద్రవ్యం నిల్వల్లో అమెరికా డాలర్‌తో పాటు యూరో, పౌండ్, జపాన్ కరెన్సీ ఎన్‌లుంటాయి.. ఈ విదేశీ మారకం ఆస్తుల విలువ ఒక్కోసారి పెరగడం, లేదా దాని విలువ తరగడం జరుగుతుంటాయి. గత ఏడాది ఏప్రిల్ 13తో ముగిసిన వారాంతంలో ఆర్‌బీఐ వద్ద రికార్డుస్థాయిలో 426.028 బిలియన్ డాలర్లకు విదేశీమారకద్రవ్యం నిల్వలు చేరాయి. అటు నుంచి క్రమంగా ఈ నిల్వలు తరుగుతూ వచ్చాయి. సుమారు 31 బిలియన్ డాలర్ల నిల్వలు కరిగిపోయాయి. బంగారం నిల్వల విషయానికి వస్తే 21.224 బిలియన్ డాలర్లలో ఎలాంటి మార్పులేదని ఆర్‌బీఐ గణాంకాలు తెలియజేస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి లేదా ఐఎంఎఫ్ వద్ద ప్రత్యేక ఉపసంహరణ హక్కులు 3.6 డాలర్లు పెరిగి 1.462 బిలియన్ డాలర్లకు చేరాయి. అలాగే ఐఎంఎఫ్ వద్ద భారత్ నిల్వల పరిస్థితి మరింత మెరుగుపడింది. డిసెంబర్‌తో ముగిసిన వారంతంలో 6.5 మిలియన్‌డాలర్లు పెరిగి 2.640 బిలియన్ డాలర్లకు చేరాయి.

రేపటి నుంచి కేసీఆర్ విదేశీ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

ఈ నిర్ణయం మేరకు జీఏడీ, ప్రోటోకాల్ అధికారులు పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సీఎంతో పాటు ప్రభుత్వ ముఖ్య సలహాదారు డాక్టర్ రాజీవ్ శర్మ, సీఎంవో ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్‌లు కూడా వెళుతున్నారు. అందుకు అనుమతి ఇస్తూ శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి జీవో జారీచేశారు. కేసీఆర్ బృందంలో పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ దుబాయ్ పర్యటనకు వెళుతున్నందున తాత్కాలికంగా ఆ బాధ్యతలను మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎం. జగదీశ్వర్‌కు అప్పగించారు. అలాగే పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలను ఆర్అండ్‌బి ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మకు అప్పగిస్తూ సీఎస్ జీవో విడుదల చేశారు. సంక్రాంతి పండగ నాటికి సీఎం కేసీఆర్ బృందం తిరిగి హైదరాబాద్ చేరుకోనుంది.

ఫిబ్రవరిలో బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు పూర్తయ్యాకే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలని, ఈలోపు ఆర్థికపరమైన ఇబ్బందులు రాకుండా కొంత ముందస్తుగానే ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆమోదించాలని సర్కార్ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. ఈలోగా మంత్రిమండలి కూర్పు చేసుకుని అసెంబ్లీని సమావేశపర్చాలని సీఎం కేసీఆర్ ఆలోచనగా ఉంది. ఫిబ్రవరి చివర్లో లేదా మార్చి మొదటి వారంలో పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. ఈలోపే మధ్యంతర బడ్జెట్ ఆమోదం తీసుకోవాలని ఆయన యోచిస్తున్నారు. ఇందుకు రెండు మూడు రోజులపాటు అసెంబ్లీని సమావేశపర్చనున్నారు. అప్పుడే ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ల నియామకం పూర్తిచేయనున్నారు. ఫిబ్రవరి 1న కేంద్రం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఆ తర్వాత కేంద్ర సాయంలో స్వల్ప స్పష్టత రానున్నది. ముగుస్తున్న ఆర్థిక సంవత్సరం 2018-19లో కేంద్ర సాయంలో భారీ కోత పడింది. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా రావాల్సిన మొత్తంలో కేవలం 18 శాతమే రాష్ట్రానికి అందింది. సొంత వనరుల రాబడిపెరగడంతో ప్రభుత్వం ఆర్థికపరంగా గట్టెక్కుతోంది. నిధులలోటు లేకుండా రాబడి శాఖలు సర్కార్‌ను ఆదుకుంటున్నాయి. ఆశించిన ఆదాయం సమకూరుతుండటంతో కేంద్ర నిధుల లోటు ఖజానాపై ప్రభావం చూపడంలేదు. వాస్తవానికి మార్చి చివరినాటికి ఖజానాలో భారీగా మిగులు నిధులు ఉంటేనే ప్రారంభనిల్వ ఎక్కువ మొత్తంలో కనిపిస్తుందని ఆర్థికశాఖ ఆ మేరకు చెల్లింపులపై నియంత్రణలు విధించింది. ఖర్చులు, వేతనాలు మినహా మిగతా బిల్లులను నిలిపివేసింది. అత్యవసరాలకు తప్ప ఇతర బిల్లులేవీ ఆర్థికశాఖ క్లియర్ చేయడంలేదు. ఈ నియంత్రణలు మార్చి దాటిన తర్వాత కూడా పూర్తిస్థాయి బడ్జెట్ ఆమోదం వరకు కొనసాగే అవకాశం ఉంది.

ఆదుకున్న సొంత వనరుల రాబడి...

సర్కార్ ఖజానాకు కీలకమైన రాబడి శాఖలు అంచనాలను మించి ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక వనరుల వృద్ధి రేటు 29 శాతాన్ని మించడంతో ప్రభుత్వం పూర్తి సంతృప్తితో ఉంది. నవంబర్ ముగిసేనాటికి జీఎస్టీ 55 శాతం లక్ష్యం చేరి రూ. 34,232 కోట్ల అంచనాలకుగానూ రూ. 18,964 కోట్లకు చేరుకుంది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ 75శాతం లక్ష్యంచేరి ఇప్పటికే రూ.3,557కోట్లను ఆర్జించింది. అమ్మకం పన్ను రూపంలో రూ. 12,264 కోట్లు, ఎక్సైజ్ డ్యూటీలు రూ. 6,643 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా రూ. 8,510కోట్లు, పన్నేతర రాబడులు రూ. 2,993కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఆదాయం రూ. 5.376కోట్లుగా నమోదైంది.



పంచాయతీలో పొగాకు కాసుల రాశులు!

(మొదటిపేజీ తరువాయి)

అమన్‌గల్, కడ్తాల్ మండలాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్, భువనగిరి, ఆలేరు తదితర ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీలు, మేడ్చల్ జిల్లాలోని కీసర, ఘట్‌కేసర్, మేడ్చల్ ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవుల కోసం పోటాపోటీగా నిధులను ఖర్చు చేసేందుకు ఆయా పార్టీల నేతలు, స్వచ్ఛందంగా కొందరు యువతీ యువకులు ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

హైదరాబాద్ శివారులోనూ అంతే..

హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో భూముల ధరలకు విపరీతమైన డిమాండ్ రావడంతో చాలామంది రైతులు ఇప్పటికే తమ భూములను అమ్ముకుని వచ్చిన మొత్తంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. పదేళ్ళ క్రితం శంషాబాద్ గ్రామ పంచాయతీకి జరిగిన ఎన్నికల్లో సర్పంచ్‌గా బరిలోకి దిగిన గణేష్ గుప్తా అప్పట్లోనే రూ.2 కోట్లను ఖర్చు చేసినట్టు ప్రచారం జరిగింది. అప్పుడు రూ.2 కోట్లంటేనే పెద్దఎత్తున చర్చకు దారితీసిన పరిస్థితులు. చిన్న చిన్న గ్రామ పంచాయతీల్లోనూ సర్పంచ్ పదవి కోసం పోటీ తీవ్రంగా ఉండడంతో ఒక్కో ఓటును మూడు నుంచి ఐదువేల రూపాయలకు కొనుగోలు చేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో నగదు ఏరులై పారిందన్న వార్తలు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. అందుకు భిన్నంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ అభ్యర్థులు కోట్లకు కోట్లు ఖర్చుపెట్టి తమ సత్తా చాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. సగటున వెయ్యి ఓట్లు కూడా లేని గ్రామ పంచాయతీల్లో రూ.కోటికిపైగా ఖర్చు పెట్టడానికి అభ్యర్థులు సిద్ధమవుతున్నారని ఇది తెలిసి ప్రత్యర్థులు కూడా అంతకన్నా ఎక్కువగా పెద్ద మొత్తంలో నగదును ఖర్చుపెట్టి ఎలాగైనా సరే సర్పంచ్ పదవిని చేజిక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. పంచాయతీ ఎన్నికల్లోనూ కోట్లాది రూపాయలు గుమ్మరిస్తున్నారంటే అంత ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందనే అంశంపై ఆసక్తి, ఉత్కంఠ నెలకొని ఉంది.

రాజకీయ జోక్యం ఎక్కువే

గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీరహితంగా జరుగుతున్నప్పటికీ ప్రధాన రాజకీయ పక్షాలైన తెరాస, కాంగ్రెస్, భాజపా, తెదేపా బలపరిచిన పార్టీల అభ్యర్థులే ఈ ఎన్నికల బరిలోకి దిగుతున్నారని సమాచారం. సర్పంచ్ పదవి ద్వారా రాజకీయ రంగప్రవేశం చేసి దశల వారీగా ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి, ఎంపీ వంటి పదవులను అధిష్టించవచ్చన్న ఆలోచనతో గ్రామీణ యువత ఉంటున్నట్టు సమాచారం. హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పరచుకుని వాణిజ్యం, వ్యాపారాలు, పరిశ్రమలు, ఇతరత్రా ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉచ్చుకతతో ఉన్నట్టు తెలుస్తోంది. తమ గ్రామంలో పోటీ చేయడం ద్వారా సత్తా చాటడంతో పాటు గ్రామాల అభివృద్ధి కృషి చేయాలన్న సంకల్పంతో ఎన్నికల బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నట్టు అభ్యర్థులు ప్రచారం చేసుకుంటున్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం మాట అటుంచితే పంచాయతీ ఎన్నికల్లో పల్లెలు పూర్తిగా వ్యాపారమయం అయ్యాయన్న ప్రచారం వినిపిస్తోంది.

పల్లెల్లో ప్రచార హోరు

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలవడక ముందునుంచే గ్రామీణ ప్రాంతాల్లో యువతీ యువకులు ఎన్నికల కోసం సంసిద్ధులయ్యారని ఎన్నికల తేదీలు ప్రకటించడంతో చాలా గ్రామాల్లో అప్పుడే అసెంబ్లీ ఎన్నికల సీన్ కనిపిస్తోందని చెబుతున్నారు. కొంతమంది సర్పంచ్ అభ్యర్థులు ఇళ్ళిళ్ళు తిరుగుతూ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరుతుంటే, మరికొంత మంది రాత్రివేళల్లో తమకు అనుకూలమైన వారిని పిలిపించి సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో ఆయా సామాజికవర్గాల పాత్ర కీలకంగా మారింది. ఒక సామాజికవర్గానికి చెందిన వారు సర్పంచ్‌గా బరిలోకి దిగితే ఆ సామాజికవర్గాన్ని వ్యతిరేకిస్తున్న వారంతా కలిసి మరో అభ్యర్థిని పోటీకి పెట్టడం విచిత్రంగా ఉంది. ఒకే కుటుంబంలో వారు కూడా సర్పంచ్ పదవిని చేజిక్కించుకునేందుకు పోటీ పడడం కూడా పల్లెల్లో కనిపిస్తోంది.

ముందస్తు ఏర్పాట్లు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల్లో పోటీకి అప్పుడే అభ్యర్థులు డబ్బులను సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం. కోట్లకు కోట్లు ఖర్చుపెట్టి ఎన్నికల బరిలోకి దిగేందుకు వారంతా సిద్ధమవుతున్నారు. ఈ మండలంలోని వొద్యాల గ్రామ జనాభా 1100 మాత్రమే. ఇందులో 900 మంది ఓటర్లు. 800 ఓట్లు పోలవుతాయి. ఇక్కడ అభ్యర్థులు పెడుతున్న ఖర్చు కోటికిపైగానే. ఒక్కో ఓటుకు ఎంత ఖర్చు పెడుతున్నారో మనం లెక్కేసుకోవచ్చు. ఇదే మండలానికి చెందిన సర్వేరెడ్డిపల్లి గ్రామంలో 800 జనాభా ఉండగా, ఐదు వార్డుల్లో 750 మంది ఓటర్లు ఉన్నారు. ఇలా అనేక గ్రామ పంచాయతీల్లో వెయ్యిలోపే జనాభా ఉండి అంతకన్నా తక్కువగా ఓటర్లు ఉన్నారు.

తెర వెనుక మైనింగ్ మాఫియా

చాలా గ్రామాల్లో గ్రానైట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ వ్యాపారం ఇక్కడి ప్రజలకు కాసులు కురిపిస్తున్నాయి. గ్రానైట్ రాయిని కొల్లగొట్టాలంటే మైనింగ్ శాఖ అనుమతి తప్పనిసరి. ఈ శాఖ అనుమతి ఇచ్చినా గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా ఏదీ చేయలేని పరిస్థితి. గ్రానైట్ మాఫియా రాజకీయ వ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకుని ఈ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా నిర్వహిస్తోంది. గ్రానైట్ వ్యాపారుల అక్రమాలు బయటకు వస్తాయన్న భయంతో స్థానికంగా ఉన్న సర్పంచ్‌లను, వార్డు సభ్యులను వారు గుప్పిట్లో ఉంచుకునే అలవాటు ఉంది. గ్రానైట్ వ్యాపారులంతా ఒక కూటమిగా ఏర్పడి సర్పంచ్ అభ్యర్థులను పోటీకి పెడుతున్నారని అందుకయ్యే ఎన్నికల ఖర్చును కూడా వారే భరిస్తున్నారని సమాచారం. ప్రత్యర్థి వర్గాన్ని దెబ్బ తీసేందుకు గ్రానైట్ మాఫియా కోట్లకు కోట్లు ఖర్చుచేసి ఓట్లను కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం. ఎన్నికలకు ముందు వారం రోజులపాటు ఓటర్లు ఆడిందే ఆట పాడిందే పాటగా గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. గ్రానైట్ వ్యాపారులు సివరేజ్ సెస్ పేరుతో గ్రామ పంచాయితీకి ఏటా రూ.10 కోట్లు చెల్లిస్తున్నారని అయినా వారికి అనుకూలంగా ఉన్న వారిని సర్పంచ్ పదవిలో కూర్చోబెడితే తమ అక్రమ వ్యాపారానికి ఎవరూ అడ్డు రారన్న భావనతో ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులను ఖర్చు చేసేందుకు ఈ మాఫియా సిద్ధమైందని చెబుతున్నారు. హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న గ్రామ పంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులకు గుత్తేదారులు, స్థిరాస్తి వ్యాపారులు ఎన్నికల ఖర్చును భరిస్తుండగా, గ్రానైట్ నిక్షేపాలున్న ప్రాంతాల్లో ఆ వ్యాపారులు ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెడుతున్నారని తెలుస్తోంది. ఇక ఇసుక ర్యాంపులున్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, మంథని, గద్వాల, కొల్లాపూర్ వంటి నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ వ్యాపారులు గ్రామ పంచాయితీ ఎన్నికల్లో విచ్చలవిడిగా తమ అభ్యర్థుల విజయానికి డబ్బులు ఖర్చు చేస్తున్నారని సమాచారం.

పోకిరీల ఆటకట్టు

- ఇటు కేసులు.. అటు షీటీమ్స్ కౌన్సెలింగ్‌తో మహిళలపై వేధింపులు తగ్గుముఖం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : షీ టీమ్స్ ప్రారంభమైన 2014 నుంచి నేటి వరకు మొత్తంగా వివిధ సెక్షన్స్, నిర్భయ్య యాక్ట్‌తో కలుపి మొత్తంగా 1655 మంది ఈవ్‌టీజర్స్‌పై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్ అండ్ ఉమెన్ సేఫ్టీ) స్వాతిలక్రా వెల్లడించారు. మహిళల రక్షణ నిమిత్తం అక్టోబర్ 24,2014న షీటీమ్స్ ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 1, 2015 నుంచి తెలంగాణలోని అన్ని జిల్లాల్లో షీటీమ్స్ పని ప్రారంభించాయి. మహిళలపై అఘాయిత్యాలకు తొలి మెట్టుగా భావించే ఈవ్‌టీజింగ్‌ని అరికట్టకలిగితే మొత్తంగా మహిళలపై జరిగే నేరాలకు అడ్డుకట్ట పడగలదన్న సదుద్దేశంతో షీటీమ్స్ నాటి నుంచి నేటి వరకు సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించాయి. ఒక్కో షీటీమ్‌లో ఒక హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుల్‌తో పాటు ఒక మహిళా కానిస్టేబుల్ సభ్యులుగా ఉంటారు. వీరంతా మఫ్టీలో ఉంటూ బస్టాపుల్లో, షాపింగ్ మాల్స్‌లో, బహిరంగ ప్రదేశాల్లో మహిళలను వేధింపులకు గురిచేస్తున్న సందర్భంలో విత్ ఎవిడెన్స్‌తో ఈ టీమ్‌లో సదరు పోకిరీలను అదుపులోకి తీసుకుంటాయి. పట్టుబడిన వారిలో మైనర్లయితే వారికి నిపుణులైన వారితో కౌన్సి లింగ్ నిర్వహించారు. కాగా, మొత్తం 1665 ఎఫ్ఐఆర్‌లు రిజిష్టర్డ్‌వ్వగా వాటిలో 320 ఎఫ్ఐఆర్‌లలో నిర్భయ యాక్ట్, 104 అండర్ పోస్కోయాక్ట్ కింద రిజిష్టర్డయ్యాయి. పట్టుబడిన పోకిరీలపై 3,876 పెట్టీ కేసులు నమోదయ్యాయి. 10,644 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి మానిటరింగ్ చేశారు. అదే విధంగా 4008 మందికి ఇలాంటి ఘటనలను భవిష్యత్తులో చేయవద్దని హెచ్చరించి వదిలేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 7,354 అవగాహన కార్యక్రమాలను షీటీమ్స్ నిర్వహించాయి. దాదాపుగా 90 శాతం మంది ప్రజలకు షీ టీమ్స్ చేరువ అయ్యిందనే చెప్పవచ్చు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం పెద్ద పీట వేసి అందుకు అనుగుణంగా కార్యాచరణను రూపొందించాలన్న క్రమంలో ఈ షీటీమ్స్ ప్రతిపాదన వచ్చింది. ప్రభుత్వం కూడా ఈ షీటీమ్స్ ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే తొలుత ఈ షీటీమ్స్ ప్రయోగం సక్సెస్ అవుతుందా? లేదా? అన్న మీమాంస తొలి నాళ్లలో ఉండేది. వాటన్నింటిని పటాపంచలు చేస్తూ షీటీమ్స్ ప్రజల్లోకి చొచ్చుకెళ్లింది. ఈ విధంగా తొలుత హైదరాబాద్‌లో వంద షీ టీమ్స్‌తో ప్రారంభమైన షీ టీమ్‌లు ఆ తర్వాత సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 60 షీటీమ్‌లతో ప్రారంభమవ్వగా, అనతి కాలంలో రాచకొండ కమిషనరేట్ ఏర్పడిన తర్వాత ఇరు కమిషనరేట్లలో సమానస్థాయిలో షీటీమ్స్ పనిచేశాయి. అనంతర కాలంలో షీ టీమ్స్ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించి ప్రజాదరణను పొందా యి. మహిళలపై వేధింపులు తగ్గుముఖం పట్టాయి. రాష్ట్రంలో సక్సెస్ సాధించిన షీటీమ్స్‌ను దేశంలోని పలు ఇతర రాష్ట్రాల్లో వివిధ పేర్లతో పోకిరీల భరతం పడుతున్నాయి.

శబ్ద విప్లవానికి ఉత్తమ్ గూబ పగిలింది

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో ఇప్పటికీ తేరుకోలేకపోతోందని చెప్పారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య గురువారం మీడియాతో మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలు మళ్ళీ జరిపించాలని కోరడం విడ్డూరంగా ఉందని, కాంగ్రెస్ పార్టీ నేతల మాటలు చూస్తుంటే నవ్వాలా.. ఏడువాలో తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. ఒకాయన ఈవీఎంలు పని చేయడం లేదని అంటాడని, మరో కాంగ్రెస్ నేత ఎన్నికలు మళ్ళీ పెట్టాలని డిమాండ్ చేస్తారని ఈ పార్టీ నేతల పరిస్థితి చూస్తుంటే వారి బుర్రలే పని చేయడం లేదనిపిస్తోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు గుద్దిన గుద్దుడుకు, రాష్ట్రం ప్రజలు ఇచ్చిన తీర్పుకు కాంగ్రెస్ నేతల దిమ్మ తిరిగి మైండ్ బ్లాంకైందని చెప్పారు. ఎన్నికల ఫలితాలతో ఆ పార్టీ నేతల కళ్ళు బైర్లు కమ్మి అర్థంకాని పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు ప్రతికూలంగా రావడంతో ప్రపంచం మొత్తం తలకిందులైనట్టు ఆ పార్టీ నేతలు భావిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రచార సభల్లో మాట్లాడుతూ రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం ఉందని చేసిన ప్రకటనపై స్పందించిన కేటీఆర్ ఉన్నది నిశ్శబ్ద విప్లవం కాదని శబ్ద విప్లవం ఉందని ఎన్నికల సమయంలోనే తాను చెప్పానని గుర్తుచేశారు. ప్రజల తీర్పుతో ఉత్తమ్ కుమార్ గూబగుయ్యిమందని చెప్పారు. శబ్ద విప్లవం ఉందని తాను ప్రకటించిన విధంగానే ప్రజలు కాంగ్రెస్ పార్టీని గుంజి కొడితే ఈ రోజు వరకు లేవలేదని ఎక్కడోళ్ళక్కడ బేజారైపోయారని చెప్పారు.

ఫలితాలు రాకముందే మంత్రి పదవులపై కాంగ్రెస్ కలలు

కాంగ్రెస్‌లో కొంతమంది నేతలు ఎన్నికల ఫలితాలు రాకముందే ముఖ్యమంత్రులైపోయామని కలలు కన్నారని కొందరైతే ఏకంగా కొత్త వాస్కోట్‌లు కుట్టించుకున్నారని మరి కొందరు కొత్త పైజామాలు, లాల్చీలు కొనుగోలు చేశారని ఎద్దేవా చేశారు. ఫలితాలకన్నా ముందే మంత్రిత్వ శాఖలు ఎవరికేంటో పంపకాలు కూడా చేసుకున్నారని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవులు నాకంటే నాకంటూ కాంగ్రెస్ సీనియర్లు వాదులాటకు కూడా దిగారని చెప్పారు. ముఖ్యమంత్రి ఎవరన్నది నిర్ణయించేది రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు కాదని ఢిల్లీలో ఆ నిర్ణయం జరుగుతుందని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి, హోంమంత్రి వంటి పదవులను కూడా కాంగ్రెస్ నేతలు ముందే పంచుకున్నారని చెప్పారు. ఎన్నికలై ఫలితాలు రాకన్నా ముందే ప్రజాకూటమి నేతలు డిసెంబర్ 10న రాజ్‌భవన్‌కు ఉరికి వెళ్ళారని గవర్నర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు అతిపెద్ద పార్టీని ముందు పిలవాలని ఎన్నికలకు ముందే భాగస్వామ్య పక్షాలన్నీ పోటీకి దిగామని గవర్నర్‌కు చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. తెరాసకు 40, 45 సీట్లొస్తే ప్రభుత్వం ఏర్పాటుకు ఆ పార్టీని ముందు పిలవకుండా తమను అతిపెద్ద పార్టీగా గుర్తించి ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని గవర్నర్‌కు మొర పెట్టుకున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు.

నల్లగొండ నేతలకు బుద్ధి చెప్పారు

పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కు చాలా అహంకారం ఉందని, జానారెడ్డి, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏనాడూ జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరు కాలేదని విమర్శించారు.



తెలంగాణ భవన్‌లో విజ్ఞాపనలు స్వీకరిస్తున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వచ్చే ఎన్నికల్లో తెరాసను గెలిపించుకునేందుకు బూత్ స్థాయి నుంచి పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ చరిత్ర తిరగ రాయాలని కోరారు. గెలుపు కోసం పటిష్ట ప్రణాళిక రూపొందించి ముందుకు సాగాలని చెప్పారు. నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్లు ఓటమిని చవిచూశారని నాగార్జున సాగర్‌లో జానారెడ్డి పరాజయం పాలయ్యారని పేర్కొన్నారు. ఈ జిల్లాలో 12కు 12 స్థానాలు తెరాస కైవసం చేసుకుంటోందని మాజీ జగదీష్‌రెడ్డి ఎప్పటినుంచో తనకు చెబుతూ వచ్చారని ఆయన అన్నట్టే జరిగిందన్నారు. గత ఎన్నికల్లో ఈ జిల్లాలో తెరాసకు ఆరు సీట్లు ఉండేవని ఉద్యమం నుంచి ఈ జిల్లాలో తెరాస నేతలు కష్టపడి పనిచేయడంవల్లే ఇటీవల ఎన్నికల్లో మహామహులు మట్టి కరిచారని హుజూర్‌నగర్‌లో ట్రక్కు గుర్తు వల్ల ఉత్తమ్ గెలిచారని చెప్పారు.

అందరూ ఏకమైనా కేసీఆర్ వెంటే జనం

ఐదుగురు వివిధ రాష్ట్రాలకు చెందిన మంత్రులు, పదకొండు కేంద్ర మంత్రులు, ప్రధాని నరేంద్రమోడీ, భాజపా చీఫ్ అమిత్ షా, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా, ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్, ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణలో ప్రచారం చేసినా ప్రజలు తెరాసకు బ్రహ్మరథం పట్టి బ్రహ్మాండంగా ఆదరించారని చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన రూ.500 కోట్లకు ఆశపడి కాంగ్రెస్ తెదేపాకు దాసోహమైందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించిన తెరాసను, కేసీఆర్‌ను అక్కున చేర్చుకున్నారని చెప్పారు. భాజపా వంద అసెంబ్లీ సీట్లలో ధరావత్ కోల్పోయిందని సింహం సింగిల్‌గా వస్తుందన్నట్టు కేసీఆర్ సింగిల్‌గా వచ్చి గెలిచారని ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ నేతలు బుర్రలు పాడయ్యాయని చెప్పారు. ఓటర్లు ఇచ్చిన తీర్పుకు కాంగ్రెస్ నేతలు కొంత మంది రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకున్నారని మరికొంత మంది మీడియాకు దూరమయ్యారని ఆ పార్టీ ఇప్పట్లో లేచే పరిస్థితి లేదని చెప్పారు. ట్రక్కు గుర్తుతో కలిపి తెరాసకు 50 శాతం ఓట్లు వచ్చాయని పేర్కొన్నారు.

పది ఇళ్లకు ఓ కార్యకర్త ఇన్‌ఛార్జ్

సిరిసిల్లలో పటిష్టమైన బూత్ కమిటీ ఏర్పాటువల్లే తాను అత్యధిక మెజారిటీ సాధించగలిగానని వచ్చే ఎన్నికల కోసం బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేయాలని పది ఇండ్లకు ఒక కార్యకర్తలను నియమించి వందమంది కార్యకర్తలు ఉండేలా చూడాలని చెప్పారు. పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీచేసే పరిస్థితి లేదని ఈ ఎన్నికల్లో తెరాస కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి వీలైన గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. 3,400లకుపైగా తండాలను గ్రామ పంచాయితీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దని తాండాల్లో చాలాచోట్ల ఎన్నికలు ఏకగ్రీవమయ్యే పరిస్థితి ఉందని తెరాసను పటిష్టం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించాలని చెప్పారు.

చొప్పదండి అల్లుడిని... అభివృద్ధి చేస్తా

కేసీఆర్ చొప్పదండి అల్లుడని, అన్ని విధాలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని భరోసా ఇచ్చారు. అధికారం వచ్చిందనే గర్వం కార్యకర్తలకు పనికి రాదని ప్రజలతో మమేకం కావాలని కోరారు. తెలంగాణ ప్రజలు చంద్రబాబును తరిమికొడితే ఆయనను కాంగ్రెస్ పార్టీ మళ్ళీ తీసుకు వచ్చిందని మండిపడ్డారు. చంద్రబాబు ఇచ్చిన రూ.500 కోట్లతో కాంగ్రెస్ కుట్రలు చేసిందని కాంగ్రెస్ నేతలు అమరావతికి గులామ్‌లుగా మారినా తెలంగాణ ప్రజలు మాత్రం తమ ఆత్మగౌరవాన్ని చాటుకున్నారని చెప్పారు. 2014లో తెరాస 63 సీట్లు గెలిస్తే ఈ ఎన్నికల్లో 88 సీట్లు సాధించిందని 47 శాతం ఓట్లతో 75 శాతం సీట్లు సాధించామని చెప్పారు. పంచాయితీ ఎన్నికల్లో తెరాస అత్యధిక పంచాయితీలు కైవసం చేసుకునేలా పని చేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్, ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



- అటాచ్‌మెంట్ కోసం కోర్టుకు వెళ్లిన ఐటీశాఖ
- అతడి ఆస్తుల విలువ రూ.1200 కోట్లు
- నయీం బాధితుల్లో చిగురిస్తున్న ఆశలు

నయీం ఆస్తుల స్వాధీనానికి రంగం సిద్ధం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్యాంగ్‌స్టర్ నయీం ఆస్తులు బినామీ పేర్ల మీద ఉన్నాయని గుర్తించి ఆ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఐటీ శాఖ రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు కోర్టులో ఆదాయపు పన్ను శాఖ పిటిషన్ దాఖలు చేసింది. పీపుల్స్‌వార్‌తో విభేధించి ఆనక పోలీస్ కోవర్టుగా మారిన నయీం కొందరు పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టుల సహకారంతో అనతి కాలంలో గ్యాంగ్‌స్టర్ నయీంగా అవతరించాడు. రంగారెడ్డి, నల్గొండ, భువనగిరి తదితర ప్రాంతాల్లో భూకబ్జాలు, సెటిల్మెంట్లు కొనసాగించాడు. హైదరాబాద్‌కు చెందిన కొందరు యువతను తన అనుచరులుగా చేసుకుని నయీం ఈ దందా నిర్వహించాడు. మాజీ మావోయిస్టులను సైతం తన అనుచరులుగా చేర్చుకున్నాడు. తనకు ఎదురొచ్చిన వారిని సహించేవాడు కాదు. ఆఖరికి బంధువు అయినా సరే హత్య చేశాడు. ప్రజా గాయకురాలు బెల్లి లలిత హత్యోదంతం గ్యాంగ్‌స్టర్ నయీం క్రూరత్వానికి పరాకాష్ట. నయీం ఈ విధంగా అంతమొందించిన వారి సంఖ్య 25కు పైనేనని దర్యాప్తు సంస్థలే పేర్కొనడం గమనార్హం. గోవా, తదితర రాష్ట్రాలకు వెళ్లి మరీ నయీం సెటిల్‌మెంట్లు కొనసాగించేవాడని, ఎన్ఆర్ఐలను సైతం బెదిరించిన నయీం ప్రపంచ వ్యాప్తంగా తన దందాను విస్తరించాడనే చెప్పవచ్చు. ఈ విధంగా గ్యాంగ్‌స్టర్ నయీం వేలాది కోట్ల రూపాయలు అక్రమార్జనకు పాల్పడ్డారన్న ప్రచారం జరిగింది. ఆ సంఖ్య దాదాపుగా పదివేల కోట్ల పైమాటేనని తెలుస్తోంది. అమ్మాయిల అక్రమ రవాణా, ఆయుధాల రవాణాకు నయీం పాల్పడ్డాడన్న వార్తలు వెలువడ్డాయి. ఐపీఎస్ అధికారి వ్యాస్, ఏపీసీఎల్‌సీ నేత పురుషోత్తంలను హత్య చేసిన కేసులలో నయీం అరెస్టయ్యాడు. 2007లో కోర్టు కేసుకు హాజరై తిరిగి వస్తుండగా తప్పించుకున్న నయీం ఆ తర్వాత నుంచి చెలరేగిపోయాడు. ఎంతలా అంటే ఏకంగా సబ్ రిజిస్ట్రార్‌లనే తన ఇంటి వద్దకు పిలిపించుకుని మరీ సంతకాలు చేయించేవాడు. తన వద్ద పనిచేసే బాలికలను అంగ రక్షకులుగా వినియోగించుకోవడమే కాదు.. తన శృంగార కార్యకలాపాలకు సైతం ఆ బాలికలను వినియోగించుకునేవాడు. ఇందుకు నిరాకరించిన బాలికలకు పచ్చిమిర్చి రసం తాగించి మరీ పైశాచికానందం పొందేవాడు గ్యాంగ్‌స్టర్ నయీం. ఈ విధంగా నయీం చరిత్ర అంతా రక్తచరిత్రే. ఒక రకంగా చెప్పాలంటే ఆల్‌ఇండియా నెం.1 క్రిమినల్‌గా గ్యాంగ్‌స్టర్ నయీంనేనని చెప్పవచ్చు. పోలీసుల కళ్లుగప్పి తిరిగేందుకు చివరికి ఆడవేషాలు సైతం నయీం వేసిన సందర్భాలున్నాయి. ఈ విధంగా ప్రతి అంశంలోనూ ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతూ తాను గ్యాంగ్‌స్టర్ నయీం గా అవతరించడానికి సహకరించిన కొందరు పోలీసు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతి నిధులు, జర్నలిస్టులకు భారీ మొత్తంలోనే నజరానాలను సైతం సమర్పించినట్లు వార్తలు వెలువడ్డాయి.

అయితే తనకు శత్రువులుగా ఉన్న వారిని సైతం పని కొస్తాడంటే జట్టులో చేర్చుకుని ప్రోత్సహించేవాడు గ్యాంగ్‌స్టర్ నయీం అని చెబు తుంటారు. తాను చేసిన ప్రతి పనితో పాటు తనతో సహకరించిన పెద్దలు తనను కలిసిన సందర్భాల్లోనూ ఇతరత్రా సమయాల్లోనూ ఆ వివరాలను నయీం డైరీలు, ఫోటోగ్రాఫ్‌ల ద్వారా భద్రపర్చేవాడని, నయీం హతుడైన తర్వాత దర్యాప్తులో నయీం డెన్‌లను పరిశీలించిన పోలీసులకు కోట్లాది డబ్బు, ఆయుధాలతో పాటు కొన్ని డైరీలు, ఫోటోలు సైతం బయటపడ్డాయన్న ప్రచారం జరిగింది. ఇందుకు సంబంధించి నయీంకు సంబంధించిన అన్ని వివరాలతో కూడిన ఓ డైరీని పోలీసులు స్వాధీ నప ర్చుకున్నట్లు సైతం వార్తలు వెలువడ్డాయి. అయితే ఆ డైరీ ఇంత వరకూ పోలీసులు బయ టపెట్టకపోవడం గమనార్హం. షాద్‌నగర్‌లో 2016 ఆగస్టు 9వ తేదీన పోలీసు ఎన్‌కౌంటర్‌లో నయీం హతుడయ్యాడు.

అదే సందర్భంలో నయీం తర్వాత నయీం గ్యాంగ్‌ను సమర్థవంతంగా నడిపే సామర్థ్యమున్న అతడి అనుచరుడు శేషన్నతో సహా మరో నలుగురు పరారయ్యారు. వారి ఆచూకీని పోలీసులు ఇప్పటికీ గుర్తించకపోవడం గమనార్హం. నయీం కేసును విచారించిన సిట్ ఈ విషయమై ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. మరోవైపు నయీంకు చెందిన ఆస్తులు మార్కెట్ విలువ ప్రకారంగా సుమారు రూ.1200 కోట్లు ఉంటాయని ఐటీ శాఖ అంచనా వేసింది. ఆ ఆస్తులన్నీ బినామీ పేర్లపైనే ఉన్నాయని గుర్తించిన ఆదాయపు పన్ను అధికారులు ఆ ఆస్తులను అటాచ్ చేసేందుకు కోర్టులో పిటిషన్ దఖలు పర్చింది. దీంతో వేలాది మంది నయీం బాధితులు తమకు ఇప్పటికైనా న్యాయం జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తపరుస్తున్నారు. కాగా, ఇప్పటికే నయీం ఆస్తులపై ఈడీ కేసు నమోదు చేసింది.

విడిచిపెడితే విధ్వంసమే

- అమెరికా బాంబు కంటే తక్కువ బరువు
- సులువుగా తీసుకెళ్లి ప్రయోగించగల సత్తా
- వీడియో విడుదల చేసిన చైనా రక్షణ శాఖ



బీజింగ్: అన్నింటికంటే అతి శక్తివంతమైన బాంబును చైనా తయారు చేసింది. అమెరికా తయారు చేసిన దానికంటే ఇది ఎన్నో రెట్లు ప్రమాదకరమైన న్యూక్లియర్ రహిత బాంబు అని చైనా తన రిపోర్టులో తెలియజేసింది. చైనా రక్షణ పరిశ్రమ శాఖ దిగ్గజం నోరింకో మొదటి సారిగా ఆ ఏరియల్ బాంబును ప్రదర్శించిందని, ఇదే దేశం యొక్క శక్తివంతమైన నాన్ న్యూక్లియర్ బాంబు అని స్థానిక పత్రిక గ్లోబల్ టైమ్స్ చెప్పుకొచ్చింది. మదర్ ఆఫ్ ఆల్ బాంబ్ అని పిలబడే ఇది, న్యూక్లియర్ ఆయుధం తరువాతి స్థానంలో ఉంటుందని, ఈ బాంబు ఎంతో విధ్వంసాన్ని సృష్టించగలదని గ్లోబల్ టైమ్స్ వివరించింది. హెచ్-6 బాంబును ఏయిర్ డ్రాప్ ద్వారా ప్రదర్శించడం జరిగింది. దీనికి సంబంధించిన ఓ వీడియోను డిసెంబర్ చివర్లో చైనా నార్త్ ఇండస్ట్రీస్ గ్రూప్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఓఆర్ఐఎన్‌సీఓ) తన వెబ్‌సైట్‌లో ఉంచింది. ఎంతో విధ్వంసం సృష్టించే ఈ బాంబును ప్రజలకు చూపించడం ఇదే మొదటి సారి అని జిన్హువా న్యూస్ ఏజెన్సీ చెప్పుకొచ్చింది.

గతేడాది ఆఫ్ఘనిస్తాన్‌లో మిలిటెంట్లు ఉన్నారనే కారణంగా వారిపై అమెరికా మిలటరీ దళాలు జీబీయూ-43/బీ మ్యాసివ్ ఆర్డనెన్స్ ఏయిర్ బ్లాస్ట్ (ఎంఓఏబీ) ఆయుధాన్ని ప్రయోగించింది. ఇదే అత్యంత శక్తి శాలి అని అనుకున్నారు. కానీ దీనికంటే ఎన్నో రెట్లు విధ్వంసం సృష్టించే బాంబును చైనా తయారు చేసుకుంది. చైనా కూడా ఈ బాంబుకు మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ అని నిక్‌నేమ్ పెట్టింది. ఇది కొన్ని టన్నుల బరువు ఉంటుందని, అమెరికా బాంబు కంటే చిన్నగా, తక్కువ బరువును కలిగి ఉంటుందని చైనా పత్రికలు చెప్పుకొచ్చాయి. వీడియోలో హెచ్-6కే బాంబును గమనిస్తే.. ఐదు నుంచి ఆరు మీటర్ల పొడవు ఉంటుందని మిలటరీ విశ్లేషకుడు వెయి డోంగుక్సు గ్లోబల్ టైమ్స్‌కు వివరించాడు. భూతలంపై ఉన్న లక్ష్యాన్ని సులువుగా ఎంచుకుని ప్రయోగించొచ్చని, బహుళ అంతస్తుల భవనాలు, బురుజులు, రక్షణ స్థావరాలను నామరూపాల్లేకుండా చేసే సత్తా దీనికి ఉందన్నారు. ఎంచుకున్న లక్ష్యం దట్టమైన అటవీ ప్రాంతం అయి ఉంటే, బాంబును హెలీకాప్టర్ ద్వారా ఆర్మీ కోసం సులువుగా కిందికి అందజేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అమెరికా తయారు చేసిన బాంబు పరిమాణంలో చాలా పెద్దదిగా ఉంటుందని, దాన్ని తీసుకెళ్లాలంటే అతిపెద్ద విమానాలు అవసరం ఉంటాయని వివరించాడు. కానీ చైనా తయారు చేసిన బాంబును మాత్రం సులువుగా తీసుకెళ్లి లక్ష్యాన్ని మట్టుబెట్టొచ్చని డోంగుక్సు తెలిపాడు. రవాణాను దృష్టిలో పెట్టుకుని డిజైనర్‌లు బాంబును తయారు చేయడం జరిగిందన్నారు. అమెరికా మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ అని ప్రకటించిన తరువాత రష్యా తానేం తక్కువ కాదన్నట్టు ఫాదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్‌ను తయారు చేసింది. ఇది ఓ అగ్నిగోళంలా ఉండి రెండింటికంటే పరిమాణంలో పెద్దదిగా ఉంటుందని, దీని తయారీకి గ్యాస్‌ను ఉపయోగించడం జరిగిందని నివేదికలో వెల్లడైంది. ఎన్ఓఆర్ఐఎన్‌సీఓ ప్రతినిధి మాట్లాడుతూ.. వీడియోలో చూపించిన బాంబు థర్మోబారిక్ కాదని, మరిన్ని విషయాలు వెల్లడించలేమని గ్లోబల్ టైమ్స్‌కు వివరించాడు.

అద్భుతం.. మహాద్భుతం...

- రాష్ట్ర జైళ్ల శాఖ పనితీరుపై గుజరాత్ కితాబు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ జైళ్లశాఖలో అమలవుతున్న సంస్కరణలు భేష్ అని గుజరాత్ జైళ్ల శాఖ అధికారులు కితాబిచ్చారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ కేంద్ర కారాగారాన్ని గుజరాత్ హోం డిపార్టుమెంట్ డిప్యూటీ సెక్రటరీ మహేంద్రకుమార్ రతిలాల్ సోని, గుజరాత్ రాజ్‌కోట్ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ధర్మేంద్రశర్మ, గుజరాత్ భవ్‌నగర్ జైలు డిప్యూటీ సూపరింటిండెంట్ జీ.ఆర్.తరల్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారిని చంచల్‌గూడ సెంట్రల్ ప్రిజన్ సూపరింటెండెంట్ కె.అర్జునరావు సాదరంగా ఆహ్వానించారు. విజిటర్స్ లాంజ్, ఖైదీలుండే ప్రాంగణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులో అమలుపరుస్తున్న సంస్కరణల గురించి కె.అర్జునరావు వారికి వివరించారు. జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్ పర్యవేక్షణలో సారథ్యంలో ఖైదీల ఉన్నతికి పాటుపడుతున్న తీరును తెలియజెప్పారు. ఖైదీలలో పరివర్తన కోసం మహాపరివర్తన, విద్యాదానం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. జైలు నుంచి బయటపడ్డ ఖైదీలు తమ కాళ్ల మీద తాము నిలబడే విధంగా చేయడమే కాక వారి ఉపాధికి అవసరమైన రీతిలో శిక్షణనిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలన్నింటినీ దగ్గరుండి చూసిన గుజరాత్ హోం, జైళ్ల శాఖ అధికారుల బృందం ఇది అద్భుతం.. మహాద్భుతం అని కొనియాడింది.

బీజేపీని గద్దె దింపాలి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను నెరవేర్చని బీజేపీని గద్దె దింపాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. హోదా ఇస్తామన్న బీజేపీ హామీని అమలు చేయలేదన్నారు. శుక్రవారం జంతర్‌మంతర్‌లో ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి రెండో రోజు ధర్నా నిర్వహించింది. ధర్నాకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు, చలసాని శ్రీనివాస్, విద్యార్థి నేతలు హాజరయ్యారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. బీజేపీ ఏ హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టుకు సరైన నిధులు ఇవ్వడం లేదన్నారు. చట్టంలో ఉన్న అంశాలను సైతం పట్టించుకోవడం లేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, హోదా సహా విభజన హామీలు నెరవేర్చే వారికి తమ మద్దతని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా విషయంలో ఏపీని కేంద్రం దగా చేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు.

అరుణ్‌జైట్లీతో ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి సమావేశం

ధర్నా అనంతరం ఏపీ ప్రత్యేకహోదా సాధన సమితి నేతల బృందం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీని కలిసింది. ఏపీకి ప్రత్యేకహోదా, విభజన హామీలు నెరవేర్చాలని కోరింది. ఈ బృందంలో సీపీఐ ఎంపీ డి.రాజా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రత్యేకహోదా సాధన సమితి నేత చలసాని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాబుకు మోడీ ఫోబియా


- కేంద్ర సాయం లేకుండా రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మోడీ ఫోబియా పట్టుకుందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీ హరిబాబుతో కలిసి విలేకరుల తో మాట్లాడారు. చంద్రబాబు చౌకబారు రాజకీయాలు మానుకో వాలని హితవు పలికారు. కేంద్ర సాయం లేకుండా తన పరిపాలన లో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకేం మేలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టుకు రెండంతస్తుల బిల్డింగ్ కట్టలేని చంద్రబాబు ప్రచార ఆర్భాటాలకు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. తెలంగా ణలో కాంగ్రెస్‌కు పట్టినగతే ఏపీలో టీడీపీకి పడుతుందని అన్నారు. తెలంగాణలో రెండు సీట్లు గెలిచి ఘనకార్యం చేసినట్టు భావించడం ఏమిటన్నారు. చంద్రబాబును చూసి మోడీ భయపడుతున్నారని అనడం హాస్యాస్పదమన్నారు. యూసీలు అడిగితే గుమస్తాలమా అని సీఎం అనడం ప్రభుత్వ అధికారులను అవమానపరచడమే అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయకుండా, మేనిఫెస్టోనే మాయం చేశారని విమర్శించారు. ఏ రాష్ట్రానికి ఇవ్వని నిధులు ఏపీకి కేంద్రం ఇచ్చినా, తమపై నిందలేస్తూ జనాన్ని మభ్య పెడుతున్నారని అన్నారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం చేయాల్సినంత చేస్తోందని బీజేపీ ఎంపీ హరిబాబు అన్నారు. 2018-19 గాను ఉపాధిహామీ పథకం కింద నిధులు 6243 కోట్ల రూపాయలు విడుదల అయ్యాయని అన్నారు. కేంద్రం చేస్తున్న సహాయాన్ని చిన్నదిగా చూపే ప్రయత్నం మంచిది కాదన్నారు. ధర్మపోరాట దీక్షలు, నవ నిర్మాణ దీక్షలు, కలెక్టర్ల కాన్ఫరెన్స్ లలో సీఎం చంద్రబాబు ప్రధానిపై విమర్శలు చేయడం తగదన్నారు.



ఏపీపీఎస్సీ కొలువుల జాతర

- నెలాఖరులోగా మరో 14 నోటిఫికేషన్లు



అమరావతి, ఆంధ్రప్రభ: డిసెంబర్ లోపు ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు 21 నోటిఫికేషన్లు ఇచ్చి, తద్వారా 3,255 ఉద్యో గాలను భర్తీ చేశామని, ఈ నెలాఖరులోగా మరో 14 నోటిఫికేషన్లు విడుదల చేసి, 1,500 పోస్టులకుపైగా భర్తీ చేయనున్నా మని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పిన్నమనేని ఉదయభాస్కర్ వెల్లడిం చారు. స్థానిక ఏపీపీఎస్సి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివిధ ఉద్యోగ నోటిఫికేషన్ల గురించి వివరించారు. కొత్త నోటిఫికేషన్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉందని,రాగానే సత్వరమే పోస్టుల భర్తీని చేపడతామన్నారు. పంచాయతీ సెక్రటరీ పోస్టులకు 56,621 దరఖాస్తులు వచ్చాయన్నారు. అభ్యర్థులంతా చివరి నిమిషంలో దరఖాస్తు చేయడంతో సర్వర్ మొరాయించడం వల్ల కొంత ఇబ్బంది కలిగిందన్నారు. ఎప్పుడైనా సరే వీలైనంత ముందుగా దరఖాస్తు చేసుకుంటే ఇటువంటి పరిస్థితి రాదన్నారు. అంతేకాకుండా అభ్యర్థులు పాస్ వర్డులు,సెల్ నెంబర్లు, మెయిల్ చిరునామాలు మార్చడం వల్ల కూడా కొంత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. 2016లో 34 నోటిఫికేషన్లు ఇచ్చి, అన్ని పోస్టులు భర్తీ చేశామన్నారు. వర్శిటీలకు సంబంధించి ఒక్క ఆర్కియాలజీ సబ్జెక్టు మినహా 34 నోటిఫికేషన్లకు సంబంధించి రిక్రూట్‌మెంట్‌ను విజయవంతంగా పూర్తి చేశామని స్పష్టంచేశారు. గతంలో స్క్రినింగ్‌టెస్ట్‌కు 1:50 శాతం నిష్పత్తితో అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచామని,ఈసారి కటాఫ్ మార్కుల విధానాన్ని ప్రవేశపెడుతున్నామన్నారు.

39కి చేరిన రష్యా మృతులు

మాస్కో: రష్యాలోని మాగ్నిటోగొరస్క్ నగరంలో పురాతన బహుళ అంతస్తుల భవనం కూలిన ఘటనలో 39 మంది మృతి చెందినట్టు అధికారులు నిర్ధారణకు వచ్చారు. శిథిలాల కింద ఇరుక్కున్న వారిని వెలికి తీయడానికి సుమారు మూడున్నర రోజుల పాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. సోమవారం ఉదయం భవనంలో పేలుడు సంభవించడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారంతో సహాయక చర్యలు ముగిశాయి. అక్కడి ఉష్ణోగ్రతలు మైనస్ 29 డిగ్రీలు నమోదు అవుతుండటంతో సహాయక చర్యలకు విఘాతం ఏర్పడింది. 10 అంతస్తుల భవనం కూలడంతో రష్యాన్ ఎమర్జెన్సీ మంత్రిత్వ శాఖ సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీల్లో ఉండటంతో చాలా మంది హైపో థెర్మియాతో చనిపోయారని, కార్మికులను రంగంలోకి దింపి శిథిలాల కింద ఉన్న మృతదేహాలు వెలికి తీసినట్టు రష్యాన్ అధికారులు వెల్లడించారు. సహాయక చర్యలు చేపడుతున్నంత సేపు గాలి మరల ద్వారా వేడి వాయువును అందించడం జరిగిందని, సాంకేతికతను కూడా ఉపయోగించామని వివరించారు.

వీధుల కంటే.. తీహార్ జైలే మేలు

న్యూఢిల్లీ: ఢిల్లీలో శీతాకాలం చలి పెరిగిపోతుండటంతో ఇళ్లు లేనివారు కొందరు నేరాలకు పాల్పడి తీహార్ జైలుకు వెళుతున్న విషయం రాజధానిలో చోటుచేసుకుంటోంది. దేశ రాజధానిలో ఇళ్లు లేని వారు ఎక్కువగా రహదారుల పక్కనే నిద్రపోతున్నారు. వీరంతా చలికి తట్టుకోలేక వీధుల్లో ఉండడం కంటే తీహార్ జైలుకు వెళ్లడం మంచిదని భావిస్తూ, కొందరు చిన్న చిన్న నేరాలకు పాల్పడుతున్నారు. అలా చేసి తీహార్ జైల్లో కూర్చుందామని అనుకుంటున్నారని, శీతాకాలంలో తీహార్ జైలు ఖైదీల సంఖ్య పెరిగిపోతోందట. అయితే, 10,027 మంది సామర్థ్యం ఉన్న తీహార్ జైల్లో ప్రస్తుతం 16 వేల మంది ఖైదీలు ఉన్నారు. చలికాలంలో జైల్లో ఉండటం కోసం కొంతమంది దొంగతనాలకు పాల్పడుతూ కావాలని పోలీసులకు పట్టుబడుతున్నారట. కొంతమంది ఖైదీలతో మా సిబ్బంది మాట్లాడిన సమయంలో ఈ విషయం బయటపడిందని తీహార్ జైలు అధికారి ఒకరు వెల్లడించారు.

కూలిన బిల్డింగ్‌లో అక్రమ వ్యాపార కార్యకలాపాలు



న్యూఢిల్లీ: వెస్ట్ ఢిల్లీలో గురువారం రాత్రి రెండంతస్తుల ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి భవనం కూలిపోయి 7గురు మరణించిన ఘటనలో అధికారులు శుక్రవారం కీలక విషయాలను వెల్లడించారు. ఆ ఫ్యాక్టరీలో అక్రమంగా వ్యాపార కార్యక్రమాలు జరుగుతున్నాయని, నెల రోజుల క్రితం ఫ్యాక్టరీ యజమానికి సౌత్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎస్‌డీఎమ్‌సీ) నోటీసు జారీ చేసినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. బిల్డింగ్ కూలిన ప్రాంతం సౌత్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ వెస్ట్ జోన్ పరిధిలోకి వస్తుందని, ఘటన జరిగిన తర్వాత ఎస్‌డీఎమ్‌సీ బృందం ఘటనాస్థలిని పరిశీలించి ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సిబ్బందికి రెస్క్యూ ఆపరేషన్‌లో సహాయం అందిచినట్లు ఆయన తెలిపారు. ఫ్యాక్టరీ ఓనర్‌పై అంకిత్ గుప్తాపై కేసు నమోదు చేసినట్లు డీసీపీ మోనికా భరధ్వాజ్ తెలిపారు. భవనం కూలిన ఘటనలో అంకిత్ గుప్తాకి కూడా స్వల్ప గాయాలయ్యాయని, ప్రస్తుతం అతడు ట్రీట్మెంట్ పొందుతున్నాడని మోనికా భరధ్వాజ్ తెలిపారు.

సునామీలతోనూ వ్యాపారమే!

సీపోర్ట్స్ అధినేత కెవిరావు వికృతలీలల!

కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: దేశంలో రాష్ట్రంలో ప్రభుత్వాలేవి మారినా సీపోర్ట్స్ అధినేత కెవి రావు ప్రయోజనాలకు మాత్రం ఎలాంటి నష్టముండదు. ఆఖరకు సునామీలు, తుపాన్‌లు వంటి ప్రకృతి వైపరీత్యాల్ని కూడా ఆయన లాభసాటిగానే మార్చుకోగలుగుతున్నారు. ఇటీవల జరిగిన తాజా సంఘటన ఒకటి ఇందుకుదాహరణగా నిలుస్తోంది. ఇటీవల తుపాన్ అనంతరం పోర్టులో క్రేన్‌గా చెప్పబడుతున్న గతంలో స్క్రాప్‌గా కొనుగోలు చేసి తీసుకొచ్చిన ఓ పరికరం మరమ్మతుల సందర్భంగా కుప్పకూలిపోయింది. దీనికింద కొందరు కార్మికులు నలిగిపోయారు. ఈ దుర్ఘటనలో మృతులు, బాధితుల పరిస్థితెలా ఉన్నా క్రేన్‌కు బీమా చేసిన కంపెనీ రెండు కోట్లు చెల్లించేందుకు ఆమోదించినట్లు సమాచారం. అలాగే కుప్పకూలి నుజ్జు నుజ్జు అయిన ఈ పరికరాన్ని 50లక్షలకు కొనుగోలు చేసేందుకు కొన్ని సంస్థలు ముందుకొచ్చినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ పరికరాన్ని ఆయన ఎంత పెట్టి కొని తెచ్చారో స్పష్టమైన ఆధారాల్లేవు. సహజంగా కెవి రావుకు వివిధ పోర్టులు, పరిశ్రమల్లో వినియోగించిన అనంతరం స్క్రాప్‌గా అమ్మేసే పరికరాల్ని కొనుగోలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. అలాగేదీన్ని కూడా కొనుగోలు చేసి తెచ్చారు. దీన్నిక్కడ క్రేన్‌గా వినియోగిస్తున్నారు. తుపాన్ అనంతరం ఈ పరికరం కుప్పకూలడంతో అది కూడా ఆయనకు భారీగానే లాభాన్ని తెచ్చిపెడుతోంది.

ఉగ్రవాద సానుభూతిపరుడి అరెస్ట్

- అక్రమంగా ఆయుధాలు సరఫరా చేస్తున్న నయీం
- దేశవ్యాప్తంగా బాంబు దాడులకు పథక రచన
- అనుమతులను విస్తరిస్తున్న ఎన్ఐఏ

న్యూఢిల్లీ: ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రేరేపితమై నిషేధిత ఐఎస్ఐఎస్ సంస్థ సభ్యులకు రహస్యంగా ఆయుధాలు సమకూర్చుతున్నాడన్న ఆరోపణ నేపథ్యంలో 21 ఏళ్ల యువకుడిని అరెస్టు చేసినట్టు నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు శుక్రవారం ప్రకటించారు. గురువారం అర్ధరాత్రి మీరట్‌లో నయీంను అదుపులోకి తీసుకున్నట్టు వివరించారు. ఈ వ్యవహారంలో మరో 10 మందిని కూడా అరెస్టు చేసినట్టు ఎన్ఐఏ తెలిపింది. అరెస్టయిన వారిలో ఉత్తర్‌ప్రదేశ్, అమ్రోహ నుంచి ముఫ్తీ కూడా ఉన్నట్టు చెప్పుకొచ్చింది. ఇతను ఢిల్లీలోని రాజకీయ నేతలు, ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడులకు ప్రణాళిక రచించినట్టు విచారణలో వెల్లడైనట్టు అధికారులు వెల్లడించారు. ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆత్మాహుతిదాడికి సంబంధించిన మందుగుండు సామాగ్రితో పాటు 112 అలారం వాచీలు, దేశీయంగా తయారైన రాకెట్ లాంచర్‌ను ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది.

మారణహోమం సృష్టించడానికి అందరూ సిద్ధమై ఉన్నారని, పలుచోట్ల టైం బాంబులు, పైప్ బాంబుల బిగించి రిమోట్ కంట్రోల్ ద్వారా పేల్చడమే మిగిలి ఉండిందని అధికారులు తెలిపారు. హర్కత్ ఉల్ హర్బ్ ఎ ఇస్లాం (ఇస్లాం మతం కోసం యుద్ధం) అనే కోడ్‌తో మారణహోమం సృష్టించేందుకు యత్నించినట్టు వివరించారు. దాడులకు మాస్టర్ మైండ్‌గా మహ్మద్ సుహేల్ (29)గా గుర్తించడం జరిగిందని, నోయిడాలోని అమిటీ వర్సిటీలో ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్నాడని తెలిపారు. పట్టుబడిన వారిలో విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నట్టు ఎన్ఐఏ తెలిపింది.

'నాకు మంత్రి పదవివ్వండి.. బాంబులతో లేపేస్తా'

లఖ్‌నవూ: భారత్‌లో భద్రత లేదని భావిస్తున్న వారందరినీ బాంబులతో లేపేయాలని ఉత్తరప్రదేశ్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎమ్మెల్యే విక్రమ్ సైనీ శుక్రవారం నాడు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో రక్షణ లేదని అంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఒక చట్టం రూపొందించాలని కూడా డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, తన వ్యక్తిగత అభిప్రాయం మేరకు భారత్‌లో భద్రత లేదని, బెదిరింపులకు లోనవుతున్నట్లు భావిస్తోన్న వారిని బాంబులతో పేల్చేయాలి. తనకు మంత్రి పదవి ఇవ్వండి, అటువంటి వారు ఒక్కరు కూడా మిగలకుండా అందరినీ లేపేస్తానని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల దేశంలో మూక హత్యలు ఎక్కువయ్యాయని, పోలీసు అధికారుల ప్రాణాల కంటే గోవుల రక్షణే ఎక్కువైందని బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షా ఇటీవల చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన విషయం విదితమే.

7లోగా రక్షణ చర్యలపై నివేదికివ్వండి

మేఘాలయ గని బాధితులపై కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: కేంద్రంతోపాటు మేఘాలయ ప్రభుత్వం గనిలో చిక్కుకున్నవారిని కాపాడేందుకు తీసుకున్న చర్యలకు సంబంధించిన మొత్తం వివరాలతో ఈ నెల 7లోగా పూర్తి నివేదిక అందజేయాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. సుప్రీం జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో కూడా ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గనిలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉన్నాయని సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తొలుత సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మేఘాలయ బొగ్గుగనిలో చిక్కుకుపోయిన మైనర్లను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన వివరాలను శుక్రవారం సుప్రీంకోర్టుకు నివేదించారు. ఆ గనిలో అక్రమంగా తవ్వకాలు చేపట్టారుని 355 అడుగుల లోతు ఉన్న గని నేలకు సుమారు 20అంతస్తుల దిగువన ఉందని, గని బ్లూప్రింట్ కూడా లేదని సుప్రీంకోర్టుకు కేంద్రం తరపున హాజరైన మెహతా తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన చెందిన డైవర్లు సహాయక చర్యలు పాల్గొంటున్నారని అయితే గనికి సమీపంలో నది ఉండటం వల్ల సహాయకచర్యలు అందించడం కష్టతరంగా ఉందని కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ సుప్రీంకోర్టుకు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, డాగ్ స్క్వాడ్‌కు చెందిన సిబ్బంది ఇప్పటికే సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారని తెలిపారు.

అయోధ్య కేసు 10కి వాయిదా



న్యూఢిల్లీ: అయోధ్యలోని రామజన్మ భూమి-బాబ్రీ మసీదు భూవివాదంపై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 10కివాయిదా వేసింది. ఈ కేసులో తదుపరి విచారణ తేదీపై జనవరి 10న నిర్ణయం తీసుకోనున్నట్టు సుప్రీంకోర్టు తెలిపింది. సుప్రీం ధర్మాసనం శుక్రవారం తమ సమక్షానికి కేసు విచారణ రాగానే కేవలం 30సెకన్లలోనే తమ నిర్ణయాన్ని ప్రకటిస్తూ వాయిదా వేసింది. తగిన ధర్మాసనం ఈ 10న కేసుపై విచారణ జరుపుతుందని చీఫ్ జస్టిస్ గొగొయ్ తెలిపారు.శుక్రవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్, జస్టిస్ ఎస్కే కౌల్‌తో కూడిన ధర్మాసనం అయోధ్య కేసులో విచారణకు తేదీల ఖరారుపై జనవరి 10న తగిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేస్తుందని తెలిపింది. ఇరుపక్షాల తరఫున విచారణకు సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, రాజీవ్ ధవన్ హాజరయ్యారు. అయితే సుప్రీం ధర్మాసనం ఎలాంటి వాదనలు వినకుండానే విచారణను 10వ తేదీకి వాయిదా వేసింది.కాగా అయోధ్య వివాదంపై గతంలో అలహాబాద్ హైకోర్టు 2010లో తీర్పు ఇచ్చింది. వివాదాస్పదమైన మొత్తం 2.77 ఎకరాల భూమిని సున్నీ వక్ఫ్ బోర్డ్, నిర్మోహి అఖాడా, రామ్‌లల్లాలకు సమానంగా పంచాలని తన తీర్పులో పేర్కొంది. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో 14పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని విచారణకు స్వీకరించిన సుప్రీం ధర్మాసనం పిటిషన్లపై విచారణ జనవరి మొదటివారంలో తగిన ధర్మాసనం విచారణ చేపడుతుందని గతేడాది అక్టోబర్ 29న తెలిపింది. తాజాగా శుక్రవారం మరోసారి వాయిదా వేసింది. దీంతో ఈ కేసుపై విచారణను నూతన ధర్మాసనం నిర్వహించే అవకాశం ఉంది. నూతన ధర్మాసనంలో జస్టిస్ అశోక్‌భూషణ్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌తోపాటు మరో న్యాయమూర్తి కూడా ఉండే అవకాశం ఉంది. మరోవైపు ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం రామమందిరం నిర్మాణంపై ఆర్డినెన్స్ లేదా ఎటువంటి నిర్ణయమైనా న్యాయవిచారణ అనంతరమే జరుగుతుందని సూచించారు.

నిర్వహణలో 4వేల పీఎంబీజేపీ కేంద్రాలు




న్యూఢిల్లీ: 2018 ముగిసేనాటికి దేశవ్యాప్తంగా 4,677 ప్రధాన్ మంత్రి భారతీయ జన్ ఔషధి పరియోజన(పీఎంబీజేపీ) కేంద్రాలు నిర్వహణలో ఉన్నాయని ఓ ప్రశ్నకు సమాధానంగా శుక్రవారం కేంద్రమంత్రి మన్‌సుఖ్ ఎల్ మాండవియా రాజ్యసభకు తెలియజేశారు. ఈ కేంద్రాలు పేషెంట్లకు నాణ్యమైన జనరిక్ మందులను తక్కువ ధరకే అందిస్తాయి. 2018 డిసెంబర్ 31ముగిసే నాటికి 417కోట్ల రూపాయల విలువైన అన్‌బ్రాండెడ్ జనరిక్ మందులను పీఎమ్‌బీజేపీ కేంద్రాల ద్వారా అమ్మినట్లు మాండవియా పేర్కొన్నారు.

జకీర్ నాయక్ కేసులో ముంబై హైకోర్టుకి ఈడీ



ముంబై: మత బోధకుడు జాకీర్ నాయక్ కేసులో మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఈడీ ముంబై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై స్పందించిన ముంబై హైకోర్టు శుక్రవారం జాకీర్ నాయక్ ఇస్లామిక్ రిసెర్చ్ ఫౌండేషన్‌కు నోటీసు జారీ చేసింది. కాగా న్యూఢిల్లీలోని మనీ లాండరింగ్ చట్టం (పీఎంఎల్ఎ) అప్పిలేట్ ట్రిబ్యునల్ గత ఏడాది ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఈడీ ముంబై హైకోర్టును ఆశ్రయించి చట్టవిరుద్ధమైనచర్యల నిరోధక చట్టం(యూఏపీఏ) ప్రకారం జాకీర్ నాయక్‌కు వ్యతిరేకంగా ఎన్ఐఏ నమోదు చేసిన ఛార్జిషీట్ కాపీని సమర్పించింది.

లోక్‌పాల్ నియామక చర్యలపై అఫిడవిట్ ఇవ్వండి



న్యూఢిల్లీ: లోక్‌పాల్ నియామకంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై అఫిడవిట్ సమర్పించాలని శుక్రవారం కేంద్రాన్ని కోరింది. లోక్‌పాల్ నియామక ప్రక్రియలో కేంద్రం ప్రదర్శిస్తున్న వైఖరిపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. జనవరి 17 లోగా కేంద్రం తీసుకున్న చర్యలుపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ సమర్పించాలని సుప్రీం ధర్మాసనం అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌ను కోరింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ ఎస్కే కౌల్‌తోకూడిన సుప్రీం ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తూ లోక్‌పాల్ నియామకానికి తీసుకున్న చర్యలను ఆన్ రికార్డుగా అఫిడవిట్‌లో పొందుపరచాలని ఆదేశించారు.

పనిచోట లైంగిక వేధింపులపై పోరాడాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పని చేసే చోట మహిళలపై లైంగిక వేధింపులపై గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్‌లో శుక్రవారం వర్క్‌షాప్ జరిగింది. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా)తో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంటర్‌ప్యూనర్స్ అండ్ కమ్యూనికేషన్స్ (ఈటిఈ అండ్ సి), సెంటర్ ఫర్ సోషల్ అండ్ కానిస్టిట్యూషనల్ స్టడీస్ (సిఎస్‌సిఎస్) సంయుక్తంగా నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ రమాదేవి మాట్లాడుతూ, మహిళలు ఎన్నో వ్యక్తిగత సమస్యలు, ఇబ్బందులున్నప్పటికీ విధులకు హాజరవుతుంటారని, పని చోట వేధింపులకు గురైతే సవాళ్లను అధిగమించడం ఇబ్బందిగా మారుతుందన్నారు. పని చోట ఎదురయ్యే లైంగిక వేధింపులపై మహిళలు బహిరం గంగా ముందుకు రావాలన్నారు. అప్పుడే వారికి న్యాయం జరుగుతుందని, మానసిక క్షోభ నుంచి భయటపడేందుకు వీలవుతుందన్నారు. ఈ సందర్భంగా అవేర్‌నెస్ బ్రోచర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైసియా అధ్యక్షులు మురళీ బొల్లు, ఇన్ఫోసిస్ సెంటర్ హెడ్ రఘు బొడ్డుపల్లి, హైసియా సీఓఓ ఆర్ శ్రీనివాసరావు, న్యాయవాది ఎంఎ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆపిల్‌తో ఆరెంజ్‌కు పోలికా..?



- మాది రక్షణ ఒప్పందం.. మీది రక్షణ కోసం ఒప్పందం
- లాభం లేకే రాఫెల్‌ను మధ్యలో వదిలేశారు
- సెప్టెంబర్ నాటికి దేశానికి తొలి రాఫెల్ విమానం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: రాఫెల్‌పై పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. ఒకరిపై మరొకరు సంధిస్తున్న వాగ్బాణాలు అసలు విషయాన్ని మరిచి వ్యక్తిగత విమర్శల వరకు వెళ్తున్నాయి. రాఫెల్ అంశంపై శుక్రవారం లోక్‌సభలో ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తనదైన శైలిలో బదులిచ్చారు. సుమారు రెండు గంటల పాటు రాఫెల్‌పై మాట్లాడిన సుష్మా రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం నుంచి.. హెచ్‌ఏఎల్‌కు ఆఫ్‌సెట్ కాంట్రాక్ట్ రాకపోవడం, ధరల వరకు అన్ని అంశాలను ప్రస్తావించారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై అంశాల వారీగా విమర్శించారు.

హెచ్‌ఏఎల్‌కు లక్ష కోట్ల కాంట్రాక్ట్

రాఫెల్ ఒప్పంద ధరలను కాంగ్రెస్ పార్టీ యాపిల్ పండును నారింజ పండుతో పోల్చినట్లుంది. యూపీఏ ఒప్పంద ధర రూ. 526 కోట్లు.. ఎన్డీఏ ఒప్పంద ధర రూ.1600 కోట్లు అని పదేపదే చెబుతున్నారు. 2007 నాటి ధరలు 2016లో అలాగే ఉంటాయా..? 2007లో కోట్ చేసిన ధరలు అలాగే కొనసాగించాలంటే ఎలా..? సామాన్య యుద్ధవిమానంతో శక్తివంతమైన యుద్ధవిమానం ధరలను పోలుస్తారా..? అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌ఏఎల్‌పై ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తోంది. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హెచ్‌ఎల్‌కు లక్ష కోట్ల రూపాయల కాంట్రాక్ట్ ఇప్పించిన విషయం కాంగ్రెస్ నేతలకు తెలుసా..? అధికారంలో ఉన్నప్పుడు రాఫెల్ ఒప్పందాన్ని ఆపేశారు. భారత వాయుసేనను మరిచిపోయారు. రాఫెల్ ఒప్పందం మీకు సరితూగలేదు.. మీకు డబ్బు అందలేదు.. అందుకే ఒప్పందాన్ని ముగించలేకపోయారు. దేశ ప్రయోజనాలకే మోడీ ప్రాధాన్యతనిస్తారు. అని నిర్మలా సీతారామన్ కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. మీరు దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం రాఫెల్ యుద్ధవిమానాలను 126 నుంచి 36 కు తగ్గించిందని ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కొనాలనుకున్న శక్తివంతమైన యుద్ధవిమానాలు 18. ఎన్డీఏ ప్రభుత్వం కొనుగోలు చేయదలచిన శక్తివంతమైన యుద్ధవిమానాలు 36. రెండు ప్రభుత్వాల ఒప్పందాల్లో ఎంత తేడా ఉందో ప్రజలు గమనిస్తున్నారు. మాది రక్షణ ఒప్పందం- మీది రక్షణ కోసం ఒప్పందం. యూపీఏ హయాంలో ఆఫ్‌సెట్ కాంట్రాక్ట్ పొందిన ఏడీఏజీ గ్రూప్ కంపెనీ ద్వారా కాంగ్రెస్ పార్టీకి మేలు జరిగింది. ఎన్డీఏ అలాంటి పనులు చేపట్టలేదు.. దేశ ప్రయోజనాలే లక్ష్యంగా ఫ్రాన్స్‌తో రాఫెల్ ఒప్పందాన్ని చేసుకుంది.



బోఫోర్స్‌తో కాంగ్రెస్ బోల్తా... రాఫెల్‌తో రాణిస్తాం

బోఫోర్స్ కుంభకోణంతో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం పడిపోయిందని, రాఫెల్ అంశంతో మోడీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రాఫెల్ డీల్ లో ఎటువంటి కుంభకోణం జరగలేదని, యూపీఏ ప్రభుత్వం జరిపిన బేరసారాల కంటే తక్కువ ధరకే తాము యుద్ధ విమానాలు కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. శుక్రవారం రాఫెల్ డీల్‌పై లోక్‌సభలో జరిగిన చర్చకు ఆయన సమాధానమిచ్చారు. తమకు కమీషన్ రావడం లేదనే రాఫెల్ యుద్ధ విమానాలను నాటి యూపీఏ ప్రభుత్వం కొనుగోలు చేయలేదన్నారు. అయితే తాము జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే 36 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నా మని స్పష్టం చేశారు. రాఫెల్ బేస్ ప్రైస్ 670 కోట్ల రూపాయలకు తాము కొను గోలు చేయగా, యూపీఏ ప్రభుత్వం 737 కోట్లకు బేరసారాలు జరిపిందని తెలిపారు. తొమ్మిది శాతం తక్కువ ధరకు తాము ఒప్పందం చేసుకున్నామ న్నారు. నిర్ణయ ప్రక్రియ అంతా నిబంధనల మేరకే జరిగిందని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసిందని చెప్పారు. హెచ్ఎఎల్‌కు రాఫెల్ విమానాల తయారీ ఎందుకివ్వడం లేదని అడుగుతున్న కాంగ్రెస్ పార్టీ, అగస్టా వెస్ట్ ల్యాండ్ నుంచి హెలికాప్టర్ల ను ఎందుకు కొనుగోలు చేసిందని ప్రశ్నించారు. తాము లక్ష కోట్ల రూపాయల మేర పనులను హెచ్ఎఎల్‌కు ఇచ్చామని చెప్పారు. రాఫెల్ విమానాల అంశంలో తమకు 2.7 రెట్లు అధికంగా మానవ పని గంటలు అవసరమని హెచ్ఎఎల్ తెలిపిందన్నారు. దానికంటే ముందుగానే ఫ్రాన్స్ నుంచి రాఫెల్ విమానాలు వస్తాయన్నారు. ఈ సెప్టెంబర్‌లో తొలి యుద్ధ విమానం భారత్‌కు వస్తుందని చెప్పారు. అఫ్‌సెట్ భాగస్వామి ఎంపిక విషయంలో నాటి యూపీఏ నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నామని చెప్పారు.

జవాబివ్వలేక పారిపోయారు



- మేమొస్తే రాఫెల్‌పై విచారణ జరిపిస్తాం
- జెట్ ఫైటర్లను 126 నుంచి 36 ఎలా కుదించారు..?
- అనీల్ అంబానీకి కాంట్రాక్ట్ ఎవరిచ్చారు..?

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. లోక్‌సభలో రాఫెల్‌పై చర్చ సందర్భంగా తాను సంధించిన ప్రశ్నలకు బదులివ్వలేక నిర్మలా సీతారామన్ పారిపోయారని వ్యాఖ్యానించారు. నేనడిన ప్రశ్నల్లో ఒక్క దానికీ రక్షణ మంత్రి బదులివ్వలేకపోయారు. అనిల్ అంబానీ పేరును కూడా ప్రస్తావించలేకపోయారు. రాఫెల్ చర్చల్లో ఎవరెవరు పాల్గొన్నారు.. ఎయిర్‌ఫోర్స్ చీఫ్, రక్షణ మంత్రి, కార్యదర్శులు, ఎయిర్‌ఫోర్స్ అధికారులా.. ప్రధానమంత్రి బై పాస్ సర్జరీ ఎప్పుడు చేశా రు..? అందుకు ఎయిర్‌ఫోర్స్ అధికారులు అభ్యంతరం తెలపలేదా..? అవునా..కాదా అని ప్రశ్నించా. దేనికీ నిర్మలా సీతారామన్ బదులి వ్వలేదు... నేనడిన ప్రశ్నలకు బదులివ్వకుండా లోక్‌సభలో అవమానించామని రక్షణ మంత్రి నాటకమాడారు. ఆమెవన్నీ అబద్ధాలే అని చెప్పా.. అని రాహుల్ చెప్పుకొచ్చారు.

మేం అధికారంలోకి వస్తే రాఫెల్‌పై దర్యాప్తు

రాఫెల్ యుద్ధ విమానాలకు సంబంధించి యూపీఏ డీల్‌ను రద్దు చేసి ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్ని వ్యవస్థలను బైపాస్ చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ధరను బయటికి వెల్లడించే అంశంలో రహస్యమేమి లేదని ఫ్రాన్స్ అధ్యక్షుడు తనకు చెప్పారని అన్నారు. అనిల్ అంబానీని ఆఫ్‌సెట్ భాగస్వామిగా చేసుకోవాలని ప్రధాని ఒత్తిడి తెచ్చారని తెలిపారని లోక్‌సభలో అన్నారు. తమ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ప్రభుత్వం పారిపోయిందని రాహుల్‌గాంధీ అన్నారు తాము అధికారంలోకి వస్తే రాఫెల్‌పై దర్యాప్తు జరిపిస్తామని అన్నారు. రాఫెల్ వివాదంలో ఏం జరగలేదనుకుంటే జేపీసీ వేయడానికి ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు.చర్చ అనంతరం లోక్‌సభ ఆధార్ సవరణ బిల్లుపై చర్చ జరిపి ఆమోదం తెలిపింది. రాజ్యసభలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ అంశంపై జీరో అవర్‌లో కొంతసేపు చర్చ జరిగింది. వివిధ పార్టీలకు చెందిన మహిళా ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తమ పార్టీలు ఈ బిల్లుకు మద్దతు ఇస్తాయని మహిళా ఎంపీలు పేర్కొన్నారు.

మరోసారి కన్ను గీటిన రాహుల్

రాఫెల్ ఒప్పందంపై లోక్‌సభలో చర్చ జరుగుతు న్న సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కన్నుగీటారు. తమిళనా డు ఎంపీ తంబిదురై రాఫెల్‌పై మాట్లాడుతున్న సమయం లో తన వెనకున్న నేతతో మాట్లాడుతూ రాహుల్ కన్నుగీటారు. రాహుల్ కన్ను గీటిన వీడియో కెమెరాకు చిక్కడంతో వైరల్ గా మారింది. గతేడాది



జూలైలో ఎన్డీఏ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం సందర్భంగా రాహుల్ గాంధీ ఇలాగే కన్నుగీటారు. అవిశ్వాస తీర్మానం సందర్భంగా ప్రసగించిన తర్వాత అనూహ్యంగా ప్రధాని మోడీని ఆలింగనం చేసుకుని తన సీట్లో కూర్చున్న రాహుల్... ఎంపీ జ్యోతిరాధిత్య సింధియాను చూస్తూ కన్నుగీటారు.

ప్రధానిని అవమానింపజాలదు

రాఫెల్ ఒప్పందంపై లోక్‌సభ చర్చ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహంతో ఊగిపోయారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాని మోడీని.. దొంగ, అబద్ధాల కోరు అని అభివర్ణించడాన్ని తప్పుబడుతూ.. తనను, ప్రధాని మోడీని అవమానించే దమ్ము ఎవరికీ లేదని మండిపడ్డారు. రాఫెల్ ఒప్పందంలో ఆఫ్‌సెట్ లబ్దిదారుగా అనిల్ అంబానీ ఉన్నప్పటికీ రక్షణ మంత్రి ఎందుకు ఆయన పేరను ప్రస్తావించలేదని రాహుల్ ప్రశ్నిస్తూ.. మోడీ, నిర్మలపై వాగ్బాణాలు సంధించారు. ఈనేపథ్యంలో నిర్మల స్పందిస్తూ తమనెవరూ అవమానించలేదని వ్యాఖ్యానించారు.

బీబీబీపీ ప్రకటనలకు 364 కోట్లు

భేటీ బచావో భేటీ పడావో(బీజీబీపీ) క్యాంపెయిన్ ప్రకటనలకు 2014 నుంచి 364 కోట్ల రూపాయలను కేంద్రం ఖర్చు చేసినట్లు కేంద్రమంత్రి వీరేంద్రకుమార్ శుక్రవారం లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. 2018-19 (డిసెంబర్31,2018 వరకు)లో క్యాంపెయిన్ అడ్వర్టయిజింగ్‌పై అత్యధికంగా 155.71 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. 2014-15లో 18.91కోట్లు, 2015-16లో 24.54 కోట్లు 2016-17లో 29.79కోట్లు 2017-18లో 135.71 కోట్లను కేంద్రప్రభుత్వం ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. 2015లో జనవరిలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా హర్యానాలోని పానిపట్టులో బీబీబీపీ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

ఐక్యతా విగ్రహానికి కేంద్రం 300కోట్లు

గుజరాత్‌లోని ప్రపంచంలోనే ఎత్తైన ఐక్యతా విగ్రహ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం 300 కోట్లు విడుదల చేసినట్లు శుక్రవారం కేంద్రమంత్రి రాధాకృష్ణన్ లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత మల్లిఖార్జున ఖర్గే అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాధాకృష్ణన్ పార్లమెంట్‌కు ఈ వివరాలను తెలియజేశారు. ఐక్యతా విగ్రహానికి నిధులు మంజూరు చేయాలంటూ ఏ ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఆర్థికశాఖ సూచించలేదని ఆయన తెలిపారు. విగ్రహ నిర్మాణానికి విదేశీ నిధుల గురించి ఆర్థికమంత్రిత్వశాఖ వద్ద ఎటువంటి వివరాలు లేవని ఆయన పేర్కొన్నారు. దాదాపు 3,000 కోట్లతో నిర్మించిన ఐక్యతావిగ్రహాన్ని గతేడాది అక్టోబర్ 31న జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించిన విషయం తెలిసిందే.

ఐదేళ్లలో 27మంది పరార్

గడిచిన ఐదేళ్ల కాలంలో 27మంది ఆర్థికనేరగాళ్లు, దివాలా తీసిన వ్యాపారవేత్తలు దేశం వదిలి పారిపోయినట్లు శుక్రవారం కేంద్రమంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఈ 27 మందిలో 20మందిపైన రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసేందుకు ఇంటర్‌పోల్ సంప్రదించిందని, ఇప్పటికే దేశం వదిలి పారిపోయిన 8మందిపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆరుగురి కేసుల్లో నిందితుల అప్పగింతకు కోరినట్లు ఆయన తెలిపారు. మరోవైపు విజయమాల్యాను భారత్‌కి అప్పగించాల్సిందిగా యూకే ప్రభుత్వాన్ని లండన్ వెస్ట్ మినిస్టర్ కోర్టు ఆదేశించిన విషయాన్ని శుక్లా ఈ సందర్భంగా గుర్తుచేశారు.

తగ్గుతున్న మలేరియా కేసులు

భారత్‌లో క్రమంగా మలేరియా కేసులు తగ్గుముఖం పడుతున్నాయని, 2016తో పోలిస్తే 2017లో 3 మిలియన్ కేసులు తక్కువగా నమోదైనట్టు కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా తెలిపారు. లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు నడ్డా, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ రిపోర్టును చదివి వినిపించారు. 2017లో 194 మరణాలు సంభవిస్తే, 2018లో 54 మాత్రమే నమోదైనట్టు వివరించారు. భారత్‌లో 2016తో పోలిస్తే 2017లో 24 శాతం మలేరియా కేసులు తగ్గినట్టు డబ్ల్యూహెచ్‌ఓ ద్వారా వరల్డ్ మలేరియా 2018 రిపోర్టు ప్రచురించింది. క్వశ్చన్ అవర్‌లో నడ్డా మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో పర్యటన, ప్రభుత్వం కృషి ఫలితంగానే ఈ అభివృద్ధి సాధించడం జరిగిందన్నారు. వ్యాధి గుర్తించిన వెంటనే పూర్తి స్థాయి వైద్యం అందించినట్టు తెలిపారు. మలేరియా కేసుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం రెగ్యులర్‌గా మాట్లాడుతూ వచ్చిందన్నారు.

రాహుల్‌ను నిలదీయండి: స్మృతి



న్యూఢిల్లీ: రామాలయం అంశంపై కాంగ్రెస్ పార్టీ తమ లాయర్ల ద్వారా రాజకీయం చేయడం మానుకోవాలని, అది ప్రజల విశ్వాసాలకు సంబంధించిన అంశమని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అన్నారు. శుక్రవారంనాడు మీడియాతో మాట్లాడుతూ రామాలయం అంశంపై కాంగ్రెస్ పార్టీ తమ లాయర్ల ద్వారా రాజకీయం చేయడం కూడదనీ, దీనిపై రామభక్తులంతా ఆ పార్టీని నిలదీయాలని ఆమె పిలుపునిచ్చారు. మూడు రాష్ట్రాల ఎన్నికల కోసమే రాహుల్ జంధ్యం ధరించారా అన్న విషయంపై కూడా రామభక్తులు ఆ పార్టీని నిలదీయాలన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ రామజన్మభూమి, బాబ్రీ మసీదు స్థల వివాదంపై విచారణను వాయిదా వేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, న్యాయవాది కపిల్ సిబాల్ కోరిన నేపథ్యంలో స్మృతి ఇరానీ తాజా వ్యాఖ్యలు చేశారు.

సబ్సిడీలు రైతుల ఖాతాల్లోకే?

న్యూఢిల్లీ: ఎరువులపై ఇచ్చే సబ్సిడీలను నేరుగా రైతుల ఖాతా ల్లోకే జమ చేసే విషయమై నీతి అయోగ్య ఒక కమిటీ ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ రాజ్యసభలో వెల్లడించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఒక ప్రశ్న కు సమాధానమిస్తూ.. రైతులకే నేరుగా సబ్సిడీ ఫలాలను అందించే ఆలోచన ఉన్నట్లు చెప్పారు. రైతులకు సబ్సిడీ అందించే విధానాన్ని 2016 లోనే ఒక పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టినట్లు చెప్పారు. 2018 మార్చి నుంచే తొలి దశలో రెండు లక్షల విక్రయా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీలు అందించినట్లు, నీతి అయోగ్ కమిటీ నివేదిక తరువాత రెండో దశను ప్రారం భించనున్నట్లు కేంద్ర మంత్రి ఇంద్రజి త్ సింగ్ తెలిపారు.



నిజమైన పౌరులకే ఎన్ఆర్సీలో చోటు

- త్వరలో పార్లమెంట్‌లో పౌరసత్వ బిల్లు
- అసోం ప్రజలకు రాజ్యాంగ భద్రతే లక్ష్యం
- నేతాజీ స్ఫూర్తితో నవ భారత నిర్మాణం
- అసోం, మణిపూర్ ర్యాలీలో ప్రధాని మోడీ

సిల్చార్(అసోం): నిజమైన పౌరులెవరూ అసోంజాతీయ పౌర నమోదులో అన్యాయం జరగబోదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. త్వరలోనే అసోం పౌరసత్వ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేస్తామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ముంచుకొస్తున్న వేళ 100 రోజుల్లో దేశంలోని 20 రాష్ట్రాల్లో ప్రచారం నిర్వహించాలని భావించిన మోడీ ఈశాన్య భారతం నుంచి ప్రచారాన్ని మొదలుపెట్టారు. కాలీనగర్‌లో బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప సమావేశ ర్యాలీలో పాల్గొన్న మోడీ.. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే నిజమైన పౌరులకు అన్యాయం జరిగిందని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలియజేశారు. అసోం ప్రజలకు రాజ్యాంగపరంగా, చట్టపరంగా రక్షణ కల్పించేందుకు క్లాస్ 6ను అమలు చేస్తామన్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసోం ప్రజలకు సామాజిక, సాంస్కృతిక, భాషాపరమైన గుర్తింపు లభించిందని మోడీ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ వైపు నిలిచిన అసోం ప్రజల రుణం తీర్చుకునేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. దేశంలోని అతిపెద్ద రైల్ కం రోడ్ బ్రిడ్జ్‌ను ప్రారంభించిన అంశాన్ని గుర్తు చేస్తూ.. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా తమ ప్రభుత్వం నాలుగేళ్లలో పూర్తి చేసిందని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల్లోని 25 లోక్‌సభస్థానాల్లో 21 స్థానాలను తమ ఖాతాలో వేసుకోవాలని వ్యూహాలు రచిస్తున్న బీజేపీ.. అసోంలోని 14 స్థానాల్లో 12 స్థానాలను కైవశం చేసుకునేలా ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగానే ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

నాలుగేళ్లలో 12 లక్షల కోట్ల ప్రాజెక్టులు

గత ప్రభుత్వాలు ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రాజెక్టులను పక్కనబెట్టడం వల్లే మణిపూర్ అభివృద్ధి ఆమడ దూరంలో ఉండేదని ప్రధాని మోడీ అన్నారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 12 లక్షల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని తెలియజేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మణిపూర్ రాజధాని ఇంపాల్‌లో బీజేపీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నమోడీ.. గత ప్రభుత్వం రూ.100 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం ప్రస్తుతం ఆ ప్రాజెక్టుల వ్యయం రూ.200-250 కోట్లకు పెరిగిపోయిందని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల అభివృద్దే లక్ష్యంగా ప్రధాన మంత్రి కార్యాలయంలో ప్రగతి పేరుతో సరికొత్త వ్యవస్థను అమలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు..రాష్ట్రాల అధికారులతో చర్చించి ఎప్పటికప్పుడు ప్రాజెక్టుల పురోగతి, నిర్మాణాలపై ఆరా , నిధుల విడుదలపై చర్యలు చేపడుతున్నారన్నారు. మణిపూర్ పర్యటనలో భాగంగా 8 కీలక ప్రాజెక్టులను ప్రారంభించిన మోడీ..నాలుగు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.గత ప్రభుత్వం అవలంభించిన నిర్లక్ష్యం చేయడం.. మరచి పోవడం విధానంతో ఎన్నో పనులు నిలిచిపోయి.. దేశభివృద్ధి పై ప్రభావం చూపాయన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన భారత జాతీయ ఆర్మీని స్ఫూర్తిగా తీసుకుని నవ భారత నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఐక్యత, వైవిద్యాలకు మారుపేరుగా చెప్పుకునే మణిపూర్ మహిళలు స్వాతంత్ర సంగ్రామంలోనూ కీలక పాత్ర పోషించారని మోడీ గుర్తు చేశారు. కొండ ప్రాంతాల ప్రజలకు సైతం మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత నాలుగేళ్లలో మణిపూర్‌లో 2500 కి.మీ మేర జాతీయ రహదారులు నిర్మించిందన్నారు.2017 నుంచి మణిపూర్‌లో అధికారంలో ఉన్న బీజేపీ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తుందన్నారు.

రెండో రోజు ఉద్రిక్తత

- రాళ్లు, పెట్రోబాంబులతో ఆందోళనకారుల దాడి
- 1,369 మంది అరెస్ట్... 801 కేసులు నమోదు
- పోలీసులు అదుపులో 717 మంది



తిరువనంతపురం: శబరిమల పుణ్యక్షేత్రంలోకి ఇద్దరు మహిళల ప్రవేశం అనంతరం చెలరేగిన హింసాత్మక సంఘటనలు మరింత ఉద్ధృతమై కేరళ రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్తత కొనసాగుతోంది. శుక్రవారం కూడా ఆందోళనకారులు పలుప్రాంతాల్లో రాళ్లు, పెట్రోబాంబులు విసరటంతో ఉద్రిక్తత కొనసాగింది. గురువారం కొన్ని హిందూ సంస్థలు ఆందోళనకు పిలుపునివ్వడంతో హింసాత్మక ఘటనలు చెలరేగాయని పోలీసులు తెలిపారు. రెండు రోజుల వ్యవధిలో 801 కేసులు నమోదు చేసి సుమారు 1,369మంది అరెస్టు చేశామని తెలిపారు. అదేవిధంగా 717మందిని ముందస్తు జాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నామని శుక్రవారం పోలీసులు మీడియాకు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున కోజీకోడ్‌లోని పెరంబరాలో మలబార్ దేవస్థానం బోర్డు సభ్యుడు కే.శశికుమార్ నివాసంపై ఆందోళనకారులు పెట్రోబాంబులు విసిరారని పోలీసులు తెలిపారు. పాతానంతిట్టలోని అదూర్‌లోని మొబైల్ షాపుపై ఆందోళనకారులు పేలుడు పదార్థాలు విసిరారన్నారు. తరుచుగా రాజకీయపరంగా బీజేపీ, సీపీఎం శ్రేణుల మధ్య ఘర్షణలు చోటుచేసుకునే కన్నూర్‌లో నాలుగు పెట్రోబాంబుల దాడి ఘటనలు జరిగాయన్నారు. ఈ దాడిలో ఎవరూ గాయపడలేదని సుమారు 200మందిని అరెస్టు చేశామన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు కన్నూర్‌లోని స్థానిక బీజేపీ కార్యాలయానికి నిప్పు పెట్టారని పోలీసులు తెలియజేశారు. పాతానంతిట్ట, కన్నూర్, కోజీకోడ్, తిరువనంతపురంలో బీజేపీ, సీపీఎం కార్యకర్తలు పరస్పరం వారి నివాసాలపై రాళ్లు రువ్వుకున్నారన్నారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ కానాన్లు, లాఠీలు ఉపయోగిస్తాన్నారని అన్నారు.

సురవరం అన్నారు.ఈ నెల 8, 9 తేదీలలో దేశంలోని ట్రేడ్ యూనియన్లు ఇచ్చిన సమ్మె పిలుపునకు సీపీఐ పూర్తి మద్ధతిస్తుందని సురవరం ప్రకటించారు. బీసీలకు పెద్ద పీట వేస్తున్నానని డబ్బా కొడుతున్న సీఎం కేసీఆర్ బీసీల హక్కులను కాలరాస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్‌ల విషయంలో బీసీలు ఆందోళన చెందుతుంటే కేసీఆర్ నోరు విప్పకపోవడం బాధాకరమన్నారు. పంచాయతీ ఎన్నికలు నిరసనల మధ్య జరుగుతున్నాయన్నారు.సుప్రీంకోర్టు తీర్పును కేరళ ప్రభుత్వం అమలు చేస్తుంటే హిందూత్వ శక్తులు కేరళ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చి రెచ్చగొడుతున్నాయని సీపీఐ తెలంగాణ రాష్ట్ర శాఖ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. జనవరి 1 వ తేదీన శబరమలైప సుప్రీం తీర్పునకు మద్ధతుగా లక్షలాది మంది మహిళలు కేరళలో 620 కిలోమీటర్ల పొడవునా మానవహారం నిర్మించి సాంఘిక దురాచారాన్ని రూపుమాపాల్సిన అవసరాన్ని చాటిచెప్పారన్నారు.

అయ్యప్పను దర్శించుకున్న శ్రీలంక మహిళ



శబరిమల ఆలయంలోకి ఇద్దరు మహిళలు ప్రవేశించడంపై చెలరేగిన అల్లర్లు చల్లారక ముందే మరో మహిళ గురువారం అయ్యప్పను దర్శించుకున్నారు. అయ్యప్పను దర్శించుకున్న మహిళను శ్రీలంకకు చెందిన శశికళగా పోలీసులు గుర్తించారు. ఆమె పాస్‌పోర్టులో పుట్టిన తేదీ డిసెంబర్ 3, 1972న జన్మించినట్టు నమోదై ఉంది. శశికళతోపాటు ఆమె బంధువులు కూడా వచ్చారని, రాత్రి 9.30కి దర్శనం పూర్తి చేసుకుని తిరిగి 11గంటలకు క్షేమంగా పంబకు చేరుకున్నారని పోలీసులు తెలిపారు. పోలీస్‌ల పర్యవేక్షణలో ఆమె దర్శనం చేసుకున్నారని తెలిపారు. శశికళకు, ఆమె బంధువులకు భద్రత కలిపించేందుకు పోలీసులు మఫ్టీలో వెళ్లినట్టు సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించారు.

కేరళలో హింస వెనుక కేంద్రం

కేరళలో జరుగుతున్న హింసాత్మక ఘటనల వెనుక కేంద్ర ప్రభుత్వ ప్రమేయం ఉందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. శబరిమలలో ఆర్ఎస్ఎస్ శృతి మించి వ్యవహరిస్తోందని, ఆర్ఎస్ఎస్ వెనకాల కేంద్రం ఉందన్నారు. శబరిమలలో మొదట్లో మహిళలకు ప్రవేశం ఉండేదన్నారు. కేరళలో జెండర్ సమానత్వం కోసం ప్రజాస్వామికమైన పోరాటం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీపై సురవరం విరుచుకు పడ్డారు. నాలుగున్నర సంవత్సరాలలో ప్రధాన మంత్రి ఒక్కసారి కూడా ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు.నీతికి, నిజాయితీకి మారుపేరని పేర్కొంటున్న ప్రధాని నరేంద్ర మోడీ రాఫెల్‌పై జేపీసీ వేయక పోవడంతో ఆయన నిజాయితీ ఏ పాటిదో అర్థమవుతుందని

అల్లర్లలో రాజకీయ కోణం



కేరళలోని అయ్యప్ప భక్తుల మనోభావాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, ఇందులో తెలియని రాజకీయ కోణం కనబడుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత విజయశాంతి అనుమానం వ్యక్తం చేశారు. తరతరాలబడి కొనసాగుతున్న విశ్వాసాలపైన ఎవరైనా ఆలోచించి , ఆచి తూచి వ్యవహారించాలని శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీకి హిందువుల మనోభావాలపైన ఎలాంటి ప్రేమ లేదన్నారు. దేశంలో ప్రజల మధ్య అలజడులు సృష్టించి లబ్ది పొందాలని బీజేపీ నేతలు చూస్తున్నారని విజయశాంతి విమర్శించారు. ఈ దేశంలోని దైవ భక్తులపై బీజేపీకి పెటెంట్ హక్కు ఏమి లేదన్నారు. అలజడులను రెచ్చగొట్టే అధికారం కమ్యునిష్టు పార్టీకి కూడా లేదన్నారు. ఈ పరిణామాలు ప్రజల మధ్య విద్వేశాలకు దారి తీస్తాయని, ఇది చరిత్ర చెబుతున్న సత్యమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని ఆమె కోరారు.



మా ఊరు - మా రాజ్యం

పోలింగ్ తకరారు

ఓటర్లు గ్రామాల్లో... పోలింగ్ పునరావాస కేంద్రాల్లో...

• మిడ్‌మానేరు ముంపు పంచాయతీల్లో కొత్త సమస్య • పాత గ్రామాల వారీగా ఓటర్ల జాబితాలు • సగం మంది అక్కడే.. తరలివచ్చినవారు కొందరే • ఎన్నికలు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లోనే.. • అక్కడొద్దంటున్న జనం



కరీంనగర్, ప్రభన్యూస్‌బ్యూరో: కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా మధ్యలో మానేరువాగుపై నిర్మించిన మిడ్ మానేరు ముంపు గ్రామాల ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో కొత్త చిక్కును ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను ముంపు గ్రామాల పునరావాస కేంద్రాలైన ఆర్ అండ్‌ఆర్ కాలనీలలో నిర్వహించేందుకు ఎన్నికల అధికా రులు సిద్ధమైనారు. ఈ మేరకు ఓటర్ల జాబి తాను కూడ సిద్ధం చేశారు. అయితే కొత్త సమస్య ఇక్కడ వచ్చి పడింది, చాలా గ్రామాలు పూర్తిగా ఖాళీ కాలేదు, కొన్ని చోట్ల 50 శాతం మంది మాత్రమే పునరావాస కేంద్రాలకు వచ్చా రు. చాలా మంది ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. ఓటరు జాబితా మాత్రం పాత గ్రామాల వారిగా సిద్ధం చేసి ఎన్నికల ను ఆర్ అండ్ ఆర్ కాలనీలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా రు. చాలా మంది గ్రామస్తులు ఎన్నికల నిర్వహణను పాత పంచాయతీలలో నిర్వహించాలని, లేకుం టే ఓటింగ్ శాతం గణనీయంగా తగ్గే అవకాశం ఉందంటు న్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలకు ఇంకా తమతమ గ్రామాల పేర్లను కూడ నామకరణం చేసుకోలేదు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది, పలు కాలనీలలో ఇళ్ల నిర్మాణం పూర్తయినా గృహప్రవేశాలు కాలేదు.

13 గ్రామాలలో సమస్య

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో మిడ్‌మానేరు ప్రాజెక్టును రూప కల్పన చేశారు. ప్రాజెక్టు పనులు చివరిదశకు చేరుకున్నాయి. ప్రాజెక్టు క్రింద 13 గ్రామాలు ముంపు ప్రభావానికి లోన య్యాయి. కాగా ఇందులో 10 గ్రామాలు శాశ్వతంగా ముంపునకు గురవుతున్నాయి. ఇందులో అనుపురం, సంకెపల్లిలు మినహాయిస్తే సిరిసిల్ల మండలం పరిధిలోని చింతల ఠానా, చీర్లవంచ, బోయినపల్లి మండలం పరిధిలోని కొదురుపాక, నీలోజిపల్లి, వర్దవెల్లి, శాబాష్‌పల్లి, వేములవాడ మండలం పరిధిలోని రుద్రారం, కొడిముంజ గ్రామాలు ఉన్నాయి. పది గ్రామా ల్లో కలిపి ముంపు కారణంగా 6,829 కుటుంబాలకు పరిహారం చెల్లించారు.

- బోయినిపల్లి మండలం నీలోజిపల్లి, కొదురుపాక గ్రామాలు పూర్తిగా ఖాళీ అయి పునరావస కేంద్రాలకు తరలివెళ్లాయి. వర్దవెల్లిలో ఇంకా 30శాతం ఖాళీ కావలసి ఉంది. శాబాష్‌పల్లిలో ఇంకా 40 శాతం ఖాళీకావలసి ఉంది. చీర్లవంచ, చింతలఠానాలో ఇంకా 40 శాతం మంది ఖాళీ చేయ వలసి ఉంది. కొడిముంజ, రుద్ర వరంలో 50 శాతం ఖాళీకావలసి ఉంది. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో కూడ గృహనిర్మాణాలు మొత్తం గా 50 శాతం మాత్రమే పూర్తయినాయి.

20 శాతం ఓట్లు గల్లంతు

ఈ క్రమంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ లలో ఎన్నికల నిర్వహణ కష్టత రం కానుంది, ముం దుగా గ్రామాల ఓటర్ల జాబితాను సరిచేయగా 20 శాతం ఓటర్ల పేర్లు తొలగి పోయా యి. చాలా మంది ఆర్ అండ్ ఆర్ కాలనీ లలో గృహాలు నిర్మిం చుకుం టున్నా, ఇక్కడ ఉండేవారు తక్కువమంది కావడంతో ఇతర ప్రాంతా ల నుంచి వచ్చి ఓటింగ్‌లో పాల్గొనడం కూడ అనుమానంగానే ఉంటుం ది. స్వంత గ్రామంలో ఉండే పరిస్థితికి ఆర్ అండ్ ఆర్ కాలనీలలో ఉండే పరిస్థితికి, ఆ ఫీలింగ్‌కు తేడాలు ఉండే అవకాశం ఉండటం, తమ గ్రామాలు వదలిపెట్టి పోయా మనే మనోవేదన తోడవుతుం డటంతో ఇక్కడ ఉత్సాహవాతా వరణంలో ఎన్నికలు జరుగడం అను మానంగానే ఉంది.



తాగునీటికి కటకట

ప్రధానంగా ముంపు గ్రామ స్తులు గ్రామాల నుంచి తరలివెళ్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో నివాస ముంటు న్నవారు తాగునీటి సమస్యను తీవ్రంగా ఎదు ర్కొంటున్నారు. మిడ్‌మానేరు కోసం గ్రామాలను వలుకు న్నవారు నేడు తలాపునే ప్రాజెక్టు ఉన్నా తాగునీటి సమస్య ఎదు ర్కొంటున్నారు. ఏడు నుంచి 800 అడుగులు బోర్ వేసినా నీటి లభ్య తలేకుండా పోతుం ది, ఆర్‌డ బ్ల్యుఎస్ వారు కాలనీలో తాగునీటి సమస్యను అదిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు, ఈ తాగునీటి సమస్య కూడ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. ఇందిరా అవాస్ యోజన క్రింద రూ. లక్షా 20 వేల వరకు అందిస్తామని ఇంతవరకు ఇవ్వలేదు, కనీసం ఆ దిశగా ముందుకు సాగకపోవడంపై కూడ ముంపు గ్రామాల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు.

జోర్‌పూర్ @151

అతి తక్కువ ఓటర్లున్న పంచాయతీ

• గ్రామ జనాభా 250 మంది • ఆ గ్రామంలో 151 మందే ఓటర్లు • 91 మంది మహిళలు.. పురుష ఓటర్లు 60 మంది • ఒక సర్పంచ్, నలుగురు వార్డు మెంబర్లు • తొలిసారి ఎన్నికలకు సిద్ధం



నిజామాబాద్ సాంస్కృతికం, ప్రభన్యూస్ : పరిపాలన సౌలభ్యం కోసం హామ్లెట్ గ్రామాలను, తండాలను ప్రభుత్వ గ్రామపంచాయతీలుగా మార్చింది. కొత్త గ్రామపంచాయతీ ఏర్పాటు చేయడానికి కనీసం జనాభా 500లకు పైగా ఉండాలనే నిబంధన తప్పనిసరిగా పాటించాలనే ఆదేశాలు ఉన్నాయి. కానీ నిజామాబాద్ జిల్లాలో కొత్తగా ఏర్పాటైన ఓ గ్రామంలో జనాభా కేలవం 250 మంది మాత్రమే. కనీస సౌకర్యాలు లేని ఆ గ్రామంలో మాత్రం ఒక ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు నామమాత్రంగా ఉన్నాయి. ఇదంతా ఒకవైపు అయితే గ్రామపంచాయతీ ఎన్నికలు రావడంతో ఆ గ్రామం అందరి నోళ్లల్లో నానుతోంది. నిజామాబాద్ జిల్లా, నందిపేట్ మండలంలోని అతి చిన్న గ్రామం జోర్‌పూర్ కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటు కు ముందు కుద్వాన్‌పూర్ గ్రామానికి జోర్‌పూర్ హామ్లెట్ గ్రామంగా ఉండేది. అధికారులు ఏం ఆలోచించారో ఎందుకు గ్రామ పంచాయతీగా మార్చారో తెలియదు గానీ ఒక తాండలో ఉన్నంతగా జనాభా, ఓటర్లు లేని పరిస్థితి. కనీస సౌకర్యాలు లేని దుస్థితి అలాంటి గ్రామంలో తొలిసారి మొదటి దశలో పంచాయతీ ఎన్నికలు జరగబోతున్నాయి.

250 మంది జనాభా ఉన్న జోర్‌పూర్ గ్రామంలో కేవలం 151 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. గ్రామాన్ని నాలుగు వార్డులుగా ఏర్పాటు చేశారు. ఒక సర్పంచ్‌తో పాటు కేవలం నలుగురు వార్డు మెంబర్‌లు ఉంటారు. ఇందులో నుంచి ఉపసర్పంచ్‌ను ఎన్నుకుంటే ఇక మిగిలేది ముగ్గురు వార్డు మెంబర్లు మాత్రమే. ఇదిలా ఉంటే 151 మంది ఓటర్లలో 60 మంది పురుషులు, 91 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో అతి చిన్న గ్రామ పంచాయతీగా జోర్‌పూర్ ఉండగా రాష్ట్రంలో కూడా అతి చిన్న గ్రామ పంచాయతీల్లో జోర్‌పూర్ మొదటిస్థానంలో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో 4, 30 జిల్లాలో 70 నూతన పంచాయతీలుగా ఏర్పడ్డాయి. ఇందులో జోర్‌పూర్ అతిచిన్న గ్రామంగా త్వరలోనే రికార్డులకు ఎక్కబోతోంది.



కనీసం రేషన్ దుకాణం లేదు

250 మంది జనాభా ఉన్న హామ్లెట్ గ్రామం జోర్‌పూర్ ను గ్రామపంచాయతీగా మార్చడం పట్ల అప్పట్లో తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఇప్పటికీ ఆ గ్రామంలో రేషన్ దుకాణం కూడా లేదు. ఉన్న ప్రాథమిక పాఠశాలలో కనీసం ఐదుగురు విద్యార్థులు కూడా ఉండరు. అంగన్‌వాడీ సెంటర్ అసలు తెరుచుకోదు. ఎప్పుడో అంగన్‌వాడీ సిబ్బంది వచ్చిపోతుంటారు. ఇలాంటి జోర్‌పూర్ గ్రామం తొలిసారి ఎన్నికలకు జోర్దార్‌గా సిద్ధమైంది.

సర్పంచ్‌గా పోటీకి పలువురు

గ్రామంలో ఓటర్లు కేవలం 151 మంది అయినప్పటికీ జోర్‌పూర్ గ్రామ సర్పంచ్ పదవి కోసం పలువురు పోటీకి సిద్ధం అంటున్నారు. అయితే గ్రామం చిన్నగా ఉండ టంతో తొలిసారి ఏకగ్రీవంగా ఎన్నుకుం దామని ప్రజలు తీర్మానించు కుంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఏడే దేవేందర్ డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ప్రజాసేవ చేయాలని ఆలోచనతో ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చాడు. ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గ్రామస్థులను కోరారు. అతిచిన్న గ్రామపంచాయతీలు కూడా సర్పంచ్ పదవికి పోటీ ఉండడం గమనార్హం.





పంచాయతీ కథలు 2

అధికార వికేంద్రీకరణే లక్ష్యంగా..!

గ్రామ పరిపాలన, స్వపరిపాలన గురించి రాజ్యాం గంలో కేవలం ఒక ప్రకటన రూపంలో మాత్రమే ఉండేది. 40వ అధికరణలో ప్రస్తావించిన గ్రామ స్వరాజ్యానికి బల్వంత్ రాయ్ కమిటీ మూడంచెల రూపం ఇచ్చింది. ఆనాటి మూడంచెల పంచాయతీ వ్యవస్థ తొలి రూపాన్ని మొదటగా రాజస్థాన్ అమలు చేసింది. తరువాత ఆంధ్రప్రదేశ్, తమిళ నాడు రాష్ట్రాలు పంచాయతీ వ్యవస్థను ప్రారం భించగా మిగి లిన రాష్ట్రాలు కూడా అదే దారిలోకి వచ్చాయి. పంచాయతీరాజ్ వ్యవస్థను మెరుగుదిద్దడానికి 1959 నుంచి 1988 మధ్య కాలంలో పలు కమిటీలను నియమించారు. ఆయా కమిటీలు చేసిన సిఫార్సుల మేరకు చివరికి 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా నేటి పంచాయతీ రాజ్యం సాకారమైంది.

పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం రాష్ట్రాలు గ్రామ స్వపరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుం ది. ఇందులో భాగంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో స్వపరిపాలనా వ్యవస్థను నెలకొల్పాల్సి ఉంటుంది. గ్రామస్థాయిలో పంచాయతీ పెద్దగా సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. ఈ పంచాయతీ గ్రామస్థాయిలో పార్లమెంటులాగా వ్యవరిస్తుంది. గ్రామంలోని వయోజనులంతా ఈ పంచాయతీ నిర్ణయాలను ప్రభావితం చేసే హక్కు కలిగి ఉంటారు. గ్రామ పంచాయతీ ఒక ప్రణాళిక రూపొందించుకోవడానికి, దానికి ఆమోద ముద్ర వేయడానికి, గ్రామాభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించడానికి పంచాయతీకి సంపూర్ణ హక్కులు ఉంటాయి. ఇక దీంతో పాటు 1996లో షెడ్యూల్ ప్రాంతాల పంచాయతీ చట్టాన్ని తీసుకొచ్చారు. దీంతో గిరిజనులు, ఎస్సీలు అధికంగా నివసించే ప్రాంతాల్లో పరిపాలనలో ఆయా వర్గాలకే రిజర్వు చేయడం మొదలైంది.

ఈ రెండూ కీలకం!

పంచాయతీ రాజ్ ఏర్పాటులో రెండు కీలక అంశాలు ప్రధానంగా పని చేశాయని చెప్పాలి. ఒకటి, అధికార వికేంద్రీ కరణ ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం సాధ్యమవుతుంది. సమాజంలోని వివిధ వర్గాల మరీ ముఖ్యంగా మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఈ పంచాయ తీ రాజ్ వ్యవస్థ ద్వారా నెరవేరుతుంది. ఇక ఆయా గ్రామ అవసరలకు తగిన రీతిలో నిధులను వ్యయం చేయడం, అభివృద్ధి పనులను నిర్ణయించుకోవడం ద్వారా గ్రామస్థుల అవసరాలు తీరుతాయి. పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్మాణం కోసం ఆనాడు వేసిన ఈ పునాదులపై ప్రజాస్వామ్య సౌధం బలంగా నిర్మితమైంది.

క్షేత్రస్థాయికి ప్రజాస్వామ్య వికేంద్రీకరణ

పంచాయతీ ఎన్నికలను క్రమం తప్పకుండా, స్వేచ్ఛా యుత, పారదర్శక వాతావరణంలో నిర్వహించడం కీలకం. అయితే కొన్ని రాష్ట్రాల్లో పంచాయతీ ఎన్నికలు హింసాత్మ కంగా మారడం, మరికొన్ని చోట్ల శాంతి భద్రతల పరిస్థితి తలెత్తుతోంది. ఇక దేశంలో 2,49,016 గ్రామ పంచాయతీలు, 606 జిల్లా పరిషత్‌ల ద్వారా ప్రజాస్వామ్య వికేంద్రీకరణ జరుగుతోంది. 19 రాష్ట్రాలు మాత్రం పంచాయతీల్లో యాభై శాతం మహిళలకు రిజర్వు చేయడం విశేషం. తాజా గణాం కాల ప్రకారం పంచాయతీ రాజ్ వ్యవస్థలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు 30 లక్షలమంది ఉండగా వారిలో షెడ్యూల్డ్ కులా లకు చెందిన వారు 19 శాతం, షెడ్యూల్డ్ ట్రైబ్‌కి చెందిన వారు 12 శాతం, 46 శాతం మహిళలు ఉన్నారు. పంచాయతీ రాజ్ ద్వారా దేశంలో రాజకీయ వ్యవస్థ అట్టడుగు స్థాయి కూడా చేరింద నడానికి ఈ గణాంకాలే నిదర్శనంగా నిలుస్తాయి.

గెలుపు గుర్రాల కోసం వేట

• భద్రాద్రి కొత్తగూడెం పంచాయతీ
• 479 పంచాయతీల్లో రిజర్వేషన్లు ఖరారు

భద్రాద్రి కొత్తగూడెం, ప్రభన్యూస్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పంచాయతీ ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ఖరారు చేయడంతో అన్ని రాజకీయ పార్టీల నేతలు మెజార్టీ స్థానాలలో విజయం సాధించేందుకు బలమైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఎన్నికల్లో అధికార తెరాస ఒంటరిగా బరిలో దిగుతుండగా, మహాకూటమి, సీపీఎం, భాజపా, న్యూడెమోక్రసీ పార్టీలు తమ అభ్యర్థులను బరిలో నిలిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని 479 గ్రామ పంచాయతీల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఇందులో షెడ్యూల్ ఏరియాలోని 227 పంచాయతీలను ఎస్టీ జనరల్‌కు, మరో 227 ఎస్టీ మహిళలకు కేటాయించారు. నాన్ షెడ్యూల్ ఏరియాలోని 25 గ్రామ పంచాయతీలలో ఎస్టీ జనరల్‌కు నాలుగు, ఎస్టీ మహిళలకు ఐదు, ఎస్సీ జనరల్ రెండు, ఎస్సీ మహిళలకు మూడు, 11 జనరల్ స్థానాలలో ఐదు పురుషులకు, ఆరు మహిళలకు ఖరారయ్యాయి. అదే విధంగా జిల్లాలోని 21 మండలాల్లోని 479పంచాయతీలలోని 4,232 వార్డులు ఉండగా వీటికి కూడా రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఇందులో షెడ్యూల్ ఏరియాలోని ఎస్టీ మహిళలకు 1988 వార్డులు, ఎస్టీ జనరల్‌కు 1994, నాన్ షెడ్యూల్ ఏరియాలోని ఎస్టీ జనరల్‌కు 25, ఎస్టీ మహిళలకు 39, ఎస్సీ మహిళలకు 16, ఎస్సీ జనరల్‌కు 15, బీసీ జనరల్‌కు పది, బీసీ మహిళలకు 20, 125 జనరల్ స్థానాలలో 50 మహిళలకు, 75 జనరల్‌కు ఖరారయ్యాయి. జిల్లాలో 5లక్షల 51వేల 466 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 2లక్షల 72వేల 828మంది, మహి ళలు 2లక్షల 78వేల 588మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 4వేల 232 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 మండలాలు ఉండగా కొత్తగూడెం, భద్రాచలం మునిసిపాలిటీ లు మినహా మిగిలిన 21 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మండలాల్లో మూడు విడతలుగా జరగనున్న ఎన్నికల్లో ఒక్కో విడతలో ఏడు మండలాలకు ఎన్ని కలు నిర్వహించేందుకు ఎన్నికల కమిష న్ షెడ్యూల ఖరారు చేసింది. మొదటి విడతలో ఏడు మండలాల్లోని 174 పంచాయతీలకు 1534 వార్డులు, రెండో విడతలో ఏడు మండలాల్లోని 142 గ్రామ పంచాయతీలు 1294 వార్డులు, మూడో విడతలో ఏడు మండలాల్లోని 163 గ్రామ పంచాయతీలు 1404 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడతలోని అశ్వాపురం 24, బూర్గంపాడు 17, చర్ల 25, దుమ్ముగూడెం 37, మణుగూరు 14, పాల్వంచ 36, ములకలపల్లి 26 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండో విడతలో అన్నపురెడ్డిపల్లి పది, చండ్రు గొండ 14, కరకగూడెం 16, పినపాక 23, అశ్వారావుపేట 30, దమ్మపేట 31, చుంచుపల్లి 18 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించ నున్నారు. మూడో విడతలో లక్ష్మీదేవిపల్లి 31, సుజాతనగర్ 20, జూలూరు పాడు 24, టేకులపల్లి 36, ఇల్లెందు 29, ఆళ్లపల్లి 12, గుండాల 11 పంచాయ తీలకు ఎన్నికలు నిర్వహిం చనున్నారు. మొదటి ఎన్నికలకు సంబం ధించి ఈ నెల 7న నోటిఫి కేషన్ జారీ చేయనున్నారు. రెండో విడత ఎన్నికలకు సంబంధించి జనవరి 11న, మూడో విడతకు సంబంధించి జనవరి 16న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఎన్నికల నిర్వహణకు గాను జిల్లా వ్యాప్తంగా 4,232 మంది ప్రొసైడింగ్ అధికారులను, వారితో పాటు అదనంగా మరో 423మందిని అందుబాటులో ఉంచనున్నారు. 4,676మంది అసిస్టెంట్ ప్రొసైడింగ్ అధికారులను నియమించగా, మరో 467మందిని రిజర్వులో ఉంచనున్నారు.



4 ఏళ్లలో 38,059 పోస్టులకు నోటిఫికేషన్లు

• గవర్నర్‌తో టీఎస్‌పీఎస్సీ సభ్యుల భేటీ
• కమిషన్ చేపట్టిన నియామకాలపై వివరణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) గత 4 ఏళ్లుగా కమిషన్ చేపట్టిన నియామకాలపై తెలుగు రాష్ట్రా ల ఉమ్మడి గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసిం హన్‌కు వివరించారు. శుక్రవారం గవర్నర్‌ను కలిసిన వారిలో కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, కార్యదర్శి వాణి ప్రసాద్‌తోపాటు సభ్యులు సీ విఠల్, చంద్రావతి, ఎండీ మతీ నుద్దీన్, రాంమోహన్‌రెడ్డి, సాయిలు తదితరులు ఉన్నారు. 4 సంవత్సరాల్లో మొత్తం 38,059 పోస్టుల భర్తీ కోసం 101 నోటిఫికేషన్లను జారీ చేసినట్టు కమిషన్ చైర్మన్ గవర్నర్‌కు తెలిపారు. ఇప్పటి వరకు 17,038 పోస్టులకు భర్తీ చేశారు. ఇవి కాకుండా 13,775 పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్టును ఇప్పటికే ప్రకటించినట్టు తెలిపారు. టీఎస్‌పీఎస్సీ పోస్టుల భర్తీ కోసం చేసిన కృషిని అభినందించినట్టు తెలిపారు.

ఆన్‌లైన్‌లో శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు

తిరుమల, ప్రభ న్యూస్: శ్రీవారి అర్జిత సేవలకు సంబంధించి ఏప్రిల్ నెల కోటాలో మొత్తం 63,311 టికెట్లను శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఆన్‌లైన్ డిప్ విధా నంలో 10,061 సేవా టికెట్లు విడుదల చేశామని ఇందులో సుప్రభాతం 7,836, తోమాల 130, అర్చన 130, అష్టదళపాదపద్మారాధన 240, నిజపాద దర్శనం 1,725 టికెట్లు ఉన్నాయని ప్రకటించారు. ఆన్‌లైన్ జనరల్ కేటగిరిలో 53,250 సేవా టికెట్లు ఉండగా వీటిలో విశేష పూజ 2,500, కల్యాణం 11,875, ఊంజల్‌సేవ 3,750, అర్జిత బ్రహ్మోత్సవం 6,875, వసంతోత్సవం 12,650, సహస్రదీపాలంకార సేవ 15,600 టికెట్లు ఉన్నాయని వివరించారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో జేఎన్‌టీయూ వీసీ వేణుగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వక భేటీ



గిరిజన తండా పంచాయతీలన్నీ ఏకగ్రీవం కావాలి

- రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ ధరావత్ మోహన్ గాంధీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గిరిజనులకు రిజర్వు అయిన గ్రామపంచాయితీలన్నీ ఏకగ్రీవం అయ్యే విధంగా ఆయా గ్రామ నాయకులు, యువత చొరవ చూపాలని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ ధరావత్ మోహన్ గాంధీ నాయక్ కోరారు. సిరిసిల్లా జిల్లాలోని లక్ష్మీపూర్ తండా పంచాయితీకి సర్పంచ్‌గా లాక్‌వత్ మంజులను ఆ గ్రామప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షదాయకమన్నారు. లక్ష్మీపూర్ తండా మాదిరిగా రాష్ట్రంలోని గిరిజన పంచాయితీలన్నీ ఏకగ్రీవం అయ్యే విధంగా ప్రయత్నించాలన్నారు. పంచాయితీ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైతే రూ.10 లక్షల నజరానతో పాటు, సంబంధిత నియోజకవర్గం ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.20 లక్షల వరకు గ్రామాభివృద్ధి గ్రాంట్స్ వచ్చే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. గిరిజన తండాలు, కోయ, గొండు, చెంచుపెంటలను ప్రత్యేక గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి కెసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో గిరిజనులకు రిజర్వుడు అయిన 3146 గ్రామ పంచాయితీలు నూటికి నూరు శాతం ఏకగ్రీవం కావల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన వెల్లడించారు.

సర్పంచ్ నుంచి సచివునిగా...

మాజీ మంత్రి రెడ్యానాయక్ ప్రస్థానం

- 1981లో ఏకగ్రీవ సర్పంచ్
- కుగ్రామంలో రాజకీయ ఆరంగేట్రం
- పంచాయతీ పాఠాలతో మంత్రిగా రాణింపు

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : అదో మారుమూల కుగ్రామం. అక్కడ అందరు గిరిజనులే నివసిస్తున్నారు. ఆ గ్రామం నుంచి పట్టభద్రుడైన యువకుడు కొత్తగా రాజకీయాలలో అడుగిడినాడు. 1976లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా రాజకీయ ప్రస్తానాన్ని ప్రారంభించి 1981లో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. రాజకీయాలలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఆయనే దరంసోత్ రెడ్యానాయక్. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన గిరిజన బిడ్డ రెడ్యానాయక్. 1981లో జరిగిన పంచాయతీ ఎన్నికలలో ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1981 మే 27 సర్పంచ్‌గా ఎన్నికైన నెల రోజులకే మరిపెడ సమితికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సర్పంచ్ పదవికి రాజీనామా చేసి సమితి అధ్యక్షుడిగా కొనసాగారు. ఎన్‌టీ రామారావు హయాంలో 1983లో మండల వ్యవస్థ వచ్చిన విషయం తెలిసిందే. 1984లో జరిగిన మండల పరిషత్ ఎన్నికలలో మరిపెడ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఐదు సంవత్సరాల ఎంపీపీ పదవీ కాలం పూర్తి కాక ముందే డోర్నకల్ ఎమ్మెల్యేగా 1989లో గెలిచారు. వరుస విజ యాలతో ముందుకు వెళ్తున్న రెడ్యానాయక్‌కు 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రి వర్గంలో గిరిజనశాఖ మంత్రి పదవి దక్కింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం మంత్రి రేసులో ఉన్నారు.



ఉగ్గంపల్లి గ్రామ పంచాయతీ

కొత్తగా 84 పంచాయతీలు

డోర్నకల్ నియోజకవర్గంలోని ప్రతి తండాను గ్రామ పంచాయతీగా చేసుకోవడంలో రెడ్యానాయక్ సక్సెస్ అయ్యారు. గతంలో 87 గ్రామ పంచాయతీలు ఉండగా వాటికి అదనంగా 84 కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయించుకున్నారు. 300 నుంచి 500లు అంతకన్నా ఎక్కువ జనాభా కలిగిన తండాలన్నింటిని కొత్త పంచాయతీలుగా చేయించారు. అంతేకాకుండా తన స్వగ్రామం ఉగ్గంపల్లి చిన్నగూడూరుకు శివారులో ఉంటుంది. రెడ్యానాయక్ పట్టుబట్టి 5 గ్రామ పంచాయతీలతో చిన్నగూడూరు మండలాన్ని చేసుకోగలిగారు. ప్రస్తుతం ఇక్కడ కొత్తగా మరో 5 పంచాయతీలను చేయించారు. నియోజకవర్గంలోని ప్రతి తండాకు, ప్రతి గ్రామానికి బిటి రోడ్డు నిర్మాణం చేయించిన ఘనత రెడ్యాకే దక్కుతుంది.



సర్పంచ్ వైభవం మరచిపోలేను

రెడ్యానాయక్, మాజీ మంత్రి

తాను ఉగ్గంపల్లి గ్రామానికి సర్పంచ్‌గా పనిచేసింది కేవలం నెల రోజులు మాత్రమే. అయినా తనకు జీవితంలో మరుపురాని మధురస్మృతులను మిగిల్చింది. తాను డిగ్రీ పూర్తి చేసిన తరువాత గ్రామంలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా 1976 రాజకీయ జీవితాన్ని ప్రారంభించాను.1981 మే27న మొట్టమొదటిసారి తనకు సర్పంచ్‌గా రాజకీయ ప్రాతినిధ్య పదవి దక్కింది. అది తనకు రాజకీయంగా ప్రజాప్రాతినిధ్యంలో ఎక్కిన తొలిమెట్టు...అందుకే ఆరోజును నేను ఎన్నటికి మరచిపోలేను. సర్పంచ్‌గా పనిచేసింది నెల రోజులే అయినా ప్రజ లలో రెడ్యా నాయక్ సర్పంచ్ అనే ముద్రపడిందన్నారు. సర్పంచ్ తరువాతనే సమితి అధ్యక్షుడిగా, మండలపరిషత్ అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశాను.



కొండ కోనల్లో కొత్త జోష్

అటవీ ప్రాంతాల్లో స్థానిక ఎన్నికల సంరంభం

- రంగారెడ్డి జిల్లాలో కొత్త పంచాయతీలుగా 60 తండాలు
- 32 గిరిజనులకే రిజర్వు
- వికారాబాద్ జిల్లాలో 84 పంచాయతీలు వారికే
- ఎన్నడూ లేని ప్రాధాన్యం.. గిరిసీమల్లో ఆనందం
- మేడ్చల్‌లో 61 పంచాయతీలు.. ఎస్టీలకు 4 సర్పంచ్ పదవులు

రంగారెడ్డి, ప్రభన్యూస్ :ఎన్నడూ లేని ప్రాధాన్యత దక్కడంతో అటవీప్రాంతాల్లోని తండాల్లో పంచాయతీ ఎన్నికల సంరంభం కనిపిస్తోంది. చిన్నచిన్న తండాలను కూడా పంచాయతీలుగా గుర్తిస్తూ ఎక్కువ జనాభా ఉన్నపక్షంలో ఆ పంచాయతీలను గిరిజనులకే రిజర్వు చేయడం ఈసారి కొత్త పరిణామం. అవికాక ప్రత్యేకంగా ఎస్టీలకు కేటాయించిన పంచాయతీలూ ఉండనే ఉన్నాయి. దీంతో అడవిబిడ్డల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాజ్యాధికారం చేజిక్కబోతోందన్న సంబరం వారిలో కనిపిస్తోంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఈసారి గిరిజనులకు ఎంతో ప్రాధాన్యత దక్కింది. ఆదిలాబాద్‌లా పూర్తిస్థాయి అడవులు లేకపోయినప్పటికీ... అటవీ ప్రాంతాలకు దగ్గరలో ఉన్న తండాలకూ ఈ గుర్తింపు లభించడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గిరిపుత్రుల్లో కొత్త జోష్ కనిపిస్తోంది. ఈ మార్పు వల్ల ఈసారి మెజార్టీ పంచాయతీల్లో వీరే ప్రజాప్రతినిధులుగా మారనున్నారు. గతంలో వారికి రిజర్వు చేసిన పంచాయతీల్లో మాత్రమే సర్పంచులుగా విజయం సాధించేవాళ్లు. ఈసారి తండాలు పంచాయతీలుగా మారడంతో అవి కూడా వారి పాలన కిందకే రానున్నాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధిలో 197 పంచాయతీల్లో గిరిజనుల హవా కొనసాగనుంది. రంగారెడ్డి జిల్లాలో 560 పంచాయతీలున్నాయి. ఇందులో 60తండాలు కొత్తగా పంచాయ తీలయ్యాయి. వందశాతం గిరిజనులు ఉన్న పంచాయతీలు కావడంతో వారికే రిజర్వు చేశారు. దాంతోపాటు 32 పంచాయతీలు ఎస్టీలకు రిజర్వు చేశారు. జిల్లా పరిధిలో 92 పంచాయతీల్లో వారిదే అధికారం. వికారాబాద్ జిల్లా పరిధిలో 565 పంచాయతీలుండగా ఇందులో కొత్తగా 84 తండాలు పంచాయతీలుగా మారాయి.దానికితోడు 21 పంచాయతీలు ఎస్టీలకు రిజర్వు చేశారు. దీంతో జిల్లా పరిధిలో 105 పంచాయతీలు గిరిజనులు ప్రజాప్రతినిధులు మారనున్నారు. తండాలు పంచాయతీలుగా మారిన ప్రాంతాల్లో వార్డుమెంబర్లతోపాటు ఉప సర్పంచ్, సర్పంచ్ అంతా వారే. రెండు జిల్లాల పరిధిలోని తాండూరు,కొడంగల్, పరిగి, షాద్ నగర్ నియోజకవర్గాల పరిధిలో ఎక్కువగా ఎస్టీ జనాభా ఉంది. ఈ నియోజకవర్గాల పరిధిలోనే తండాలు పంచాయతీలుగా మారాయి.

వీటికితోడు ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి లోని శంషాబాద్ మండలంలో కొన్ని గ్రామాలు ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 21, 25, 30 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావ డంతో గ్రామాల్లో సందడి నెలకొంది. ముఖ్యంగా తండాల్లో అప్పుడే ప్రచారం కూడా ప్రారంభమైంది. ఊరికి రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే పంచాయతీల పరిధిలో ఉండే తమ గ్రామాలు నేడు పంచాయతీలుగా మారడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనుల కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఇకలేవు.

సగం పంచాయతీలు మహిళలకే...

స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వు చేసినందున జిల్లాలో సగం పంచాయతీల పరిధిలో మహిళల పాలన కొనసాగనుంది. గత ఎన్నికల్లోనే మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వు చేశారు. దీంతో గత ఎన్నికల్లో పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా సగం మంది మహిళలు ప్రజాప్రతినిధులుగా కొనసాగారు. ఈసారి కూడా సగం మంది మహిళలు ప్రజాప్రతినిధులుగా కొనసాగనున్నారు. ఇందులో చాలా మంది యువతులు, మహిళలు రాజకీయాల్లోకి వచ్చి ప్రజాప్రతినిధులుగా విజయం సాధించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములయ్యారు.



పంచాయతీ వ్యవస్థను బలహీన పరిచారు

- ఫిబ్రవరిలో జాతీయ బీసీ గర్జన
- టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు చిత్తరంజన్ దాస్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బీసీల రిజర్వేషన్లు కుదించి పంచాయితీరాజ్ వ్యవస్థను బలహీనపరిచారని టీపీసీసీ కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీమంత్రి జె.చిత్తరంజన్ దాస్ మండిపడ్డారు. స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్ల తగ్గింపే టిఆర్ఎస్ పార్టీ పతనానికి నాంది అని,కేసీఆర్ ముఖ్యమంత్రి పదవి నుంచి దిగేవరకు రాష్ట్రవ్యాప్తంగా బీసీలు ఉద్యమం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. బీసీలు సర్పంచ్ పదవులు చేపడితే.. భవిష్యత్‌లో ఎమ్మెల్యేలు అవుతారనే భయంతో వారిని అణచివేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. గతంలో కోట్ల విజయ భాస్కరరెడ్డి 34 శాతం, ఎన్టీ రామారావు 20 శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థలలో బీసీలకు కల్పించారని ఆయన తెలిపారు. ఆనాటి ముఖ్యమంత్రులు బీసీలకు అవకాశం కల్పించడంతో ఎందరో ఎమ్మెల్యేలుగా ఎదిగారన్నారు. సమగ్ర కుటుంబ సర్వేను ఒక్కరోజులో చేయించిన నేతలు బీసీ జనాభా లెక్కలను ఒక్కరోజులో చేయించలేరా? అని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో చిత్తరంజన్‌దాస్ అధ్యక్షతన టీపీసీసీ ఓబీసీ విభాగం కార్యనిర్వాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్నిజిల్లాల నుండి కాంగ్రెస్ ఓబీసీ విభాగం నేతలు పాల్గొన్నారు. ఈనెల 15 లోగా అన్ని జిల్లాల్లో జిల్లా, మండల, పంచాయితీ స్థాయిల్లో కాంగ్రెస్ ఓబీసీ కమిటీల అధ్యక్షులు నియామకాలు పూర్తి చేయాలని తీర్మానించారు. పంచాయితీ ఎన్నికల్లో మెజారిటీ అభ్యర్థులను గెలిపించుకోవాలని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికై కృషి చేయాలని అంజెండాలో రూపొందించారు. అనంతరం జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న చిత్తరంజన్‌దాస్ అజెండా అంశాలను వివరించారు.. ఫిబ్రవరి రెండవ వారంలో రాహుల్ గాంధీ అధ్యక్షతన ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో జరిగే జాతీయ బీసీ గర్జనకు రాష్ట్రం నుంచి ఓబీసీ జిల్లా కార్యవర్గాన్ని తీసుకెళ్ళాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓబీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించే విధంగా పార్టీని కోరడం, టీఆర్ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరాలు వంటి అంశాలపై తీర్మానం చేసినట్లు ఆయన చెప్పారు. ఢిల్లీలో జరిగే జాతీయ బీసీ గర్జనలో ఏఐసీసీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు, ఛత్తీస్‌గడ్ మంత్రి తమరద్వాజ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలను తక్కువ అంచనా వేస్తున్నారనీ, బీసీలందరూ గొర్రెలు పెంపకం, చేపలు పట్టడం వంటి వృత్తులను పక్కనపెట్టి, ఉన్నత చదువులతో ఉద్యోగాల బాట పట్టారని ఆయన తెలిపారు. బీసీ కులాల వృత్తులన్నీ వ్యాపారంగా మారిపోయాయని అన్నారు.



బీసీ సంఘాలపై విమర్శలు సరికాదు

- రిజర్వేషన్ల తగ్గింపుపై తెరాసలోని బీసీ నాయకులు సమాధానం చెప్పాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గించడంపై బీసీ సంఘాలు ఉద్యమిస్తున్నాయని... బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కొనసాగించే వరకు ద్యమం కొనసాగిస్తామని సంఘాల నేతలు స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై ఉద్యమిస్తున్నబీసీ సంఘాలపై టీఆర్ఎస్ పార్టీలోని కొందరు బీసీ నాయకులు విమర్శలు చేయడం తగదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. శుక్రవారం 12 బీసీ సంఘాల సమావేశం బీసీ భవన్‌లో జరిగింది. సమావేశంలో సంఘాల నాయకులు గొరిగే మల్లేష్ యాదవ్, టీఆర్ చందర్, నీల వెంకటేష్, ఉపేందర్ గౌడ్, సీ రాజేందర్, ఎస్ వెంకన్న, నటరాజ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు. బీసీలకు పంచాయతీల్లో తగ్గించిన రిజర్వేషన్లను పెంచాలని, 34 శాతం యధావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్‌లోని బీసీ నాయకులు సీఎం కేసీఆర్‌కు బీసీ రిజర్వేషన్లపై నచ్చజెప్పి 34 శాతం రిజర్వేషన్లను కొనసాగించేలా చూడాలని కోరారు. అది మానేసి రిజర్వేషన్ల తగ్గింపుపై పోరాడుతున్న బీసీ సంఘాలపై విమర్శలు చేయడం తగదన్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఇంటరియమ్ స్టే ఆర్డర్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంత్రివర్గ నిర్ణయం లేకుండానే హడావుడిగా బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తూ ఆర్డినెన్స్‌ను జారీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. వెంటనే ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్ పదవిలో గొప్ప గౌరవం



గన్నేరువరం మేజర్ పంచాయతీ భవనం

- గ్రామ సేవకు మించిన తృప్తిలేదు
- గన్నేరువరం మేజర్ పంచాయతీ సర్పంచ్ జువ్వాడి మన్‌మోహన్ రావు



కరీంనగర్, ప్రభ న్యూస్‌బ్యూరో: కరీంనగర్ జిల్లా, మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉంది గన్నేరు వరం మేజర్ పంచాయతీ. జిల్లాల పునర్విభజనకు ముందు బెజ్జంకి మండల పరిధిలో ఉండేది, బెజ్జంకి మండలం సిద్దిపేటలో కలవగా గన్నెరువరం కొత్త మండలంగా ఏర్పాటై కరీంనగర్ జిల్లా పరిధిలోకి వచ్చి ంది. మండల కేంద్రమైన గన్నేరువరం మేజర్ పంచాయతీ, 5700 జనాభా కలిగి ఉంది. ఈ గ్రామ తాజా మాజీ సర్పంచ్ జు వ్వాడి మన్‌మోహన్‌రావు (66) రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశారు. బీఎస్సీ పూర్తి చేసిన మన్మోహన్ 36 సంవ త్సరాల వయస్సులో మొదటిసారి 1988 -95లో, రెండోసారి 2013 నుంచి 2018 వరకు సర్పంచ్‌గా పని చేశారు. సర్పంచ్ రిజర్వు కాబడ్డ సమ యంలో 19950 -2000 వరకు ఎంపీటీసీ సభ్యునిగా, 2001 -2006 వరకు బెజ్జంకి జెడ్పీటీసీ సభ్యునిగా, 2006-13 లనకర గన్నేరువరం సింగిల్‌విండో చైర్మన్‌గా బాధ్యలు నిర్వ హి ంచారు. మన్మోహన్‌రావు కాంగ్రెస్ పార్టీ నుంచి జెడ్పీటీసీగా పనిచేసి పార్టీ తరపున విప్‌గా నియమించబడ్డారు. జెడ్పీ లో అప్పుడు కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు సమానబలం ఉండటంతో విప్‌గా ఉండి టీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించి టీఆర్ఎస్‌కు చెందిన కల్వకుంట్ల రాజేశ్వర్‌రావు చైర్మన్‌గా ఎన్నికకావడంలో కీలక పాత్ర పోషించారు. తరువాత మన్మోహన్‌రావు టీఆర్ఎస్ పార్టీలో చేరి 2013లో సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. గన్నేరువరం గ్రామానికి సేవ చేయడానికి అనేక పదవులు చేపట్టినప్పటికీ సర్పంచ్‌గా రెండు పర్యాయాలు పనిచేసిన కాలమే సంతృప్తినిచ్చిందని మన్మోహన్‌రావు 'ఆంధ్రప్రభ'కు వివరించారు. నీటి సమస్య లేకుండా నాలుగు వాటర్ ట్యాంకులు నిర్మించగలిగానని, 33/11 సబ్ స్టేషన్ ద్వారా గ్రామంలో కరెంటు సమస్య లేకుండా చేయగలిగామని, ఈ పిరియడ్‌లో వివిధ పనుల క్రింద ఆరుకోట్లు ఖర్చు చేశామని తెలిపారు. గ్రామ సర్పంచ్‌గా ప్రతినిత్యం ప్రజలతో ఉండటం వల్ల పదవి తనకు సంతృప్తినచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికోసం విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని, కొత్త పంచాయతీరాజ్ చట్టం ద్వారా గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి వివిధ పార్టీల్లో ఉన్న సీనియర్ నాయకులంతా చూడగానే పేరుపెట్టి పిలుస్తుంటారు. ఈసారి సర్పంచ్ స్థానం జనరల్ మహిళకు రిజర్వు కాబడింది, తనకు పోటీ చేసే అవకాశం లేకపోవడంతో సతీమణిని బరిలో దింపాలనే ఆలోచనలో ఉన్నారు. వీలుకాకుంటే గన్నేరువరం చిన్న మండలం కావడంతో రిజర్వేషన్ అనుకూలంగా వస్తే ఎంపీటీసీగా పోటీ చేసి ఎంపీపీ కావాలనే ఆలోచనలో ఉన్నారు.

పల్లె పెద్దగా పాతికేళ్లు!

- సర్పంచ్ కొండబాల కోటేశ్వరరావుకే ఆ ఘనత
- ప్రస్తుతం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సేవలు

ఖమ్మం, ప్రభన్యూస్ : ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పాతికేళ్లు..అది కూడా సర్పంచ్‌గా.. విద్యార్థి దశలో ఉన్నప్పుడే.. అప్పుడు మొదలైన ఆయన ప్రస్థానం నేటికీ అప్రతిహతంగా సాగుతోంది. ఆయన ఎవరో కాదు ప్రస్తుత రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు.. డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన ఆయన రైతుల అభ్యున్నతికి కృషిచేశారు. పలు రాష్ట్రాల్లో పర్యటించి డీసీసీబీ బలోపేతానికి చర్యలు తీసుకున్నారు.

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు రెండున్నర దశాబ్దాల పాటు సర్పంచ్‌గా పనిచేశారు. ఆ రాజకీయ జీవితమే రాష్ట్రస్థాయి నేతగా ఎదిగేందుకు దోహదపడింది. విద్యార్థి దశలోనే కొండబాలను సర్పంచ్ పదవి వరించింది. ఏకకాలంలో సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా, డీసీసీబీ చైర్మన్‌గా పదవులను అధిష్టించిన ఘనత కొండబాలకే దక్కింది.

విద్యార్థి దశ నుంచే..

ఖమ్మం జిల్లా, వైరా మండలంలోని కొండకొడిమకు చెందిన కొండబాల కోటేశ్వరరావు విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అతిచిన్న వయస్సులో సర్పంచ్ పదవి వరించింది. 1970లో కొండకొడిమ సర్పంచ్‌గా తొలిసారి ఎన్నికయ్యారు. ఏకంగా పదేళ్లు ఆ పదవిలో కొనసాగారు. తిరిగి 1981లో కొండకొడిమ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అదే సంవత్సరం మధిర పంచాయతీ సమితికి జరిగిన ఎన్నికల్లో పోటిచేసి ఓడిపోయారు. 1988లో మూడోసారి సర్పంచ్‌గా పోటిచేసి విజయం సాధించారు. ఆ సమయంలో దొంతెబోయిన వీరభద్రం అనే వ్యక్తి నామినేషన్ వేసి ఉపసంహరణ సమయంలో అందుబాటులో లేకుండాపోవడంతో సాంకేతికంగా ఎన్నిక జరిగింది. ఫలితంగా కొండబాల ఏకపక్షంగా ఎన్నికయ్యారు.

ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌గా..

రెండోసారి సర్పంచ్‌గా ఉన్న సమయంలోనే 1987లో గొల్లపూడి సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మూడోసారి సర్పంచ్‌గా ఉన్న సమయంలోనే 1992లో రెండోసారి గొల్లపూడి సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



ఆ సమయంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌గా కొండ బాల ఎన్నికయ్యారు. టీడీపీకి కేవలం ఖమ్మం డీసీసీబీ మాత్రమే దక్కింది. 1997 ప్రాంతంలో భద్రాచలం దేవ స్థానం చైర్మన్‌గా పనిచేశారు. 1999 లో మధిర ఎమ్మెల్యేగా పోటిచేసి విజ యం సాధించారు. టీడీఎల్పీ కోశాధికారిగా పనిచేశారు. 2004లో మధిర నుంచి రెండోసారి పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. టీఆర్ఎస్‌లో చేరి రాష్ట్రవిత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పనిచేస్తున్నారు.

క్రీడాప్రభ

పరుగులు పారించారు

ఆస్ట్రేలియాతో చివరి టెస్ట్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసింది. రెండో రోజు భారత బ్యాట్స్‌మెన్ పరుగుల వరద పారించారు. పుజారా 193 పరుగులు చేసి ఇప్పటివరకు ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. పుజారా డబుల్ సెంచరీ మిస్‌కాగా, జడేజా కూడా 81 పరుగులు చేసి సెంచరీని మిస్ అయ్యాడు. రిషభ్ పంత్ టెస్టుల్లో తన రెండో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. భారత్ 622/7 పరుగులు చేసి డిక్లేర్ చేసి ఆతిథ్య జట్టుపై ఒత్తిడి పెంచింది. ఆస్ట్రేలియాలో భారత్ చేసిన రెండో అత్యధిక స్కోరు ఇది.

- భారత్ తొలి ఇన్నింగ్స్ 622/ డిక్లేర్
- పుజారా డబుల్ సెంచరీ మిస్
- సెంచరీతో కదం తొక్కిన పంత్
- ఆస్ట్రేలియా 24/0 బ్యాటింగ్



పంత్ 159*

సిడ్నీ: ఆస్ట్రేలియాతో చివరిటెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో భారత బ్యాట్స్‌మెన్ విశ్వరూపం చూపారు. తొలి రోజు మయాంక్, పుజారాలు రెచ్చిపోగా, రెండోరోజు పుజారాతో పాటు, వికెట్ కీపర్ రిషభ్ పంత్, ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా, హనుమ విహారీ తమ ప్రతాపాన్ని చూపారు. శుక్రవారం రెండో రోజున భారత్ తన తొలి ఇన్నింగ్స్ ఓవర్ నైట్ స్కోరు 303/4తో ఇన్నింగ్స్‌ను కొనసాగించి 622/7 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై ఆడుతూ భారత్ నమోదు చేసిన రెండో అత్యధిక స్కోరు ఇది. 2004లో ఇదే వేదికపై భారత్ 705/7 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. నాటౌట్‌గా ఉన్న పుజారా, విహారీలు తమ జోరును కొనసాగించారు. విహారీ 42(96బంతులు, ఫోర్లు-5)పరుగులు చేసి నాథన్ లియాన్ బౌలింగ్‌లో మార్నస్‌కు క్యాచిచ్చి ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. ఎడమచేతి వాటం ఆటగాడు రిషభ్ పంత్ క్రీజులోకి వచ్చాడు. పుజారా, పంత్‌లు ఆసీస్ బౌలర్లకు సవాలుగా నిలిచారు. లంచ్ సమయానికి భారత్ 389/5 పరుగులు చేసింది. పుజారా దాటిగా ఆడుతూ.. రెండోసెంచరీ వైపు దూసుకుపోతున్న సమయంలో.. ఆ మైలురాయికి కేవలం ఏడు పరుగుల దూరంలో వ్యక్తిగత స్కోరు 193(373 బంతులు, ఫోర్లు-22) వద్ద నాథన్ లియాన్ వేసిన బంతిని డైవ్ చేయ బోయి అతనికే రిటర్న్ క్యాచిచ్చాడు. ఆస్ట్రేలియాలో అత్యధిక పరుగులు చేసిన ఐదో భారత బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. క్రీజు లోకి వచ్చిన రవీంద్ర జడేజా, పంత్‌లు కలిసి దూకుడుగా ఆడుతూ స్కోరులో వేగం పెంచారు.



పుజారా (193)



జడేజా (81)

పంత్ సెంచరీ

దూకుడుగా ఆడుతున్న పంత్ తన అర్ధ సెంచరీని 85 బంతులో పూర్తి చేసుకున్నాడు. టీ సమయానికి భారత్ 6 వికెట్ల నష్టానికి 491 పరుగులు చేసింది. పంత్ రెండో టెస్ట్‌సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఇందుకు పంత్ 137 బంతులను ఎదుర్కొన్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టుల్లో సెంచరీ చేసిన తొలి భారతీయ వికెట్ కీపర్‌గా పంత్ చరిత్ర సృష్టించాడు. అంతేకాక తక్కువ వయసులో ఆస్ట్రేలియా లో ఆడు తూ టెస్టుల్లో సెంచరీ సాధించిన మూడో బ్యాట్స్‌మన్‌గా పంత్ నిలిచాడు. గతంలో సచిన్ టెండూల్కర్ 1992లో 18 ఏళ్ల 256 రోజుల వయసులో సిడ్నీలో 148 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అదే ఏడాదిలో సచిన్ 18 ఏళ్ల 285రోజుల వయసులో పెర్త్‌లో 114 పరుగులు చేశాడు. 1948లో దత్తు ఫాడ్కర్ 22 ఏళ్ల 46రోజుల వయసులో 123 పరుగులు చేసి రెండో బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. తాజాగా పంత్ 21 ఏళ్ల 92రోజుల వయసులో 159 పరు గులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. 123వ ఓవర్లో 400 పరుగుల మార్కును దాటిన భారత్ 149వ ఓవర్లో 500 పరుగులను అధిగమించింది. జడేజా టెస్టుల్లో పదో అర్ధ శతకాన్ని 89 బం తుల్లో పూర్తిచేసు కున్నాడు. అనంతరం జడేజా సెంచరీ దిశగా సాగుతూ తన వ్యక్తి గత స్కోరు 81(114 బం తులు, ఫోర్లు-7 సిక్స్1) పరు గుల వద్ద నాథన్‌కు దొరికిపో యాడు. బంతిని క్రీజును దాటి షాట్‌ను కొట్టబోగా బంతి లైన్‌ను మిస్స యి క్లీన్ బౌల్డ్‌గా వెనుదిరిగాడు. అప్పటికి భారత్ స్కోరు 622/7. కోహ్లీ భారత్ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయడంతో పంత్ 159 నాటౌట్‌గా పెవిలియన్‌కు తిరిగి వచ్చాడు. పంత్, జడేజాలు కలిసి 221 బంతుల్లో 200పరుగు లను జట్టు స్కోరుకు జోడించా రు. ఆసీస్ బౌలర్లలో స్పిన్నర్ నాథన్ లియాన్ 4 వికెట్లు, హేజిల్‌వుడ్ రెండు, స్టార్క్ ఒక వికెట్‌ను పడగొట్టారు. ఆస్ట్రే లి యా తన తొలి ఇన్నిం గ్స్‌ను ప్రారం భించి రెండో రోజు ఆట ముగిసేసమ యానికి వికెట్ నష్టపోకుండా 24పరు గు లు చేసిం ది. మార్కస్ హ్యారిస్ 19 పరు గులు, ఉస్మాన్ ఖవాజా5 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు.

ఆస్ట్రేలియాలో అత్యధిక పరుగులు చేసిన ఆసియా బ్యాట్స్‌మెన్2004లో సిడ్నీలో సచిన్ టెండూల్కర్ 241 నాటౌట్, 2003లో అడిలైడ్‌లో రాహుల్ ద్రవిడ్ 233 పరుగులు, 1992లో సిడ్నీలో రవిశాస్త్రి 206, 2016లో మెల్‌బోర్న్‌లో అజహర్ అలీ (పాకిస్తాన్) 205 నాటౌట్, 2003లో మెల్‌బోర్న్‌లో వీరేంద్ర సెహ్వాగ్ 195, 2019లో సిడ్నీలో చటేశ్వర్ పుజారా 193

ఆసియా వెలుపల సెంచరీ చేసిన భారత వికెట్ కీపర్లు1959లో వెస్టిండీ స్‌పై వి మంజ్రేకర్ 118, 2002లో విండీస్‌పై ఎ రాట్రా 115 నాటౌట్, 2016లో విండీస్‌పై వృద్ధిమాన్ సాహ 104, 2018లో ఇంగ్లండ్‌పై పంత్ 114, 2019లో ఆస్ట్రేలియాలో రిషభ్ పంత్ 153

ఆస్ట్రేలియాలో భారత జట్టు చేసిన అత్యధిక పరుగులు 2004లో సిడ్నీలో 705/7, 2019లో సిడ్నీలో 622/7, 1986లో సిడ్నీలో 600/4, 2008లో సిడ్నీలో 532ఆలౌట్

స్కోరు బోర్డు:

భారత్ తొలి ఇన్నింగ్స్: మయాంక్ అగర్వాల్ (సి) స్టార్క్ (బి) లియాన్ 77, కెఎల్ రాహుల్ (సి) షువాన్ మార్ష్, (బి)హేజిల్‌వుడ్ 9, చటేశ్వర్ పుజారా సిఅండ్ బి లియాన్ 193, కోహ్లీ (సి) టిమ్ పైన్ (బి) హేజిల్‌వుడ్ 23, రహానే (సి)టిమ్ పైన్ (బి) స్టార్క్ 18, హనుమ విహారీ (సి) మార్నస్ (బి) లియాన్ 42, రిషభ్ పంత్ నాటౌట్ 159, రవీంద్ర జడేజా (బి) లియాన్ 81 ఎక్స్‌ట్రాలు 20 మొత్తం: 622/7(167.2 ఓవర్లు)

బౌలింగ్: మిచెల్ స్టార్క్ 26-0-123-1, హేజిల్‌వుడ్ 35-11-105-2, కమిన్స్ 28-5-101-0, నాథన్ లియాన్ 57.2-8-178-4, మార్నస్ 16-0-76-0, ట్రావిస్ హెడ్ 4-0-20-0, ఖవాజా 1-0-4-0.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: మార్కస్ హ్యారిస్ బ్యాటింగ్ 19, ఉస్మాన్ ఖవాజా బ్యాటింగ్ 4 ఎక్స్‌ట్రాలు 0 మొత్తం 24/0(10 ఓవర్లు)

బౌలింగ్: మహ్మద్ షమి 3-0-9-0, బుమ్రా 3-0-12-0, జడేజా 2-1-1-0, కుల్దీప్ యాదవ్ 2-1-2-0

ఐటీటీఎఫ్ తాజా ర్యాంకుల్లో..

కెరియర్ టాప్‌లో శరత్, సాతియాన్‌లు



కటక్: స్టార్ టేబుల్ టెన్నిస్ క్రీడాకరులు ఆచంట శరత్ కమల్, జి సాతియాన్‌లు తమ కెరియర్ అత్యున్నత ర్యాంకులను కాపాడుకున్నారు. శుక్రవారం ఐటీటీఎఫ్ విడుదల చేసిన తాజా ర్యాంకుల జాబితాలో శరత్ 30వ స్థానంలో ఉండ గా, సాతియాన్ 31వ స్థానంలో కొనసా గుతున్నాడు. టాప్ 100 జాబితాలో చోటు సంపాదించిన మరో ఆటగాడు హర్మీత్ దేశాయ్. శరత్ సాతియాన్‌లకు దిగు వన దేశా య్ ఉన్నాడు. మహి ళల జాబి తాలో మనికా బాత్రా ఒకస్థానం మె రుగు పడి 51వ స్థా నానికి చేరిం ది. అండర్ 21 పురు షుల జాబి తాలో 4 భారత ఆటగాళ్లు కొత్తగా టాప్ 100లో చేరారు. మానవ్ ఠక్కర్ మూడు స్థానాలు మెరు గుపడి 17కు చేరగా, రోనిత్ భాంజా 41నుంచి 34కు, జీత్ చాంద్ర 56 నుంచి 46కు సిద్దేశ్ పాండే 66 నుంచి 52కు ఎగబాకారు. అండర్ 21 మహిళల జాబితాలో 3 కొత్తగా జాబితా లో చోటు సంపాదిం చారు. సెలెనదీప్తి సెల్వకుమార్ 31వ స్థానంలో ఉండగా, మోమిత దత్త, అర్చనా కామత్‌లు ఉమ్మ డిగా 32వ ర్యాం కులో ఉన్నారు. ఆకుల శ్రీజ 62వ స్థాన ం లో ఉంది.

నేటి నుంచి ఫుట్‌బాల్ ఆసియా కప్

- తొలి మ్యాచ్‌లో యూఏఈ వర్సెస్ బహ్రెయిన్
- ఆదివారం థాయ్‌లాండ్‌తో భారత్ ఢీ



అబుదాబి: నేటి నుంచి ఎఎఫ్‌సి(ఆసియన్ ఫుట్‌బాల్ కాన్ఫిడరేషన్) ఆసియా ఫుట్‌బాల్ కప్‌కు తెరలేవనుంది. 2011లో భారత్ ఆడిన మూడు మ్యాచుల్లో ఓడి ఎలిమినేట్ అయింది. ఈసారి ఎలాగైనా కప్ కలను సాకారం చేసుకోవాలని భారత్ ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. 2036 ప్రపంచకప్‌లో ప్రవేశించడానికి ఈ టోర్నీ తొలి మెట్టుగా ఉండనుంది. యూఏఈలో జరుగుతున్న ఈ టోర్నీలో గ్రూప్ ఎ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య దేశం బహ్రెయిన్‌తో తలపడుతోంది. ఇదే గ్రూప్‌లో ఉన్న భారత్ ఆదివారం తన తొలి మ్యాచ్‌ను థాయ్‌లాండ్‌తో ఆడనుంది. గ్రూప్ ఎలో భారత్, యూఏఈ, బహ్రెయిన్, థాయ్‌లాండ్‌లుండగా, గ్రూప్ బిలో ఆస్ట్రేలియా, సిరియా, పాలెస్తీనా, జోర్డాన్లు, గ్రూప్ సిలో దక్షిణ కొరియా, చైనా, కిర్గీస్తాన్, పిలిప్పీన్స్, గ్రూప్ డిలో ఇరాన్, ఇరాక్, వియత్నాం, యెమన్.. గ్రూప్ ఇలో సౌదీ అరేబియా, కతార్ లెబనాన్, ఉత్తర కొరియా, గ్రూప్ ఎఫ్‌లో జపాన్, ఉజ్బెకిస్తాన్, ఒమన్, తుర్కిమినిస్తాన్ లున్నాయి. నాలుగేళ్లకోసారి జరిగే ఈ టోర్నీలో భార త్ ఆడటం ఇది నాలుగోసారి. 24 ఏళ్ల అనంతరం 2011 ఆసియా కప్‌కు అర్హత సాధించిన భారత్ 2015 కప్‌కు అర్హత సాధించలేకపోయింది. 2015లో కప్‌ను టోర్నీకి ఆతిథ్యమిచ్చిన ఆస్ట్రేలియా గెలుచుకుంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 97వ స్థానంలో ఉంది. అంతకు ముందు 173వ స్థానంలో ఉన్న భారత్ ఇటీవల ఆడిన 13 మ్యాచుల్లో అజేయంగా నిలిచి పైకి ఎగబాకింది. ప్రపంచకప్ క్వాలిఫైయర్ పోటీల్లో భారత్ కేవలం 1.5 లక్షల జనాభా ఉన్న పసిఫిక్ ఐలాండ్ దేశం గుయామ్ చేతిలో ఓడి టోర్నీకి దూరమైంది. భారత ఫుట్‌బాల్ క్రీడల సంస్క రణల పర్వం చీఫ్ కోచ్ స్టీఫెన్ కాన్‌స్టంటైన్, ఫార్వార్డ్ ఆటగాడు సునీల్ ఛెత్రీల తో ప్రారంభమయ్యాయి. ఛెత్రీ అధ్వర్యం లోని జట్టు గెలుపు బాట పట్టింది. అన్ని జట్ల కంటే ముందే యూఏఈకు చేరుకున్న 28 మంది సభ్యులతో కూ డిన భారత జట్టు అక్కడి వాతావరణానికి అలవా టు పడ టానికి ప్రాక్టీస్ మ్యాచులను ఆడింది. ఈ టోర్నీ లో రాణిస్తామన్న విశ్వాసముంది. మా ఆటగాళ్లు అందుకు సమర్థులే.. అని కోచ్ కాన్‌స్టంటై న్ శుక్రవారం మీడియాతో అన్నాడు.

భారత ఆటగాళ్ల జాబితా

గోల్‌కీపర్స్: గుర్‌ప్రీత్‌సింగ్‌సందు, విశాల్‌కైత్, అమరీందర్ సింగ్

డిఫెండర్స్ : ప్రీతమ్ కోటల్, సార్థిక్ గోలుయి, సందేశ్ జింగాన్, అనస్ ఎడతోడికా, సలామ్ రంజన్ సింగ్, సుభాషిష్ బోస్, నారాయణ్ దాస్.

మిడ్ ఫీల్డర్స్: ఉదాంత సింగ్, జాకీచాంద్‌సింగ్, జెర్మన్‌ప్రీత్ సింగ్, ప్రణయ్ హాల్దార్, అనిరుద్ థాపా, వినిత్ రాయ్, రోలిన్ బోర్జెస్, అశిక్ కురునియన్, హాలిచరణ్ నార్జరీ,

ఫార్వార్డ్ ఆటగాళ్లు : సుమీత్ పాసి, బల్వంత్ సింగ్, సునీల్ ఛెత్రీ, జేజే లాల్‌పెక్లువా.

వారియర్స్ గెలుపు

అహ్మదాబాద్: పీబీఎల్ సీజన్ 6 పోటీల్లో భాగంగా శుక్రవారం అవదె వారియర్స్ జట్టు అహ్మదాబాద్ స్మాషర్స్‌ను 5- (-1) తేడాతో ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో వరల్డ్ నెంబర్ 5 సాన్ వాన్ హో(వారి యర్స్) 15-10, 8-15, 15-7 తేడాతో ప్రపంచ చాంపి యన్ విక్టర్ అక్సెల్‌సెన్(స్మాషర్స్)ను ఓడించాడు. రెండో సింగిల్స్ మ్యాచ్‌లో సమీర్ వర్మ(స్మాషర్స్) ట్రంప్ మ్యాచ్‌గా ఆడి 8-15, 12-15 తేడాతో ఎల్ ఒ క్యూన్(వారియర్స్) చేతిలో ఓడాడు. మహిళల సింగిల్స్‌లో బి జాంగ్(వారి యర్స్) ట్రంప్ మ్యాచ్‌గా ఆడుతూ కె గిల్‌మోర్(స్మాషర్స్)పై 15-11, 15-11, 10-15 తేడాతో గెలిచింది. పురుషుల డబుల్స్‌లో వై లీ- ఎం క్రిస్టియాన్సెన్(వారియర్స్) 15-6, 10-15, 15-12 తేడాతో కె నందగోపాల్- ఎస్ రాంకిరెడ్డి(స్మాషర్స్) జోడీని ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో క్రిస్టియాన్సెన్, పొన్నప్ప జోడి(వారియర్స్) రాంకిరెడ్డి, ఎన్‌ఎస్ రెడ్డి (స్మాషర్స్) జోడీని ఓడించింది.

ఫైనల్లో బోపన్న జోడి



పుణె: టాటా మహారాష్ట్ర ఓపెన్‌లో రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ జోడీ ఫైనల్‌కు చేరింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో బోపన్న జోడి ఇటాలి యన్ క్రొయేషన్ జోడి సిమన్ బోలెల్లీ- ఇవాన్ డోడిగ్‌లను 6-3, 3-6, 15-13 తేడాతో ఓడించింది. గంటా 33 నిమిషాలపాటు సాగిన ఈ పోటీ ఉత్కంఠగా సాగింది. తొలి సెట్‌ను తేలిగ్గానే గెలుచుకున్న బోపన్న జోడి రెండో సెట్లో పరాజయం పాలైంది. కీలమైన మూడో సెట్లో ఇరు జోడీలు నువ్వా నేనా అన్నట్లు పోరాడాయి. సూపర్ టై బ్రేక్‌లో రెండు మ్యాచ్ పాయింట్లను కాచుకుని విజయం సాధించా రు. గురువారం నాడు ఆడిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో లియాండర్ పేస్- మిగ్యుల్ ఏంజెల్ జోడీతో తలపడు తూ..ఆరు మ్యాచ్ పాయింట్లను నిలువరించారు. ఫైనల్లో ఎల్ బాంబ్రిడ్జ్-జె ఒ మారా(ఇంగ్లండ్) జోడీతో తలపడనుంది.

భారత్‌లో వన్డేలకు ఆసీస్ జట్టు ప్రకటన

వెటరన్ సీమర్ సిడిల్‌కు చోటు



సిడ్నీ: భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొనే ఆస్ట్రేలియా జట్టులో వెటరన్ సీమర్ పీటర్ సిడిల్‌ను చేర్చారు. 12నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌కోసం శుక్రవారం ఆస్ట్రేలియా క్రికెట్(సీఏ) 14మంది ఆటగాళ్ల జాబితాను వెల్లడించింది. దాదాపు 8 ఏళ్ల తర్వాత 34 ఏళ్ల సిడిల్ వన్డే జట్టులోకి తిరిగి వచ్చాడు. ఉస్మాన్ ఖవాజా, నాథన్ లియాన్‌లకు కూడా ఆరోన్ ఫించ్ నేతృత్వంలోని స్క్వాడ్‌లోకి వచ్చారు. ఇటీవల దేశంలో దక్షిణాఫ్రికాతో ఆడిన వన్డే సిరీస్‌లో నాథన్ లియాన్ పాల్గొనలేదు. కాగా ఖవాజా రెండేళ్ల తర్వాత వన్డే జట్టులోకి వచ్చాడు. బాల్ ట్యాంపరింగ్ కుంభకోణం తర్వాత సీఏ కొత్త నిబంధనలమేరకు జట్టులో ఇద్దరు వైస్ కెప్టెన్లుగా మిచెల్ మార్ష్, కీపర్ అలెక్స్ కేరీ ఉండనున్నారు. కాగా, పేసర్ల త్రయం మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్‌లను శ్రీలంకతో ఆడే టెస్ట్ సిరీస్ దృష్ట్యా వారికి విశ్రాంతి కల్పించారు. ఇటీవల ఆసీస్ ఆడిన వన్డేల్లో విఫలమైన బ్యాట్స్‌మెన్ ట్రావిస్ హెడ్, డిఆర్సీ షార్ట్, క్రిస్ లిన్‌లకు జాబితాలో చోటు దక్కలేదు. కాగా ఫాస్ట్‌బౌలర్ నాథన్ కోల్టెర్-నీల్ వెన్ను నొప్పి కారణంగా చికిత్స తీసుకుంటుండంతో అతని పేరును పరిగణనలోకి తీసుకోలేదు. రానున్న ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకొని పలు వేదికల్లో రాణించే సామర్థ్యమున్న ఆటగాళ్లను ఎంపిక చేశాము. భారత్‌తో ఆడే మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్, యూఏఈతో ఆడే మ్యాచ్‌లను దృష్టిలో పెట్టుకున్నాము. ప్రపంచకప్‌కు ముందు ఈ మ్యాచ్‌లు ఆస్ట్రేలియాకు మంచి ప్రాక్టీస్‌గా నిలుస్తాయి. ఫలితంగా సమర్థ జట్టును వరల్డ్ కప్‌కు ఎంపిక చేసే వీలుంటుంది అని ఆస్ట్రేలియా సెలెక్షన్ పానెల్ ఛైర్మన్ ట్రేవార్ హాన్స్ మీడియాతో చెప్పాడు.

ఆస్ట్రేలియా జట్టు(14మంది ఆటగాళ్లు)

ఆరోన్ ఫించ్(కెప్టెన్), ఉస్మాన్ ఖవాజా, షువాన్ మార్ష్, పీటర్ హ్యాండ్స్‌కోంబ్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టొయినిస్, మిచెల్ మార్ష్, అలెక్స్ కేరీ(వికెట్ కీపర్), జ్యే రిచర్డ్సన్, బిల్లీ స్టాన్‌లేక్, జాసన్ బెహ్రెన్‌డార్ఫ్, పీటర్ సిడిల్, నాథన్ లియాన్, అడం జంపా.

జట్టు ఎంపిక బాగాలేదు: మాజీ స్పిన్ దిగ్గజం షేన్‌వార్న్

భారత్‌తో వన్డేలకోసం ఎంపిక చేసిన ఆస్ట్రేలియా జట్టు బలహీనమైందని అది ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని ఎంపిక చేయలేదని ఆసీస్ మాజీ స్పిన్నర్ షేన్ వార్న్ అన్నాడు. ప్రకటించిన 14 మంది ఆటగాళ్లలో కొంతమందిని వదిలిపెట్టి మరికొం తమందిని తీసుకున్నారు. జట్టు ఎంపికలో సమతూకాన్ని పాటించలేదు. ఎంపిక హాస్యాస్పదం గా ఉంది. ఈ తర హా ఎంపికను అన్ని ఫార్మాట్లలో ఉండకూడదని వార్న్ ట్వీట్ చేశాడు. అంతేకాకతాను ఎంపిక చేసిన వన్డే జట్టును ట్విట్టర్లో పోస్ట్‌చేశా డు. డి ఆర్సీ షార్ట్ ఏం తప్పుచేశాడని అతన్ని ఎంపిక చేయ లేదని ప్రశ్నించాడు. ఇంగ్లండ్‌లో ప్రపంచకప్ ఆడను న్నాము అదిదృష్టిలో ఉంచుకోవాలి. సొంత ప్రాధాన్య తలు వదిలిపెట్టి ప్రపంచకప్ కోసం జట్టును ఎంపిక చేయాలన్నాడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

lifepage2012@gmail.com

లైఫ్



హరిత చందనం!

ఆమె బుర్రనిండా బుద్ధులే...... అందులో బోలెడంత సృజనాత్మకత.... సమాజానికి ఏదో చేయాలనే తపన. ప్రకృతిని మనం ప్రేమిస్తే....అది మనల్ని చల్లగా బతకమని దీవిస్తుందని విశ్వసించి... ..పర్యావరణ పరిరక్షణ కోసం తపిస్తూ.. ..తోటి అధికారులకంటే విభిన్నంగా ఆలోచిస్తూ... దేశంలోనే ప్రతిభావంతులైన 10 మంది ఐఏఎస్ అధికారులలో ఒకరిగా గుర్తింపుపొందారు. ఆమె వృత్తిని, ప్రవృత్తిని మేళవించి...వ్యర్థం అనే పదానికి అర్థం మార్చేశారు. నిజం చెప్పాలంటే ఆమె పేరే కాదు... మనసూ హరిచందనమే!..... మనవతా పరిమళాలు వెదజల్లుతుంది.. ప్రజా సంక్షేమం కాంక్షిస్తుంది.. హరిత హితం కోరుకుంటుంది. ఆమె.. సమాజంలో మార్పు రావాలంటే..ముందు మన పరిసరాలు మారాలి... ఆ మార్పు మనతోనే మొదలవ్వాలి అంటారు....పదిమందికి మేలు చేసినప్పుడు లభించే సంతృప్తి....కోట్లు వెచ్చించినా దొరకదంటారామె. అందుకే కోట్లు ఆర్జించి పెట్టే ఉద్యోగాన్ని వదిలి సివిల్ సర్వీస్‌లోకి వచ్చానంటూ చిరునవ్వు చిందిస్తూ సెలవిస్తారు. ఆమె ఎవరో కాదు... జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (వెస్ట్‌జోన్) దాసరి హరిచందన. ఓవైపు ఐఏఎస్ అధికారిణిగా..మరో వైపు సాధారణ గృహిణిగా.. ఇంకోవైపు బిడ్డల్ని ప్రేమించే అమ్మగా.... త్రిపాత్రాభినయం చేస్తున్న... హరిచందన సక్సెస్ వెనుక కారణాలేంటి? ఇటు జీవితంలో ..అటు ఉద్యోగంలో ఎదుర్కొన్న సవాళ్లేంటి? పూర్తి వివరాలు ఆమె మాటల్లోనే...!

వ్యర్థాలకు అర్థం మార్చిన ఐఏఎస్ అధికారిణి | **థీమ్ పార్కుల ఏర్పాటు** | **150 చెరువుల పునరుద్ధరణ**

నేను హైదరాబాదీనే.. కానీ పుట్టింది ఖమ్మం జిల్లా అమ్మమ్మవాళ్ల ఊరిలో ..నాన్న దాసరి శ్రీనివాసులు విశ్రాంత ఐఏఎస్ అధికారి. నాన్న ఉద్యోగ రీత్యా ....నా చదువు మాత్రం కరీంనగర్,మెదక్, ఆదిలాబాద్, పాడేరు, కాకినాడ, ప్రకాశం, హైదరాబాద్ ఇలా 14ప్రాంతాల్లో సాగింది. ఆదిలాబాద్‌లో మాత్రం నాలుగున్నర సంవత్సరాలు ట్రైబల్ స్కూల్‌లో చదువుకున్నాను. 10తరగతి ప్రకాశం జిల్లాలో పూర్తిచేశాను. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో బీఏ ఎకనామిక్స్ చదివాను. వివిధ ప్రాంతాలలో చదవడంవల్లో..ఏమో కాని నాకు అందరితో కలిసిపోవడం అలవాటు. అంతేకాదు నేను చదువులో చాలా చురుకు. సైన్స్ గ్రూపో, మ్యాథ్స్ గ్రూపో కాకుండా ఎకనామిక్స్ చదవడంవల్ల అంతా చులకనగా చూసేవారు. పెళ్లినాటికి ఏదో డిగ్రీ చదవాలి కాబట్టి చదువుతుందని అవహేళనతో గుసగుసలాడుకునేవారు బంధువులు. కాని నేను డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించా. ఆ తర్వాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పీజీలో సీటురావడం ..స్కాలర్‌షిప్‌తో చదువుకునే ఛాన్స్ దక్కడంతో అవహేళన చేసిన నోర్లు మూతపడ్డాయి. అందుకే నేను నేర్చుకుంది ఒక్కటే..ఎవరో గుర్తిస్తారని ఏదీ చేయవద్దు. సాధించగలను అనే ఆత్మవిశ్వాసంతో ముందుకుపోతే చాలు గుర్తింపు అదేవస్తుంది. ఏ మంచి పని మొదలు పెట్టినా ఆదిలో అవమానాలు, అవహేళనలు తప్పవు. నేను ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రక్రియ మొదలు పెట్టించినప్పుడు..ఇది సాధ్యం కాదంటూ పెదవి విరిచినవారున్నారు. కాని అదే నేడు నాకు మంచి పేరును తెచ్చిపెట్టింది.



జీవితం అంటే ఇంతేనా?

లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ కాలేజీలో చేరి ఎన్విరాన్‌మెంటల్ అర్థశాస్త్రంలో పీజీ పూర్తిచేశాను. కార్బన్ క్రెడిట్స్‌పై పరిశోధన చేశాను. ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలో నడిచే ఓ ఉన్నత సంస్థలో ఉద్యోగం వచ్చింది. కోటి రూపాయల జీతం. ఏసీ గదుల్లో,ఏసీ కార్లలో బతుకు బండి హైస్పీడ్‌లో సాగిపోతోంది. కానీ ఏదో వెలితి. జీవితం అంటే ఇంతేనా? అనే ప్రశ్న బుర్రను తొలిచేది. జీవితం యాంత్రికంగా మారింది. దీంతో ఇంకేదో చేయాలనే తపన మొదలైంది. చదువులు ఉద్యోగాల కోసం విదేశాల్లో ఉంటున్నాం. కాని ఇది అసలైన జీవితం కాదనిపించింది. ఐఏఎస్ అధికారిగా నాన్న ప్రజలకు చేరువై చేస్తున్న సేవలు..నేను ఐఏఎస్ కావాలనే కోరిక చిన్ననాటి నుంచే ఉండేది. ఆ కోరిక మళ్లీ చిగురించింది. అంతే ఉద్యోగానికి రాజీనామా చేసి స్వదేశం చేరుకున్నాను. సివిల్స్ రాసాను. మొదటిసారే ఐఆర్ఎస్ వచ్చింది. నాన్న స్ఫూర్తితో సివిల్స్ బాట పట్టినదాన్ని. రాజీ పడలేదు.2009లో రెండోసారి ఐఏఎస్ సాధించాను. శిక్షణ పూర్తిచేసిన తర్వాత 2010లో సమైక్యాంధ్రప్రదేశ్‌లో వైజాగ్ అసిస్టెంట్ కలెక్టర్‌గా విధుల్లో చేరాను. ఆ తర్వాత విజయవాడ సబ్‌కలెక్టర్‌గా పనిచేశాను. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్నాను.




ఏదో చేయాలన్న తపనతో..


రోజుకు 25,940 టన్నుల ప్లాసిక్ వ్యర్థాలను పోగేస్తున్నామని గతేడాది సెంట్రల్ బోర్డు ఇచ్చిన నివేదిక నన్ను ఆవేదనకు గురిచేసింది. సమాజానికి ఏదో చేయాలన్న నా తపనకు మార్గనిర్దేశం చేసింది. దీంతో వ్యర్థాలను పుడమి తల్లి గుండెలపై మేటవేస్తూ.. పుట్టెడు దుఃఖం మిగిలిస్తున్నాం ..దానికి ఫుల్ స్టాప్ పెట్టాలని నిర్ణయించుకున్నాను. అందుకే ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేయించడం, పార్కుల్లో పచ్చదనం కాపాడడం, చెరువులు, జలాశయాల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టాము. అవి మంచి ఫలితాలను ఇస్తున్నాయి. గచ్చిబౌలి పరిధిలోని గోపనపల్లి జర్నలిస్టు కాలనీలో పంచతంత్ర పార్కును అభివృద్ధి చేశాము.అందులో అమర్చిన కుర్చీలు,విగ్రహాలు, అలంకరణ వస్తువులన్నీ... వ్యర్థాలతో,రీసైకిల్డ్ ప్లాస్టిక్‌తో తయారు చేసినవే. రకరకాల కథలను వివరించే విధంగా బొమ్మలను పచ్చిక బయళ్లలో ఏర్పాటు చేశాము. నిరుపయోగంగా ఉన్న ఎకరా స్థలంలో డాగ్ పార్క్ ఏర్పాటు చేశాము. ఇది దేశంలోనే మొదటిది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులోని 3.5 ఎకరాల డంపింగ్ యార్డును ప్లేపార్క్‌గా తీర్చిదిద్దాము. అందులో బీచ్‌వాలీబాల్, పికెట్‌బాల్ తదితర ఆటలకు స్థానం కల్పించాం. వెదురు కర్రలు, ప్లాస్టిక్ పేపర్లతో తయారైన రేకులతో క్రీడాకారులకు విశ్రాంతి గదులు నిర్మించాము. ప్లేపార్క్‌లో కాలిబాటలు కూడా ప్లాస్టిక్‌తో నిర్మించాము.కబ్జాలు కోరల్లో చిక్కినవి, నిర్లక్ష్యానికి గురైనవి దాదాపు 10 పార్కులను పునరుద్ధరించాము. హరితహారంలో భాగంగా 2లక్షలకు పైగా మొక్కలు నాటించాము. వెస్ట్‌జోన్ కార్యాలయాన్ని హరితమయంగా తీర్చిదిద్ది,ఐఎస్ఓ గుర్తింపు పొందాము. ఇక చెరువుల సంరక్షణ విషయానికి వస్తే.. దుర్గం చెరువు సుందరీకరణ గురించి చెప్పుకోవాలి. అందులో పిల్లల పార్క్‌ను ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాము. పార్క్‌లో నేలను కురిసిన ప్రతి వర్షపు నీటి చుక్కా భూమిలోకి ఇంకే విధంగా ఫోరస్ కాంక్రీట్‌తో నిర్మించాము. నిరుపయోగంగా ఉన్న కొండరాళ్లను రాక్‌హిల్ క్లైంబింగ్ స్పాట్‌గా తీర్చిదిద్దాము. దుర్గం చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు లేజర్‌షో లాంటి వినోద కార్యక్రమాలు ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తున్నాము. మరో వైపు మురుగు నీరు, గుర్రపుడెక్క ఆకుతో నిండిన, ఆక్రమణలకు గురైన దాదాపు 150 చెరువులను పునరుద్ధరించాము. జలాశయాల చుట్టూ సైక్లింగ్ ట్రాక్‌లు, ఉద్యానవనాలు నిర్మించి, అవి కాలుష్యం బారినపడకుండా చర్యలు తీసుకున్నాము. ఈ పనులన్నీ కార్పోరేట్ సంస్థలు ఇచ్చే సీఎస్ఆర్ నిధులతోనే చేస్తున్నాము. రెండు సంవత్సరాల కాలంలో ఇప్పటి వరకు 100కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులు వసూలు చేశాము.

సవాళ్లకు వెనుదీయను

చెప్పానుగా చిన్నప్పటి నుంచి నాన్నతో పాటు ప్రాంతాలు మారడం వల్ల సర్దుకుపోవడంతో పాటు సవాళ్లను ఎదుర్కొనే మనస్తత్వం అలవడింది.అధికారిణిగా ఎంతటి సవాల్‌నైనా స్వీకరిస్తా. నేను విజయవాడ సబ్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు మైలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో అమ్మాయి,అబ్బాయి ప్రేమించి మతాంతర వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత అమ్మాయి పుట్టింటికి వచ్చింది. దాంతో అబ్బాయి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అబ్బాయి బంధువులు..వారు విడిపోవడానికి కారణం పోలీసులే అన్న ఆగ్రహంతో స్టేషన్‌పై దాడిచేసి, ధ్వంసం చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ కాల్పులు జరపడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి చేయిదాటింది. లా అండ్ ఆర్డర్ సమస్యగా మారింది. దీంతో నేను స్పాట్‌కు వెళ్లాను. ప్రజలు రాళ్లు రువ్వుతున్నారు. కాల్చిన ఇన్‌స్పెక్టర్ పారిపోయాడు. చేసేది లేక అక్కడే మహిళల మధ్య ఉండి. సమస్యను పరిష్కరించాను. నేను ఏమాత్రం వెనకడుగువేసినా,సహనంకోల్పోయినా ఆ సంఘటన మతఘర్షణకు దారితీసేది. వైజాగ్‌లో పనిచేసినప్పుడు నక్సల్స్ సమస్య తీవ్రంగా ఉన్న పాడేరుకు వెళ్లాను. అది తెలిసిన జిల్లా ఎస్పీ వచ్చి నన్ను అక్కడి నుంచి బలవంతంగా తీసుకెళ్లారు. లేదంటే పరిస్థితి మరోలా ఉండేది.

అందరి సహకారంతో..





జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ పరిధిలో నిత్యం సేకరించే తడి,పొడి చెత్తనుంచి ప్లాస్టిక్ వేరుచేసి, రీసైక్లింగ్ చేసి..టైల్స్ తయారుచేయిస్తున్నాము. ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసి,టైల్స్‌గా వినియోగించుకుంటున్న మొదటి రాష్ట్రం మనదే. అవగాహన కల్పించడం ద్వారా ప్లాస్టిక్‌ను తిరిగి ఎలా వాడుకోవచ్చో ప్రజలకు చూపించాలన్నదే మాలక్ష్యం.మరోవైపు ఆహార పదార్థాల వ్యర్థాల నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే యూనిట్‌ను చందానగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నాము. అదే డివిజన్‌లో పాత వాహనాలను అందంగా అలంకరించి,కొత్తతరహా ట్రాన్స్ పోర్ట్ పార్క్ నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. నా ఆలోచనలు ఆచరణలోకి రావడానికి ఉన్నత అధికారులు, ఉద్యోగుల సహకారం,ప్రోత్సాహం ఎంతగానోఉంది.. అందరి సహకారంతో నేను చేస్తున్న ప్రయత్నానికి గాను దేశవ్యాప్తంగా 2018కి గాను బెటర్ ఇండియా మ్యాగజైన్ నిర్వహించిన సర్వేలో ...ప్రతిభావంతులైన 10మంది ఐఏఎస్ అధికారుల జాబితాలో స్థానం లభించడం ఎంతో ఆనందంగా ఉంది. అదే సమయంలో నాబాధ్యత పెరిగిందని భావిస్తున్నా!

చెప్పడం కాదు..

చెప్పడం కాదు ఆచరించి చూపించాలనేది నా సిద్ధాంతం. అందులో నేను అధికారికంటే ముందు గృహిణిని. ఇళ్లళ్లలో తడిచెత్త, పొడిచెత్త వేరుచేయమని ప్రజలకు చెప్పే అధికారులం మన ఇండ్లలో కూడా ఆచరించినప్పుడే దానికి విలువ.అందుకే నేను మా ఇంట్లో చెత్తవేరుచేసి, ఎరువుగా మార్చుకుంటా. పెరట్లో మొక్కలకు వాడుతాను. చెప్పాగా నేను ఓ బిడ్డకు తల్లినని. మావారు జీఎస్టీలో జేసీ గా పనిచేస్తారు. సివిల్స్ సర్వీస్. అయినా మా పాపకు తల్లిప్రేమను పూర్తిగా పంచుతున్నాను.అమ్మగా అది నా ధర్మం కూడా. డ్యూటీ నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత టైం అంతా పాపకే. టీవీ చూడను. ఫోన్ వాడను. పాపతోనే గడిపేస్తా. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. దంపతులు ఇద్దరు ఉద్యోగులైతే పిల్లలు షార్ప్ గా ఉంటారు. అమ్మానాన్నలు లేనప్పుడు పిల్లలు స్వంతంగా నిర్ణయాలు తీసుకుంటారు.మైండ్ షార్ప్ అవుతుంది. కాకపోతే ఇంటికి చేరిన తర్వాతపూర్తిసమయం వారికే కేటాయించాలి. అలాకాకుండా సంపాదన మోజులో పడి ఇంటికి వచ్చిన తర్వాత అదే గొడవలో ఉంటే మాత్రం పిల్లల భవిష్యత్తుకు తీరని అన్యాయం జరుగుతుంది.

- చొల్లేటి వేంకటేశ్వరా చారి

అందమైన బంధం కోసం!

అందమైన బంధం..ఆరోగ్యకరంగా హాయిగా ముందుకు సాగాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. లేదంటే బంధానికి ముప్పు తప్పదు. కొన్ని విషయాలు మనకు చాలా చిన్నవిగా..పట్టించుకోవాల్సినవి కానివిగా కనిపిస్తాయి. ఆశ్చర్యం అనిపించినా చిన్నచిన్న విషయాలే బంధాలను బీటలు వారుస్తాయి. అందుకే దాంపత్య బంధం హాయిగా నిండు నూరేళ్లు వర్ధిల్లాలంటే మనం తేలికగా తీసుకునే కొన్ని పనులు ఎట్టిపరిస్థితిలోనూ చేయకూడదు. తెలిసో తెలియకో మనం చేసే చిన్న పనులే బంధాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. అందుకే చేయకూడని పనులేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

☞ ప్రతి బంధానికి ఓ భాష ఉంటుందంటారు. బంధానికి భాషేంటి అనుకుంటున్నారా? నిజమే బంధం ఏర్పడిన తర్వాత వారిరువురు ఓ అవగాహనతో సాగిపోతుంటారు. అలా మానసికంగా ఒకరిని ఒకరు అర్థం చేసుకునే తీరే భాష. చీటింగ్ చేయడం,తిట్టడం లాంటివి మినహాయిస్తే..బంధంలో ఇది తప్పు ఇది ఒప్పు అని చెప్పడం మాత్రం సులభం కాదు. కొన్ని సార్లు మంచి అనుకున్నది ఇంకొన్ని సందర్భాల్లో చెడుగా పరిణమించవచ్చు. నిత్యం చేసే చిన్నచిన్న విషయాలే....బాధాకరంగా మారి బంధాన్ని బలహీనపరిచేవిగా మారుతుంటాయి. ఉదాహరణకు...మీరు సినిమాకు వెళ్లిన ప్రతిసారి భాగస్వామితో కలిసి వెళ్లడం, కలిసే ప్రయాణాలు చేయడం, ప్రతి రోజు కలిసి అల్పాహారం భుజిస్తున్నారు అనుకోండి. అలా చేయడం అనేది గొప్ప విషయమే. కాని అది రాను రాను విసుగు పుట్టిస్తుంది. బంధాన్ని నిస్సారంగా మారుస్తుంది. అందుకే అప్పుడప్పుడు,కలిసి వెళ్లేందుకు వీలుకానప్పుడు.. విడివిడిగానే టిఫిన్ చేసిరండి. ఏదైనా ఫంక్షన్‌కు ఇద్దరు వెళ్లడం కుదరక పోతే ఒక్కరే వెళ్లండి. ఒక్కరే వెళ్లి సినిమా చూసిరండి. వచ్చిన తర్వాత మీ అనుభూతులను పంచుకోండి. ప్రతిదీ ఇద్దరు కలిసి చేయడం మంచిదే అయినా .. జీవితం మెకానికల్‌గా మారుతుంది. బంధాన్ని నిస్తేజంగా మారుస్తుంది.

☞ సాఫీగా సాగుతున్న దాంపత్యంలో ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు గతంతో పోల్చుకోవద్దు. మీ భాగస్వామి లేదా మీ స్వంత, లేదా మీ దాంపత్య బంధానికి సంబంధించిన గతంతో సరిపోల్చుకోవడం వల్ల చిక్కులు తలెత్తే ప్రమాదం ఉంది. అంటే గతంలో అలా జరిగింది..ఇప్పుడెందుకు ఇలా.. అప్పుడు అలా ఉన్నావు,,ఇప్పుడెందుకిలా? అంటూ పోల్చుకుంటూ పోతే దంపతుల మధ్య ...అపోహలు,అనర్థాలు తలెత్తుతాయి. అది చర్చకు దారితీస్తుంది. సామరస్య పరిష్కారం లభించక పోతే....కలతలు పొడసూపుతాయి. దానివల్ల దాంపత్యంలో ప్రతికూల పరిస్థితులు తలెత్తవచ్చు. అందుకే ఎప్పుడూ సరిపోల్చుకునే దిశలో మీ ఆలోచనలను వెళ్లనీయవద్దు. అలాంటి పరిస్థితి వస్తే..మీ ఆలోచనలను నియంత్రించుకోండి. లేదంటే మీ ఆలోచనలు చెడు దారి పట్టవచ్చు. ఆలోచనలు కంట్రోల్ తప్పితే.. మీ జీవితంలో లేదా మీ దాంపత్యంలో జరిగిన మంచి సంఘటనలవైపు మనసును మళ్లించండి. గతంలో మీరు ఏదైనా మిస్ అయ్యానని భావిస్తే.,.ప్రస్తుత మీ భాగస్వామి ద్వారా వాటిని పొందే ప్రయత్నం చేయండి. ఆమె/ అతని జీవితంలో సరిపోల్చి.. పొందే ప్రయత్నం చేయడం కూడా సరైంది కాదు.

☞ మనం భాగస్వామి ఎంపికలో చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. మొదట మనం కలిసినప్పుడు ఎంతో ప్రేమగా మాట్లాడుతాం.. చింతలు,చీకాకులు పక్కన పెట్టి మసలుకుంటాం. దంపతులు అయిన తర్వాత మాత్రం.. వాళ్లు మనవాళ్లు..ఇక ఎక్కడికి పోరు అనే ధోరణి మనలో ఏర్పడుతుంది. ఆవిడ లేదా అతను మన ఆస్తి కాబట్టి అజమాయిషీ చెలాయించడం హక్కుగా భావిస్తాము. కాని అది వందశాతం తప్పు..అలా చేయకూడదు. ..మనం మన భాగస్వామి తొలిసారి కలిసినప్పుడు ఎలా మసలుకున్నామో జీవితాంతం అలాగే భాగస్వామిపట్ల ప్రవర్తించాలి. లేదంటే బంధం బీటలు వారుతుంది.




రంగవల్లిక



23 చుక్కలు 11 వచ్చే వరకు మధ్యచుక్క



సృజన సిరిసిల్ల



27 చుక్కలు 11 వరుసలు అటు ఇటు 4 చుక్కలు వదిలి 11 చుక్కలు 4 వరుసలు

సత్య, పెద్దాపురం

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

మీరూ ముగ్గులు పంపొచ్చు

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ, 8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

మీరు వన్యప్రాణి ప్రేమికులా?

మీరు సాహస ప్రేమికులా? సెలవు దినాలలో ఉత్కంఠభరితమైన అనుభూతిని పొందాలంటే ఇష్టపడతారా? వన్యప్రాణులను చూడడం.. రోజంతా ప్రకృతి మధ్యలో వాటితో గడపాలన్న కోరిక మీలో ఉందా? అయితే మీ కోరిక తీర్చే విధంగా దేశంలో ఎన్నో వన్యప్రాణి అభయారణ్యాలు, జాతీయ పార్కులు ఉన్నాయి. సెలవు దినాల్లో అక్కడికి వెళితే వన్యప్రాణుల మధ్య సంచరిస్తూ...ఉద్విగ్న భరితమైన మధురానుభూతిని పొందవచ్చు. అక్కడ సింహాలు, రాయల్ బెంగాల్ టైగర్‌లు, బ్లాక్‌బక్‌లు, ఎర్రని పాండాలు తదితర జంతువులను దగ్గరగా చూసి ఆనందించవచ్చు. వన్యప్రాణుల జీవన శైలిని తెలుసుకోవచ్చు. అందుకు అనువైన, దేశంలో ఉన్న ప్రముఖ నేషనల్ పార్క్‌లపై ఓ లుక్కేద్దాం!

జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్

మీరు బెంగాల్ టైగర్‌ను చూడాలను కుంటున్నారా? అయితే ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్ జిల్లా, రామ్‌నగర్‌లో ఉన్న జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌కు టూర్ ప్లాన్ చేసుకోండి. ఈ పార్క్ చాలా పురాతనమైంది. దీనిని 1936లో ఏర్పాటు చేశారు. జంతు సంరక్షకునిగా మారిన వేటగాడు జిమ్ కార్బెట్ ఈ పార్క్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించినందున దీనికి ఆ పేరు వచ్చింది. ఇక్కడ బెంగాల్ టైగర్‌తో పాటు...చిరుతపులులు, హిమాలయన్ నల్ల ఎలుగుబంటి, హాగ్ డీర్ తదితర వన్యప్రాణులను చూసి ఎంజాయ్ చేయవచ్చు.



కజిరంగా నేషనల్ పార్క్

మీరు ఒంటి కొమ్ము ఉన్న ఖడ్గమృగాన్ని చూడాలంటే మాత్రం తప్పకుండా కజిరంగా నేషనల్ పార్క్‌కు వెళ్లాల్సిందే. దేశంలో మరెక్కడా ఇవి కనిపించవు. ఇది అస్సాంలో గౌహతి-జోర్హాత్ జాతీయ రహదారి 37 మీద జోర్హాత్ కు సమీపంలో ఉంది. ఈ పార్క్ సందర్శకులకు పచ్చని ప్రకృతి కనువిందు చేస్తుంది. ఇక్కడ ఖడ్గమృగంతో పాటు ఏనుగుల గుంపులు, ఇతర వన్యప్రాణులతో పాటు రకరకాల అందమైన పక్షులను చూడవచ్చు.

గిర్ ఫారెస్ట్ నేషనల్ పార్క్

అడవికి రారాజు సింహాలను చూసి ఎంజాయ్ చేయాలనుకుంటే తప్పకుండా గిర్ ఫారెస్ట్ నేషనల్ పార్క్ ను సందర్శించాల్సిందే. ఆసియా సింహరాజాలకు ప్రసిద్ధమైన ఈ పార్క్ గుజరాత్‌లోని తలాలా(గిర్) సమీపంలో గిర్ అభయారణ్యంలో ఉంది. ఇందులో సింహాలే కాకుండా చిరుతపులులు, హైనాలు, అడవి పిల్లులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వలసవచ్చిన పక్షులు పర్యాటకులకు కనువిందు చేస్తాయి.


సుందర్‌బన్స్ నేషనల్ పార్క్

సుందర్‌బన్స్ నేషనల్ పార్క్ కూడా బెంగాల్ టైగర్లకు ప్రసిద్ధి. ఇది వెస్ట్ బెంగాల్ రాజధాని కోల్‌కతాకు సమీపంలో ఉంది. ఇది గంగాడెల్టా ప్రాంతంలోని సుందర్ బన్స్‌లో భాగంగా, బంగ్లాదేశ్‌లోని సుందర్‌బన్స్ రిజర్వు ఫారెస్టు సరిహద్దుల్లో ఉంది. మరోవైపు గంగా డెల్టా ప్రాంతమంతా దట్టమైన మడ అడవులతో పర్యాటకులను అలరిస్తుంది. ఇందులో బెంగాల్ టైగర్‌తో పాటు ముంగిసలు,ఫ్లైయింగ్ ఫాక్స్ (గబ్బిలాలు), ఉప్పునీటి మొసళ్లు, వలస పక్షులు కనువిందుచేస్తాయి. అలాగే సముద్ర జంతువులను కూడా చూడవచ్చు. అయితే సముద్ర జంతువులను చూడాలంటే స్థానికంగా ఉండే బోట్లలో ప్రయాణం తప్పనిసరి. పర్యాటకులకు అదో అందమైన అనుభూతి.

బాందవ్‌గర్ నేషనల్ పార్క్

ఇది భారతదేశ నడిబొడ్డున ఉన్న పార్క్. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉమారియా జిల్లాలో ఉంది. పులులు అధిక సంఖ్యలో ఉన్న పార్క్.... .బాందవ్‌గర్ నేషనల్ పార్క్‌లో ముఖ్యంగా తెల్లపులులు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. చిరుత పులులు, మనుబోతులు,దేశీయ నక్కలు, మొరిగే జింకలకు, జీవవైవిధ్యానికి నిలయంగా ఈ పార్క్ ప్రాచుర్యం పొందింది.

గురుప్రసాదం



1944-45 ఆ ప్రాంతంలో ఒకనాడు మధ్యాహ్నం రెండు దాటిన వెనుక నిదానంగా ఆశ్రమానికి వెళ్లాను. భక్తులంతా ఏదో నములుతూ తిరుగుతున్నారు. ఏమది? అని అడిగితే కొబ్బరిచెట్లు కొన్ని గాలికి పడిపోయినవనీ ఆ చెట్లకున్న కాయలు బాగా ముదిరితే కొన్ని పగులకొట్టామనీ, అందులో పెద్దపెద్ద పూవులు వచ్చాయనీ, ఆ పూవులు తెల్లగా వుండి చాలా తియ్యగా ఉంటవనీ, అవి తింటున్నామని చెప్పారు. అల్లాగా? అని భగవాను సన్నిధికి వెళ్లాను. భగవాన్ ఆ పూవులోని కొంత భాగం ఎడమచేతిలో పెట్టుకుని కుడిచేతితో కొంచెం కొంచెం తుంపి ఎత్తి నోట్లో వేసుకుని తింటూ వున్నారు. నన్ను చూస్తూనే ''అదిగో నాగమ్మ వచ్చిందయ్యా, దానికి గూడా ఇవ్వండి''అన్నారు. ''అయ్యో అంతా

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

అయిపోయిందే'' అన్నారు సమీపవర్తులు.

సాధారణంగా ఏదైన మధ్యాహ్న సమయంలో వచ్చే ఈ ఫలహారాలు నేను వచ్చేసరికి అందరికీ పంచటం అయిపోతే భగవాన్ తమ చేతిలోనిది ఇస్తామని అనేవారు. వారు తీసు కొనేదే చాలా తక్కువ. ఆ కొంచెం వారి కడుపులో పడకుండా అడ్డుపడటమెందుకని పాకశాలకు వెళ్లి తెచ్చుకుంటానని చెప్పి లోపలకు వెళ్లి తినేదాన్ని. ఈసారీన్నీ అలాగే చేద్దామని పాకశాలవైపు చూచాను. నా చూపటు తిరిగిందో లేదో భగ వాన్ అందుకొని, ''సరి సరి. ఇది అక్కడ ఉండదు. ఇక్కడే అంతా అయిపోయింది. ఇల్లారా, కొబ్బరిలాగా ఎంతో తియ్యగా వుంటుంది'' అని పిలిచారు. భగవదాజ్ఞ మీరలేక దగ్గరకు వెళ్లాను. తాము తినగా మిగిలినదంతా నా దోసిట్లో పెట్టారు. ''అయ్యో అంతా ఎందుకు'' అన్నాను నేను. ''ఉండనీ, ఉండనీ. నేను చాలా తిన్నాను. నీవంతే మిగి లింది'' అన్నారు భగవాన్. మహ ప్రసాదంగా గ్రహించి, అమృతతుల్యంగా ఆర గించాను. ఆవిధంగా శ్రీవారిచేత ప్రసాదం అయాచితంగా లభించినందుకు ఎంత ఆనందం గలిగిందో చెప్పేందుకు వశంగాదు. - **''గురోరుచ్ఛిష్ట భోజనం''** అన్నదానికి యిదే సరిగానీ, ఎంగి లాకులో తినటం కాదని భగవాన్ ఈవి ధంగా చూపి బోధించారని నేనూహించాను.

కొండమీద వుండగానూ ఇప్పటి ఆశ్రమం ఏర్పడ్డ కొత్తలోనూ భగవాన్ వంటలో పాల్గొనేవారు గనుక ఆనాటి వారందరికీ వారి చేతిప్రసాదం లభించిందేమోగాని నేను వచ్చిన వెనుక అదేమీ లేదు. అందువల్ల ఆనాడు కొబ్బరిపూవు ప్రసాదం అందులో వారు తింటూ తింటూ ఇచ్చినది లభించటం నా పూర్వపుణ్య విశేషమేనని అంతా వింతగా అన్నారు.

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu website http://www.sriramanamaharshi.org/tel/

పిపీలికా భక్తే అత్యుత్తమమా?



భక్తి అనే పదం అందరికీ తెలిసిందే. దేవుని ఆరాధనలో భక్తే ముఖ్యం అంటారు. భగవంతుడు వెన్నలాంటివాడు. సుతిమెత్తగా ఉంటాడు. భక్తి అనే చిన్న వేడి జోడిస్తే కరిగిపోయి అనుగ్రహం అనే నెయ్యిని ప్రసాదిస్తాడు. మనం చూపే చిన్న పాటి భక్తికి భగవంతుడు లొంగిపోతాడు. అనంతమైన అనుగ్రహాన్ని నిండుగా, దండిగా, మెండుగా భక్తుని మీద కురిపిస్తాడు. అంతటి అనంత కరుణాంతరంగం భగవంతునిది.

పరోక్షంగా భక్తి కున్న శక్తిని చెప్పకనే చెబుతుందిది. భక్తి, కర్మ, రాజ, జ్ఞానయోగాల గురించి మనం వింటున్నాం. నవ విధ భక్తి తొమ్మిది విధాలైన భక్తుల గురించి చెబుతుంది. వారివారి విధానాలు వేరుగా ఉన్న అందరి అభిమతం భగవంతుని చేరుకోవడమే! అలాగే భక్తి మార్గాలు, అందులో నుంచే న్యాయాలు. ఇలా ఎన్నో ఎన్నెన్నో. అయితే అంతగా ప్రచారంలో లేని మూడు భక్తి విధానాలు కూడా ఉన్నాయి. అవి విహంగ భక్తి, మర్కట భక్తి, పిపీలికా భక్తి. వాటి కథా కమామిషు తెలుసుకుందాం.

'రమ'ణీయం

విహంగ భక్తి

విహంగం అంటే పక్షి. పక్షి ఎక్కడెక్కడో ఆకాశం ఎత్తుల్లో ఎగురుతూంటుంది. గగనంలో గిరికీలు కొడుతుంది. ఆ క్రమంలో కింద ఎక్కడో పళ్లతో నిండిన తోట కనిపిస్తుంది. పళ్లు తినాలనిపిస్తుంది. అదే వేగంతో పండ్ల చెట్టు కొమ్మ మీద వాలుతుంది. ఆ వేగానికి కొమ్మ ఊగిపోయి ఆరముగ్గిపోయి రాలడానికి సిద్ధంగా ఉన్న పళ్లు రాలిపోతాయి. దానితో మరొక కొమ్మ మీద వాలుతుంది. ఆ వేగానికి ఆ కొమ్మకున్న పళ్లూ రాలిపోతాయి. ఇలా అన్ని కొమ్మలకున్న ఆరముగ్గిన పళ్లు రాలిపోతాయి. దానితో మిగిలిన పండ్లలో ఏవి పండాయో తెలుసుకునేందుకు వాటిని ముక్కుతో కొట్టి, వాసన చూసి తెలుసుకోవాలనుకుంటుంది. వాటిని నిర్ధారించుకునే లోపల కాపలాదారు రానేవస్తాడు. తరిమేస్తాడు. చివరకు ఏమయింది. కొమ్మల మీద అటూ ఇటూ తిరిగింది. అక్కడక్కడా పొడిచి కొంత దక్కించుకుంది తప్ప పూర్తి ఫలం దక్కదు. ఈ భక్తితో వచ్చే భగవదనుగ్రహమూ అంతే. ఇక్కడ మనం గమనించాల్సిన అంశం ఒకటుంది. పరిపూర్ణంగా అనుగ్రహం దక్కించుకోవాలంటే మన సాధన స్థిరంగా, నిశ్చలంగా, నిదానంగా సాగించాలి. ఆదరా బాదరా వేగంతో కాక నెమ్మదిగా, జాగరూకతతో కూడిన విధానంతో ముందుకు సాగాలి. ఇది ఆ విషయాన్ని తెలియజేస్తుంది.

మర్కటభక్తి

మర్కటం అంటే కోతి. కోతి చంచలమైనది. నిలకడగా ఉండదు. కింద పడుతుంది, దూకుతుంది. గెంతులు వేస్తుంది. కోతి చేష్టలు అంటారుగా! చిలిపి చేష్టలు చేస్తుంది. తనకు కావాల్సిన పండును సూటిగా అందుకోకుండా పండ్లున్న కొమ్మలను విరిచేస్తుంది. అంతలోనే ఆ పండ్లను విసిరేస్తుంటుంది. కొన్నిటిని కొరికి పడేస్తుంది. ఇది అంతా చూసి కాపలాదారు వస్తాడు. కర్ర విసురుతాడు. కోతికి దెబ్బ తగులుతుంది, ఒక్క పండూ దానికి దక్కదు. దీని ద్వారా గ్రహించవలసిందికూడా స్థిరత్వం గురించే. కొందరు దైవానుగ్రహం కోసం ఆ గుళ్లూ, ఈ గుళ్లూ అంటూ తిరిగి కొన్నాళ్ళ తర్వాత అవి మానేసి వ్రతాలు, అర్చనలు మొదలెడతారు. ఇలా ఏ ఒక్క స్వరూపం పైనా, విధానంపైనా దృష్టినిలపకుండా చపల చిత్తంతో అందరు దేవుళ్ళను ఎవరేది చెబితే అది చేస్తుంటే నిశ్చలంగా, స్థిరంగా ఏ రూపాన్ని పట్టుకోలేరు. దీని వల్ల కూడా ఫలితం ఉండదు.

పిపీలికా భక్తి

పిపీలికం అంటే చీమ. చీమ మెల్లగా చెట్టు మొదటన బయలుదేరి కొమ్మమీద నుంచి, రెమ్మ మీద నుంచి తిన్నగా తనకి కావలసిన పండు వద్దకు వెళుతుంది. ఏమాత్రం చడిచప్పుడు చేయకుండా పండుకి చిన్న రంధ్రం చేస్తుంది. తను ఆ పండు రసం బిందు పరిమాణంలో ఆస్వాదించి మళ్లీ వెనక్కి వచ్చి తన వాళ్ళందరికీ చెబుతుంది. వాళ్లు కూడా ఆ రసాన్ని ఆస్వాదించాలని. విషయం తెలుసుకున్న చీమలు బారులు కడతాయి. ఇక్కడ మనం చూడవలసింది చీమ వ్యవహరించిన తీరు. చీమ తొందరపడలేదు, చిందరవందర చేయలేదు, ఊగిపోలేదు. ఊపెయ్యను లేదు, కాయల్ని, పండ్లని నేలపాలు చేయలేదు. తాను ఒక్కతే కాకుండా తన వాళ్ళందరికీ ఈ రసం దక్కేలా చేసింది. అంటే నిదానంగా శోధన చేసి సాధనలతో మెల్లగా తనకు కావలసిన అమృతాన్ని పొందింది చీమ. అందుకే పిపీలికా భక్తి విధానం అత్యుత్తమమైనది. మనం కూడా హంగూ ఆర్భాటాలు లేకుండా మెల్లగా భగవంతునిపై దృష్టిపెట్టి భక్తితో ఆరాధిస్తే భగవదనుగ్రహాన్ని పొందవచ్చు. దానిని నలుగురికీ పంచవచ్చు.



- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

చింతన

తిరుప్పావై

పాశురం 21

ఏత్తకలఙ్గళ్ ఎదిర్ పొఙ్గి మీదళిప్ప
మాత్తాదే పాల్ శొరియుమ్ వళ్లల్ పెరుమ్ పశుక్కళ్
ఆత్తప్పడైత్తాన్ మగనే! అఱివుఱాయ్
ఊత్తముడైయాయ్! పెరియాయ్! ఉలగినిల్
తోత్తమాయ్ నిన్ఱశుడరే! తుయిలెళాయ్;
మాత్తారునక్కు వలితులైన్దు ఉన్ వాశఱ్కణ్
ఆత్తాదు వన్దు ఉన్నడి పణియుమాపోలే
పోత్తియామ్ వన్దోమ్ పుగళ్ న్దు ఏలోరెమ్బావాయ్

తాత్పర్యం




అభిముఖురాలై వచ్చి గోష్ఠిలో చేరిన శ్రీనీళాదేవితో కలసి అంతా శ్రీకృష్ణుని లేపుట, ఎత్తిపెట్టిన కుండలు పెట్టుటయే తడవుగ పైపైకి పొంగి పొరలి పోతున్ననూ ఆపుట అనేది లేక ఏకధారగపాలను కురిపించు ఔదార్యం గల గొప్ప పశువుల సమూహ ములనేకములు గల నందుని ముద్దు బిడ్డడైన శ్రీకృష్ణా తెలివి తెచ్చుకోవయ్యా! దృఢమైన వేద ప్రతిపాద్యుడా! ఇంత మాత్రమే అని చెప్ప వీలుకాని అపరిచ్ఛేద్యుడవే అయినా మా కొరకై లోకంలో ఒక రూపాన్ని ధరించి కన్పట్టుచూ నిలిచిన తేజో విశిష్టుడా! నిదుర లెమ్మా! శత్రువులు నీ బలము ముందు నిర్వీర్యులై నీ వాకిటను విడువలేక వచ్చి నీ పాదసేవకుద్యమించినట్లే మేమున్నూ నీ గుణముల ముందు ఓడిపోయి స్త్రీత్వాహంకారము వదలి నిను కీర్తింప, మంగళమాలా పింపవచ్చి పడియుంటిమయ్యా! లేచి రమ్మా!.



- జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సౌజన్యంతో

అహంకారం వీడితేనే ఉన్నతికి ప్రకాశం



జ్ఞేయః స నిత్య సన్న్యాసీ
యోనద్వేష్టి న కాంక్షతి
నిర్ద్వంద్వోహి మహాబాహో
సుఖం బంధాత్ ప్రముచ్యతే

(అర్జునా! ఎవరినీ ద్వేషించనివాడు, దేనినీ ఆశించనివాడు, నిత్య సన్న్యాసి అయినవాడు ద్వంద్వాలను అధిగమించి అనాయాసంగా బంధవిముక్తుడవుతాడు)

ఇది భగవద్గీతలోని శ్లోకం. తనకెంత ప్రాప్తమవుతుందో దానితోనే సంతృప్తి చెందాలి గాని వేటిని ఆశించరాదు. తనకనవసరమైనవి కేవలం తన గొప్పతనం చాటుకోవడానికి అసలు ఆశించరాదనేది దాని అర్థం. నడమంత్రాన వచ్చిన అధికారాలను, ఆడంబరాలను చూసుకుని చాలా మంది మిడిసిపడుతుంటారు. కాని వారంతా తర్వాత భంగపడక తప్పదు. వెల్లుల్లి రసం ఉంచిన గిన్నెను ఎన్నిసార్లు కడిగినా ఆ వాసన పోదు. అజ్ఞానంతో నిండిన మనస్సు నుంచి అహంకారం తొలగడం కూడా అంతే కష్టం. ప్రతి వ్యక్తి, తనలోని అహంకారాన్ని తొలగించుకోవాలి. ముఖ్యంగా దుష్ట అహంకారాన్ని త్యాగం చేయాలి. ఈ అహం, జీవాత్మ, పరమాత్మల మధ్య వ్యత్యాసాన్ని కల్పిస్తుంది. 'నేనెవరో తెలియదా? నా శక్తులేమిటో తెలియదా?' ఇలా చాటుకోవడం దుష్ట అహంకారానికి ఉదాహరణ. ఎంతటి తపశ్శాలి అయినా అహంకారానికి బానిస కారాదు. అటువంటి లక్షణాలు ఉన్న సన్న్యాసి భంగపడక తప్పదు.

ఇలాంటి దుష్ట అహంకారి, గర్విష్ఠి అయిన ఒక ఋషిని భగవంతుడు ఎలా సన్మార్గంలో పెట్టాడో తెలియజేసే కథ ఒకటుంది. చూద్దాం. ఒక దట్టమైన అడవిలో ఋష్యాశ్రమం ఉండేది. అక్కడి ఋషి ముప్పై, నలభై సంవత్సరాలు కఠోర తపస్సు చేశాడు. రెండు అద్భుత శక్తులను సాధించాడు. ఆ అద్భుత శక్తుల్లో ఒకటి ప్రాణం తీసే శక్తి కాగా మరోటి ప్రాణం పోసే శక్తి. ఈ అద్భుత శక్తులతో అతను అహంకారి, గర్విష్ఠి అయ్యాడు. అందరినీ గేలి చేసేవాడు. అతనికి ఉన్న శక్తులకు భయపడి ఎవరూ అతనిని ఎదిరించేవారు కాదు. గర్వంతో అతనిలో ఋషీశ్వరునికి, జ్ఞానికి ఉండాల్సిన లక్షణాలు పోయాయి. జ్ఞానులకు ఉండాల్సిన లక్షణాలను శాస్త్రం పేర్కొంది. తనను తాను పొగుడుకోకూడదు. ఇతరులు తనను పొగడాలనుకోకూడదు. ఇతర ప్రాణులను పీడించకూడదు. డాంబికాచారాలను అనుసరించకూడదు. నిర్వికార చిత్తంతో ఉండాలి. సరళ స్వభావం అలవరచుకోవాలి. ముఖ్యంగా మోక్షం యందు ఏక నిష్ఠ కలిగి ఉండాలి. వీటికి విరుద్ధ లక్షణాలున్నవాడు అజ్ఞాని . ఆ ఋషిలో అజ్ఞాని లక్షణాలే ఉన్నాయి. అతనికి గల శక్తులు పరోపకారానికే కాక పర అపకారానికే ఉపయోగించేవాడు.

సర్వాంతర్యామి అయిన భగవంతుడు ఈ దురహంకారికి బుద్ధి చెప్పాలనుకున్నాడు. సాధువు వేషం ధరించి ఆ ఋషి ఉంటున్న ఆశ్రమానికి వెళ్లాడు. ఆ ప్రాంతం ప్రజలు ఆ ఋషి వద్దకు వెళ్లవద్దని హెచ్చరించారు. అయితే తాను అతని శక్తులు, అహంకారం గురించి విన్నానని, చూడడానికి వచ్చానని, తన ప్రాణానికి ముప్పు లేదని ఆ ఋషి వద్దకు వెళ్ళాడు. 'మీ శక్తుల గురించి లోకం కోడై కూస్తోంది అది నిజమా?' అని ప్రశ్నించాడు. దానికి ఋషి సంతోషించి, 'నీవు విన్నది నిజమే ముప్ఫై సంవత్సరాలు తపస్సు చేసి ఎవరినైనా చంపగల, అలా చనిపోయిన వారిని బ్రతికించగల శక్తిని పొందేను' అన్నాడు. ఆ సమయంలో ఆశ్రమం దగ్గర నుంచి ఒక ఏనుగు వెడుతోంది. సాధు వేషధారి అయిన భగవంతుడు దానిని చంపమని ఋషిని అడిగాడు. అతను అలాగే చేశాడు. వెంటనే సాధువు, 'అనవసరంగా ఏనుగు ప్రాణం తీయించాను. ఆ పాపం నాకు అంటకుండా దానిని బతికించండి అన్నాడు. దానికి ఋషి తన శక్తి చూపాలనే ఉబలాటంతో 'నేనూ అనవసరంగా జీవహింస చేయను, ఆ ఏనుగు నాకు అపకారం చేయలేదు కనుక దానిని బతికిస్తానని నీరు అభిమంత్రించి దానిపై చల్లాడు. అది నిద్ర నుంచి లేచినట్లు లేచి వెళ్లిపోయింది. అప్పుడు సాధువు 'స్వామీ మీ ప్రతిభ విలక్షణమైంది. మీరు మీ అద్భుత శక్తులతో ఏనుగును తృటిలో సంహరించారు. దానికి తిరిగి జీవం పోయడానికి అంతే సమయం పట్టింది' అన్నాడు. ఋషి పొంగిపోయాడు. సాధువు కొనసాగించాడు 'అయితే ముప్ఫై సంవత్సరాలు కఠోర తపస్సుకు వినియోగించి, మీరు సాధించిన ఆ శక్తుల వల్ల మీకు కాని ఇతరులకు కాని ఏమి లాభం కలిగింది. ఇన్ని సంవత్సరాలు తపస్సు చేసి గారడీ వాని మాదిరి ప్రవర్తించారు. ఇవి కాక సత్కర్మలు చేస్తే అవి పురాకృత పాపాలను నశింపజేస్తాయి. మీ తోటి వారిని ప్రేమించండి, వారి కష్టాలు, కడగండ్లు తీర్చే సాధన చేయండి. అహంకారం వీడండి' అని బోధించి తన దారిన తాను వెళ్లిపోయాడు. సాధువు రూపంలో ఉన్న భగవంతుని మాటలతో ఋషికి కనువిప్పు కలిగింది.

- గుమ్మా ప్రసాదరావు
(భిలాయ్)
09755110398

దిన ఫలాలు

మేష రాశి: కుటుంబ సఖ్యత పెరుగుతుంది. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. అధికారులతో సంబంధ, బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆధ్యాత్మిక కార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో శుభపరిణామాలు చోటు చేసుకొంటాయి. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ వత్తిడులు పెరుగుతాయి. ఆదాయంలో ఇబ్బందులను నెట్టుకురాగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్య క్రమాలు అనుకూలం. అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. శ్రమతో కూడిన కార్యాలు, అసంతృప్తి ఉంటాయి. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆరోగ్య పరీక్షలు ఉపశమనం కలిగి స్తాయి. స్థిరాస్తి విషయాలు అనుకూలం. మానసిక ధైర్యం పెరుగుతుంది. నిర్ణయాలు అమలు పరచగలుగుతారు. రాజకీయ వ్యవహారాల్లో చుక్కెదురు ఉంటుంది. పనులపై ఒత్తిడి అధిగమించగలుగుతారు. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/ వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తి డులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: సాహస నిర్ణయాలు లాభిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ప్రభుత్వ జరిమానాలు పెరుగుతాయి. ఆదా యంలో ఆశించిన ఫలితాలు పొందగలుగుతారు.

తులా రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు ఉపకరిస్తాయి. ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. వేగవంతమయిన నిర్ణ యాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పొరపాట్లను విస్మరించటం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరి స్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: విదేశీ సంభాషణలు/ లావాదేవీలు లాభిస్తాయి. ఒత్తిడులని వేగవంతంగా ఎదుర్కోలేక పోతారు. ఆరోగ్యంలో అనుకూలత పెరుగుతుంది. వృత్తిలో పోటీ పెరుగు తుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: వ్యాపార ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. మంచి కార్యాలలో కూడా విమర్శలకు గురవుతారు. ఆదాయంలో ఆటంకాలని చవి చూస్తారు.

కుంభరాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. ఆనందకర సంఘటనలు గృహంలో ఏర్పడతాయి. శ్రమ అధికంగా ఉన్నా, విజయాలు సాధ్యపడతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ పెరుగుతుంది. స్థిరాస్తి విషయాల్లో శ్రద్ధ తప్పనిసరి. నూతన ప్రణాళికలు వృత్తిలో లాభిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


మీనరాశి: విదేశీ ప్రయాణాలు కలసి వస్తాయి. అలసత్వం పెరుగుతుంది.అవకాశాలను సద్వినియోగ పరచుకోగలుగుతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో అనుకూల పరిస్థితులు ఉంటా యి. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



తలపొగరు



ఒక అడవిలోని గుహలో చాలా బలిష్టమైన సింహం ఉండేది. తనకంటే బలమైన జంతువు ఈ సృష్టిలో లేదని సింహం తల పొగరుతో జీవించేది. సింహం గుహవైపుకు ఏ ప్రాణి వెళ్లినా దానికి ఆహారం కాక మానదు. ఈ విషయం తెలిసిన ఏ జంతువు సింహం నివసిస్తున్న గుహవైపుకు వెళ్లేవి కావు. దాంతో సింహానికి ఆహారం దొరక్క ఆకలితో అలమటిస్తూ నీరసించ సాగింది. ఈ విషయం తెలిసిన నాలుగు నక్కలు సింహం వద్దకు వెళ్లాయి.

''మృగరాజా! మనం ఒక ఒప్పందం చేసుకుందాము. మేము మాయమాటలు చెప్పి జంతువులను నీ వద్దకు తీసుకుని వస్తాము. వాటిని చంపిన పిదప మా నలుగురికీ కొంత భాగం ఆహారాన్ని ఇచ్చి మిగిలింది నువ్వు తినాలి''అన్నాయి నక్కలు.

నాకు సమ్మతమే అంగీకరించాడు మృగరాజు.

ఆ రోజు నుండి రోజుకో జంతువుకు మాయమాటలు చెప్పి సింహం వద్దకు నక్కలు తెచ్చేవి. సింహం ఆ జంతువుపై పడి పీక కొరికి చంపేసి మెత్తటి మాంసాన్ని తినేసి కేవలం ఎముకల్ని మాత్రమే నక్కలకు మిగిల్చేది. కొంతకాలం ఆ ఎముకలనే నక్కలు తిన్నాయి. మంచి మాంసం సింహం తిని ఎముకలను తమకు మిగల్చడం నక్కలకు నచ్చలేదు. వాటికి బాగా కోపం వచ్చింది. తమ వల్లే సింహానికి ఆహారం దొరుకుతుందని భావించి తల పొగరు తలకెక్కించుకున్నాయి. ఇతర జంతువులను మాయమాటలు చెప్పి సింహానికి ఆహారంగా అందించి పాపం చేస్తున్న సంగతిని నక్కలు మరిచిపోయాయి. తామెంతో ఉత్తమోత్తములని భ్రమలో జీవిస్తున్నాయి.

''మేము ఆహారంలో భాగాన్ని కోరాము. కానీ ఈ సింహం తాను తినగా మిగిలిన ఎముకల్ని మాత్రమే మాకు ఇస్తుంది. దీని అంతు తేల్చాలి'' అని నక్కలు తన పొగరుతో ప్రగల్బాలు పలికాయి.

దీన్ని చావ గొట్టిందాకా నాకు మనశ్శాంతి లేదు అంది ఒక నక్క. మనం జంతువులన్ని తేవడం వల్లనే దీనికి ఆహారం లభిస్తుంది. దీన్ని నాశనం చేసిందాకా నాకు తృప్తి లేదు అంది ఇంకో నక్క.

చాటుగా ఉన్న సింహం ఈ మాటలు విని ఇప్పుడు నేను మీ అంతు చూస్తాను అంటూ నక్కలను వెంబడించింది.

చాలా దూరం నక్కలు పరుగెత్తాయి. అయినా సింహం వాటిని వెంబడించింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నక్కలు పరుగెత్తాయి. శరవేగంతో పరుగెత్తే నక్కలు గమనించక ప్రాచీన కోట గోడ ప్రక్కనే శత్రువుల నుండి రక్షణార్థం నిర్మించిన పది అడుగుల కందకంలో పడిపోయాయి. నీళ్లలో పడటం వల్ల వాటికి దెబ్బలు తగలలేదు. సింహం కూడా అంతే వేగంతో పరుగెత్తుకొని వచ్చి కందకంలో పడింది. అన్నీ ఈదుకుంటూ వెళ్లి చిన్నపాటి మట్టి దిబ్బ ప్రదేశానికి చేరాయి. చుట్టూ పది అడుగుల గోడ ఉండటంతో అవి పైకి రావడానికి అవకాశం కలుగలేదు. కోపంతో రగిలి పోయిన సింహం నక్కలను పీక కొరికి చంపేసింది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు ప్రభుత్వ అధికారులు దృష్టికి ఈ సంఘటన గురించి తెలియజేశారు. వాళ్లు మందీ మార్బలంతో వచ్చి సింహాన్ని బంధించి జంతు ప్రదర్శనశాలకు త రలించాయి. తల పొగరుతో నక్కలు ప్రాణాలు కోల్పోగా, సింహం మిగిలిన జీవితాన్ని జంతు ప్రదర్శనశాలలో జీవచ్ఛవంలా గడిపింది.

- షేక్ అబ్దుల్ హకీం జాని

అరుణాచల్ ప్రదేశ్‌లో మొదటి సూర్య కిరణాలు




పిల్లలూ! మన దేశంలో మొట్ట మొదటిసారిగా సూర్య కిరణాలు పడే ప్రాంతం ఎక్కడో మీకు తెలుసా? అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిరోజు మొట్టమొదటి సూర్యకిరణాలు పడతాయని శాస్త్రవేత్తలు చాన్నాళ్ల క్రితమే కనుగొన్నారు. ఈ విషయం చాలామందికి తెలియదు. ఈ అపురూప దృశ్యాన్ని చూడటానికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు డాంగ్ పట్టణానికి వస్తున్నారు. డాంగ్ అనేది అండమాన్, నికోబార్ ఐలాండ్స్ వద్ద ఉంది. చైనా, మయన్మార్ మధ్య ఉంటుంది. సముద్ర మట్టానికి 1,240 మీటర్ల ఎత్తులో ఉంది. ఇక్కడికి రావడానికి రోడ్డు మార్గం లేదు. కనీసం బైక్ మీద కూడా చేరుకోలేం. ఇంత అందమైన దృశ్యాన్ని చూడాలంటే కొంత కసరత్తు చేయాల్సిందే మరి. ఈ సంవత్సరం జనవరి 5వ తేదీన(శనివారం) సూర్యోదయం టైమింగ్స్ గూర్చి తెలుసుకోవాలనుకుంటున్నారా? ఉదయం ఐదుగంటల 54 నిమిషాలకు సూర్యోదయం అలాగే సూర్యాస్తమయం నాలుగు గంటల 25 నిమిషాలకు ఉంది.





పక పక

టైం ఎంతయ్యిందో చూడు




సన్నీ: ఇంట్లోవాళ్లతో పెద్ద పరేషాన్ ఉంది
భూషణ్: ఎందుకు?
సన్నీ: వాళ్లకి గడియారంలో టైమ్ చూడటం కూడా రావడం లేదు
భూషణ్: అంటే?
సన్నీ: పొద్దు పొద్దున్నే నన్ను జబర్దస్తీ లేపుతారు. ఒరేయ్ నిద్రలే, చూడు టైం ఎంతయ్యిందో చూడు అంటారు

ప్లాన్ ఏంటి?



నిఖిల్‌కాంత్ ఎయిర్‌టెల్ ఆఫీస్‌కి ఫోన్ చేశాడు.
నిఖిల్ కాంత్: నా ఫోన్ బిల్లు చాలా ఎక్కువగా వచ్చింది ఇంతలా నేను మాట్లాడనే లేదు
ఎయిర్‌టెల్ ఆఫీస్ ఉద్యోగి: సరే మీ ప్లాన్ ఏంటి?
నిఖిల్ కాంత్: ఇప్పుడైతే మార్కెట్‌కి వచ్చాను సాయంత్రం డిన్నర్‌పార్టీ ఉంది వెళ్లాలి. మరి మీ ప్లాన్ చెప్పండి.

బ్రతికిపోయింది



రవి: నేను అరెస్ట్ అవబోతున్నాను.
నర్సింహ: ఎందుకు నువ్వేం చేశావు?
రవి: నేను నా భార్య నెత్తిమీద కట్టెతో గట్టిగా కొట్టాను.
నర్సింహ: అయితే పాపం ఆమె చచ్చిపోయిందా
రవి: లేదు బ్రతికిపోయింది. ఇప్పుడామె నన్ను చంపేస్తుంది.

రజనీకాంత్



రజనీకాంత్ ఫోన్ చేశాడు
రజనీకాంత్: హల్లో నేను రజనీకాంత్ మాట్లాడుతున్నాను
తేజ: అవును నాకు తెలుసు. చెప్పండి
రజనీకాంత్: నీకెలా తెలుసు. నేను రజనీకాంత్ అని
తేజ: నా మొబైల్ ఫోన్ స్విచ్చాఫ్ అయింది భాయ్ మొబైల్ స్విచ్చాఫ్ అయితే కాల్ వచ్చిందంటే రజనీకాంత్ అని అర్థం కదా!

బంగారు పలుకు



- హెలెన్ కెల్లర్

గొప్ప పనులు చెయ్యాలని నాకూ ఉంటుంది. కానయితే ముందుగా చిన్న పనులు పూర్తి చెయ్యాలి కదా! గొప్ప గొప్ప వాళ్లు సాధించిన గొప్ప కార్యాల వల్ల ఈ ప్రపంచం ఎంత ముందుకి నడుస్తుందో, నాలాంటి చిన్నవాళ్లు అనేకులు చేసే పనుల వల్ల కూడా అంతే ముందుకు నడుస్తుంది

రంగేసుకోండి



ఇక్కడ ఉడతలు ఉన్నాయి. మీ ఇష్టం వచ్చిన రంగులు వేసుకుని బొమ్మను హుషారెత్తించండి.

జనరల్ నాలెడ్జ్



దేశంలో అతిపెద్ద బ్రిడ్జి

దేశంలో అతిపెద్దదైన బ్రిడ్జి అస్సాం అరుణాచల్ రాష్ట్రా లను కలుపుతూ నిర్మించారు. బ్రహ్మపుత్ర నది మీద ఈ వంతెన నిర్మాణం జరిగింది. చైనాకు సరిహద్దు ప్రాంతంలో ఇటువంటి బ్రిడ్జి నిర్మాణం జరగడం హర్షణీయం.

అరుణాచల్ ప్రదేశ్ నుంచి అస్సాం వెళ్లాలంటే గతంలో దూరం ఉండేది. కానీ ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల ఈ దూరం బాగా తగ్గింది. దాదాపు నాలుగు గంటల వరకు సమయం ఆదా అవుతుంది. దీన్ని బోగిబిల్ బ్రిడ్జి అని అంటారు. 1997లో ప్రధాని దేవగౌడ ఈ బ్రిడ్జికి పునాది రాయి వేశారు. అటల్ బిహారి వాజ్‌పేయి దీన్ని ప్రారంభించారు.


120 ఏళ్ల వరకు బ్రిడ్జికి ఎటువంటి ఢోకాలేదు. ఐదువేల తొమ్మిది వందల కోట్ల రూపాయల ఖర్చుతో దీన్ని నిర్మించారు. అనుకున్నదానికంటే ఈ బ్రిడ్జి నిర్మాణఖర్చులు మూడు రెట్లు పెరిగిపోయాయి.ప్రపంచంలో ఇటువంటి బ్రిడ్జిలు అరుదుగా ఉన్నాయి.

కుందేలు కథలు

వణికించే చలి

రచన: కార్తిక్

బొమ్మలు: జానకిరామ్



స్లిప్పరీ కార్డ్ బోర్డు



కావాల్సిన పదార్థాలు
- ఒక కాఫీ మగ్
- ఒక చిన్న కార్డ్‌బోర్డ్ ముక్క
- ఒక రబ్బర్ బాల్

ఇలా చేయాలి

1. కాఫీ మగ్‌ని టేబుల్ మీద ఉంచాలి. దీనిమీద కార్డ్‌బోర్డ్ ముక్కను పెట్టాలి. మళ్లీ దీనిమీద రబ్బర్‌బాల్‌ని పెట్టాలి.
2. ఇప్పుడు నెమ్మదిగా కార్డ్‌బోర్డ్ ముక్కని లాక్కోవాలి. ఏం జరుగుతుందో చెప్పుకోండి. బాల్ క్రింద పడిపోతుంది.
3. ఈసారి మాత్రం కార్డ్‌బోర్డ్ ముక్క మీద రబ్బర్ బాల్ పెట్టాలి.
4. కార్డ్‌బోర్డ్ ముక్కను చటుక్కున మీ చూపుడువేలుతో చాలావేగంగా కొట్టాలి. పరిశీలించండి. ఈ సారి రబ్బర్‌బాల్ నేలమీద పడలేదు. కప్పులో పడిపోయింది.

ఓ సారి ఆలోచించండి

రబ్బర్ బాల్ కప్పులో పడిపోవడానికి కారణమేంటో తెలుసుకుంటే చాలా సింపుల్ ఫార్ములా ఉందని మనకర్థమవుతుంది. మీరెప్పుడైనా న్యూటన్ సైంటిస్ట్ గూర్చి విన్నారా? అయితే వినండి. న్యూటన్స్ ఫస్ట్ లా మోషన్ ప్రకారం ఒక విషయం అర్థం చేసుకోవాలి. నిలకడగా ఉన్న రబ్బర్‌బాల్ నిలకడగానే ఉండటానికి ప్రయత్నిస్తుంది. అది బయటినుంచి ఒత్తిడి లేనప్పుడే. మీరు కారులో ప్రయాణిస్తున్నారనుకోండి. అదే స్పీడుతో మరో కారు మీ పక్క నుంచి వెళుతుంది అనుకోండి. కారు స్పీడు ఎంతో తెలుసుకోవడం కష్టం. ఎప్పుడైతే సడెన్‌గా బ్రేక్ వేస్తే కారు ఆగిపోతుంది. కానీ మీరు మాత్రం కొంచెం ముందుకు వెళతారు. సీట్ బెల్ట్ పెట్టుకుంటే మరీ ముందుకు వెళ్లకుండా ఆగిపోవచ్చు. ఎప్పుడైతే కార్డ్‌బోర్ట్ ముక్క నెమ్మదిగా కదిపితే మాత్రం రబ్బర్‌బాల్

2నెమ్మదిగా కదులుతుంది. రబ్బర్‌బాల్‌కి కార్డ్‌బోర్డ్‌కి మధ్య ఒకలాంటి ఒత్తిడికి గురై రబ్బర్‌బాల్ కార్డ్‌బోర్డ్ ముక్క రెండూ ఒకేసారి కదులుతాయి.

కార్డ్‌బోర్డ్ ముక్కను వేగంగా చూపుడువేలుతో కొడితే కార్డ్‌బోర్డ్ ముక్క క్రింద పడిపోతుంది. కానీ కార్డ్‌బోర్డ్ ముక్క మీద ఉన్న బాల్ మాత్రం నేరుగా కప్పులో పడిపోతుంది. రబ్బర్‌బాల్ మీద ఉన్న గురుత్వాకర్షణశక్తి(గ్రావిటీ) ఎక్కువై రబ్బర్‌బాల్ క్రిందే ఉన్న కప్పులో పడిపోతుంది.



పదాల అల్లిక (పజిల్)

పిల్లలూ... ఈ రోజు పదాల అల్లికలో ఇస్తున్న పదాల్లో ఒక గమ్మత్తు ఉంది. ఇవన్నీ నాలుగు అక్షరాలున్న పదాలే అయినా...మొదటి రెండు అక్షరాల పదమే తిరిగి మరోసారి వస్తుంది. గళ్లలో మొదటి మూడవ అక్షరాలు ఉన్నాయి...మీరు రెండు నాల్గవ అక్షరాలను నింపండి. ఈ రెండు గళ్లల్లో ఒకే అక్షరం వస్తుందని గుర్తుంచుకోండి-

1	ప		ప	
2	చ		చ	
3	ట		ట	
4	గ		గ	
5	ద		ద	
6	ట		ట	
7	ద		ద	
8	త		త	
9	జ		జ	
10	గ		గ	
11	గ		గ	
12	వ		వ	

ఆధారాలు

1. గట్టిగా హాయిగా ఇలా నవ్వండి
2. ఇలా నడిస్తే త్వరగా గమ్యం చేరతాం... ఇలా చేస్తే పనులు త్వరగా పూర్తవుతాయి.
3. వేగంగా ఆపకుండా చదివితే ఇలా అంటారు....చప్పుడుకి కూడా ఈ పదాన్ని వాడతారు
4. భయపెడితే......ఇలా ఆడించేశారు...అంటారు
5. తలుపులను ఇలాగే గట్టిగా బాదుతాం...
6. ఆకులపైనుండి మంచు చినుకులు ఇలాగే రాల్తాయి.
7. గుండెకొట్టుకునే వేగం పెరిగితే...ఇలా అంటాం
8. ఆకాశంలో నక్షత్రాలు ఇలా మెరుస్తాయి
9. ముత్యాలు కిందపడితే... ఇలా రాలాయంటారు.
10 టైమ్ అయిపోతుంటే...ఏ పనయినా ఇలాగే చేస్తాం
11. చలికి ఇలాగే వణుకుతాం...ఒక భారీ జంతువు పేరు కూడా ఇందులో ఉంది.
12 ఆపకుండా ఏడ్చే ఏడుపుని ఇలా అంటారు.

జవాబులు: 1. పకపక, 2. చకచక, 3. టకటక, 4. గడగడ, 5. దబదబ, 6. టపటప, 7. దడదడ, 8. తళతళ, 9. జలజల, 10 గబగబ, 11. గజగజ, 12. వలవల

నిర్వహణ: వి. దుర్గ



ఒక భాషకు మాత్రమే పరిమితం కాను

- కైరా అద్వానీ

నా సినీ కెరీర్‌లో ఇంత పెద్ద మాస్, కమర్షియల్ సినిమా చేయడం ఇదే తొలిసారి అని అందాల భామ కైరా అద్వానీ ఆనందంతో వెల్లడించింది. రామ్‌చరణ్‌కు జోడీగా ఆమె నటించిన చిత్రం వినయ విధేయ రామ. బోయపాటి దర్శకత్వంలో డి.వి.వి.దానయ్య నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో కథానాయిక కైరా అద్వానీ హైదరాబాద్‌లోని పాత్రికేయులతో కొద్దిసేపు ముచ్చటించారు.

విభిన్నమైన అనుభవం

ఇప్పటివరకు నా కెరీర్‌లో కొన్ని సినిమాలు చేశాను. అయితే ఇంత పెద్ద మాస్, కమర్షియల్ సినిమా ఎప్పుడూ చేయలేదు. దాదాపు పదిహేను మంది ప్రముఖ నటీనటులతో కలిసి ఈ చిత్రం చేయడం విభిన్నమైన అనుభవం. చిత్రానికి సంబంధించి సెట్స్ పాటలు, ఫైట్స్ మొదలుకుని ప్రతీ అంశం భారీగా అనిపించింది.

పాత్ర గురించి

ఈ చిత్రంలో నా పాత్ర పేరు సీత. కుటుంబంలో అందరి ముందు వినయంగా కనిపిస్తూ...రామ్ ఏది చెబితే దానినే అనుసరిస్తుంటాను. ఇల్లు దాటి బయటకు వస్తే...పాత్రోచితంగా చాలా డామినేటింగ్‌గా ఉంటాను. రామ్‌చరణ్‌కు, నాకు మధ్య వచ్చే సన్నివేశాలన్ని చాలా ఆసక్తికరంగా ఉంటాయి. అంతేకాదు మా ఇద్దరి కెమెస్ట్రీ భలే ఉంటుంది. దీని గురించి ఎక్కువ చెప్పడం కంటే విజువల్ పరంగా తెరపై చూసి ఆనందిస్తే మరింత బావుంటుంది. స్వతహాగా డ్యాన్స్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే నటిగా మారాను. కామెడీతో పాటు మంచి డ్యాన్స్, అలాగే నటనకు మంచి అవకాశం ఉన్న ఇలాంటి సినిమాలో అవకాశం దొరికినందుకు మహదానందంగా ఉంటుంది. ఈ సినిమా కోసం రామ్‌చరణ్‌తో స్టెప్స్ వేసినపుడు అలాంటి ఆనందమే కలిగింది. నేను ఇప్పటివరకు చేసిన పాటలలో రామా లవ్స్ సీత...అనే పాట నాకు అత్యంత ఇష్టం దాదాపు 800 మంది డ్యాన్సర్లతో ఆ పాటను ఎంతో అద్భుతంగా చిత్రీకరించారు.

చక్కటి కుటుంబ కథ

దర్శకుడు బోయపాటి శ్రీను ఈ చిత్రకథను వినిపించినపుడు సినిమా చూశాననే అనుభూతి కలిగింది. చాలాకాలం తర్వాత ఒక చక్కటి కుటుంబ కథను విన్నానని అనుకున్నాను. దాంతో ఎంతమాత్రం ఆలోచించకుండానే వెంటనే సినిమాలో నటించేందుకు అంగీకరించేశాను. సహజ సిద్ధమైన అంశాలను తెరపైకి తీసుకుని రావడం వేరు. అయితే నమ్మశక్యం కాని అంశాలను కూడా నమ్మేలా చిత్రీకరణ జరపడం చాలా చాలా కష్టం. దానిని సాధ్యం చేయడం బోయపాటి లాంటి దర్శకులకే కుదురుతుంది.

క్వాలిటీకి ప్రాధాన్యమిస్తా

సినిమాలో నేను ఎంత సేపు కనిపిస్తాను. నా పాత్ర నిడివి ఎక్కువగా ఉందా? తక్కువగా ఉందా? వంటి అంశాలకు కాకుండా నా పాత్ర క్వాలిటీ పరంగా బావుందా? లేదా? అన్న అంశాలకే ప్రాధాన్యమిస్తాను. నా పాత్ర తెరపై చూసినపుడు ప్రేక్షకులు ఎలా ఫీలయ్యారన్న అంశాన్ని ఎక్కువగా ఆలోచిస్తాను.

ఏ భాష అయినా ఫర్వాలేదు

నా మటుకు నాకు ఒక భాషకు చెందిన సినిమాలకు పరిమితం కావాలని లేనే లేదు. ఏ భాషకు చెందిన సినిమా అయినా గ్లోబల్ ప్రేక్షకులకు వినోదాన్ని పంచాలన్నదే నా అభిప్రాయం. స్క్రిప్టు చాలా బావుందని అనిపిస్తే...డిజిటల్ సినిమా అయినా చేస్తాను. భరత్ అనే నేను సినిమాకు ముందు నమ్రత నన్ను వేరే సినిమాల కోసం సంప్రదించారు. అయితే అప్పుడు డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్ల కుదరలేదు. ఆ తర్వాత భరత్ అనే నేను అవకాశం ఎప్పుడైతే వచ్చిందో మరో ఆలోచన లేకుండా ఎలాగైనా నటించాలని అనుకున్నా.

అర్జున్‌రెడ్డి రీమేక్‌లో నటిస్తున్నా

తెలుగులో విజయవంతమైన అర్జున్‌రెడ్డి హిందీ రీమేక్ నిర్మాణంలో ఉంది. హిందీ నేటివిటికీ తగ్గట్టుగా అనేక మార్పులు, చేర్పులు చేసి ఈ రీమేక్‌ను నిర్మిస్తున్నారు. చివరి సన్నివేశాల చిత్రీకరణతో షూటింగ్‌ను ఆరంభించారు. ఢిల్లీ నేపథ్యంలో కథ సాగుతుంది అంటూ ముగించారు.

మళ్లీ ఏం మాయ చేస్తారో...



అల్లు అర్జున్

అల్లు అర్జున్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో మళ్లీ సినిమా అనగానే భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వారిద్దరి కలయికలో వచ్చిన సన్నాఫ్ సత్యమూర్తి మంచి విజయాన్ని సాధించడం ఇందుకు కారణం. వైవిధ్యభరితమైన పాత్రలు చేయాలని పరితపించే కథానాయకుడిగా అల్లు అర్జున్‌కు, ఎమోషన్, వినోదం వంటి ఎలాంటి రసాన్ని అయినా అద్భుతంగా తెరపై పండించగల దర్శకుడిగా త్రివిక్రమ్‌కు పేరుంది. అలాంటి వీరిద్దరూ రెండోసారి సినిమా చేయబోతున్నారనగానే మళ్లీ ఎలాంటి మ్యాజిక్ చేస్తారోనన్న అంచనాలు ప్రేక్షకలోకంలో ఏర్పడ్డాయి. గీతా ఆర్ట్స్, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రం తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో ఉంటుందన్న మాటలు పరిశ్రమలో వినిపిస్తు న్నాయి. అయితే ఇందులో వాస్తవం ఎంతవరకు ఉందో ఇంకా తెలియక పోయినప్పటికీ... సన్నాఫ్ సత్యమూర్తి కూడా ఈ తరహా నేపథ్యంలోనే వచ్చి విజయవంత మైంది. అందుకే ఆ సెంటిమెంట్‌తో ఈ నేప థ్యాన్ని ఎందుకు న్నారని పరిశ్రమలో చెప్పు కుంటు న్నారు. ఇదిలావుండ గా...సంక్రాంతి అనగానే పెద్ద పండగగా పిలుస్తారు. దీనిని పల్లెల్లో ఎంతో బాగా చేస్తారు. ఈ తడవ అల్లు అర్జున్ తమ స్వస్థలమైన పాలకొల్లులో కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతిని జరుపుకోను న్నారట. ఆ పండుగ సంబరా లు పూర్తయిన తర్వాత ఇదే నెలలో త్రివిక్రమ్ దర్శకత్వం లో మొదలయ్యే చిత్రం షూటింగ్‌లో పాల్గొననున్నట్లు సమాచారం.

మణికర్ణిక నిర్మాణంలో సవాళ్లు ఎదుర్కొన్నా

- కంగనారనౌత్

మణికర్ణిక చిత్రీకరణ సమయంలో నా నుదుటికి గాయమైంది. ఎన్టీఆర్ బయోపిక్ చిత్రం కోసం క్రిష్ వెళ్లడంతో నేను దర్శకురాలిగా మారాల్సి వచ్చింది. దాంతో సినిమాను తెరకెక్కించే విషయంలో చాలా కంగారు పడ్డాను. ఇలా ఈ చిత్ర నిర్మాణంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నాను అని ఆ చిత్రం టైటిల్ పాత్రధారిణి కంగనారనౌత్ పేర్కొన్నారు. క్రిష్ జాగర్లమూడి, కంగనారనౌత్ దర్శకత్వంలో రూపొందిన మణికర్ణిక చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తెలుగు ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా కంగనారనౌత్ మాట్లాడుతూ, తెలుగులో ఇప్పుడు మాట్లాడలేను కానీ అర్థం చేసుకుంటాను. రచయిత విజయేంద్రప్రసాద్ నా కోసం ఓ మంచికథను రాస్తున్నారు. ఆ చిత్రం సమయానికి నేను తెలుగులో తప్పకుండా మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. లక్ష్మీబాయ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను ఎంతోబాగా అలరింపజేస్తుందన్న నమ్మకం ఉంది అని అన్నారు. అతిథిగా పాల్గొన్న



ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ, మణికర్ణిక టైటిల్స్‌లో తెలుగువాళ్లు విజయేంద్రప్రసాద్, క్రిష్ జాగర్లమూడి పేర్లు చూసి తానెంతో గర్వించానని అన్నారు. ఎన్టీఆర్ బయోపిక్ అవకాశం క్రిష్‌కు రాగానే....ఆ సినిమా చేయమని మనస్ఫూర్తిగా చెప్పిన మంచి నటి కంగనా. అంతేకాదు సినీ పరిశ్రమలో మీటూ అన్యాయాలను నిలదీసే వీర వనిత అయిన కంగనాను అందరూ అభినందించాలి అని అన్నారు.

రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ, కంగనా నూతన చిత్రం కోసం ఓ కథ రాస్తున్నాను. ఆ సినిమాకు ఆమే దర్శకత్వం వహించనున్నారు. అందులో తెలుగు భాషకు ఏదైనా అవకాశం ఉంటుందో చూడాలి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పనులు మొదలు కానున్నాయి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు మామిడి హరికృష్ణ, నిర్మాత కమల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



నాగచైతన్య సమంత

దేర్ ఈజ్ లవ్... దేర్ ఈజ్ పెయిన్

నాగచైతన్య, సమంత జంటగా నటిస్తున్న తాజా చిత్రానికి 'మజిలి' అనే టైటిల్ నిర్ణయించారు. 'దేర్ ఈజ్ లవ్... దేర్ ఈజ్ పెయిన్' అనేది ఉప శీర్షిక. 'నిన్ను కోరి' ఫేమ్ శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. వైజాగ్ నేపథ్యంలో కథనం జరుగుతుంది. దివ్యాంశ కౌశిక్ మరో హీరోయినగా నటిస్తోంది. రావు రమేష్, పోసాని కృష్ణమురళి, సుబ్బరాజు కీలక పాత్రధారులు. గోపీ సుందర్ సంగీతం, విష్ణు వర్మ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. సాహు గరపాటి, హరీష్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

అప్పుడు అమిర్... ఇప్పుడు షారుక్

సినిమాలు చేతులు మారడం సహజమే. బాలీవుడ్‌లో ఇలాంటివి తరుచూ జరుగుతూనే ఉంటాయి. అయితే స్టార్ హీరోల సినిమాలు చేతులు మారితేనే ఆసక్తికరంగా ఉంటుంది. తాజాగా ఇలా అమిర్ షారుక్ చిత్రాల మధ్య జరిగింది. ఆ సినిమానే రాకేష్ శర్మ జీవిత కథా చిత్రం. ఈ చిత్ర రచయిత రాజబలి ఆమిర్‌కు మంచి మిత్రుడు. దాంతో కథ సిద్ధమయ్యాక ఆమిర్‌కు వినిపించాడు. సారే జహాసే



అచ్ఛా పేరుతో చెప్పిన ఈ కథ బాగా నచ్చింది. అయితే థగ్స్ ఆఫ్ హిందూస్థాన్, మహాభారత అనే రెండు చిత్రాలకు ఎక్కువ కాలం డేట్స్ ఇచ్చాడు దాంతో రాకేష్ శర్మ బయోపిక్ చేయడం ఆమిర్ వల్ల కాలేదు. దాంతో తన మిత్రుడు షారుక్‌కు ఫోన్ చేసి కథ వినమని చెప్పాడు. కథ విన్న షారుక్ అద్భుతంగా ఉందంటూ మెచ్చుకున్నాడు. ఈ సినిమా చేస్తాననీ మాటిచ్చాడు. దాంతో తొలి భారతీయ వ్యోమగామి రాకేష్ శర్మ జీవిత కథా చిత్రం షారుక్‌కు దక్కింది. సెల్యూట్ అనే పేరును ఖరారు చేశారు. ఈ చిత్రానికి సిద్ధార్థ్ రాయ్ కపూర్, రోనిత్ స్క్రీన్‌వాలా నిర్మాణ బాధ్యతలు వహిస్తుండగా...మహేష్ మతాయి దర్శకత్వం వహిస్తున్నారు. భూమి ఫడ్నేకర్ నాయికగా ఎంపికైనట్లు సమాచారం. ఫిబ్రవరి నుంచి సెట్స్ మీదక ు వెళ్లనుందీ చిత్రం.



మోదీ బయోపిక్‌కు సన్నాహాలు

బయోపిక్ చిత్రాల ట్రెండ్ అప్రతిహతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్‌ను వెండితెరకెక్కించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయాన్ని ప్రముఖ సినీ ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ సోషల్‌మీడియాలో ట్వీట్ చేశారు. ఒమంగ్ కుమార్ దర్శకత్వంలో సందీప్‌సింగ్ ఈ చిత్రాన్ని నిర్మించనుండగా...మోదీ పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ నటించనున్నారు. సాధారణ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి...ఆ తర్వాత ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన మోదీ జీవితచరిత్రను సినిమాగా రూపొందిస్తే...ఎంతో స్ఫూర్తిగా ఉంటుందని భావించి ఈ చిత్రం రూపకల్పనకు సన్నాహాలు చేస్తున్నారట. ఈ నెల 7న ఫస్ట్‌లుక్‌ను విడుదలచేసి...ఇదే నెల రెండోవారంలో చిత్రం షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు సమాచారం.

యదార్ధ కథతో...

రక్షిత్ (లండన్ బాబులు ఫేమ్), నక్షత్ర జంటగా నటిస్తున్న చిత్రం 'పలాస 1978'. తమ్మారెడ్డి భరద్వాజ సమర్పకులు. కరుణ కుమార్ దర్శకత్వంలో అప్పారావు బెల్లన, అట్లూరి వరప్రసాద్ నిర్మిస్తున్నారు.

దర్శకుడు మాట్లాడుతూ "యదార్ధ సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్నాం. రచన, దర్శకత్వం విభాగాల్లో పనిచేసిన నేను దర్శకునిగా పరిచయం అవుతున్నాను" అని చెప్పారు.

"ఫిబ్రవరి 9న చిత్రీకరణ ప్రారంభిస్తున్నట్టు" నిర్మాతలు తెలిపారు. "పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌లో చిత్రీకరణతో పాటుగా నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకునే తొలి చిత్రమిది. ప్రముఖ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ గారు



రక్షిత్ నక్షత్ర

ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు" అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: రఘు కుంచె, ఛాయాగ్రహణం: విన్సెంట్ అరుల్, ఫైట్స్: రామ్ సుంకర.